అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 10-4-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 50 Published from Rangareddy, Hyderabad, Khammam, Karimnagar 12 పేజీలు వెల : 6.50

సాధారణ వర్షపాతమే

ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాల సీజన్ బలహీనం : స్కైమెట్ అంచనా



న్యూఢిల్లీ : ఈ సంవత్సరం దేశంలో సాధారణ వర్షపాతమే నమోదవుతుందని ప్రయివేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. దీర్ఘకాలంలో సగటున 102 శాతం వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. రుతుపవనాల సీజన్ మామూలుగానే ప్రారంభమైనప్పటికీ ద్వితీయార్థంలో ...11లో

కేంద్రమంత్రి మెడకు ఉచ్చు..!



- రాజీవ్ చంద్రశేఖర్ అఫిడవిట్ వివరాలు పరిశీలించి పంపండి : సీబీడీటీ అధికారులకు ఎన్నికల కమిషన్ ఆదేశం
- కాంగ్రెస్ ఫిర్యాదుపై స్పందించిన ఈసీ
- ఏడేండ్లలో వంద శాతం తగ్గిన మంత్రి ఆదాయం వివరాలు 3లో
- 500శాతం పెరిగిన భార్య ఆదాయం

సోషల్ మీడియాలో సీపీఐ (ఎం)

'కృత్రిమ మేధ'తో ప్రచారంలో దూసుకుపోతున్న మార్క్సిస్టులు



- 'సమత' పేరిట ఏఐ అవతార్ ఆవిష్కరణ
- అంకితభావంతో పనిచేస్తున్న వాలంటీర్లు, కామ్రేడ్లు
- ఎప్పటికప్పుడు ఓటర్లు, కార్యకర్తలకు తాజా సమాచారం

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తమవుతున్న సీపీఐ (ఎం) నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఓటర్లను చేరుకుంటోంది. 2014లోనే పలు సోషల్ నెట్‌వర్కింగ్, ఇంటరాక్టివ్ డిజిటల్ వేదికల్లో ఉనికిని చాటుకున్న పార్టీ దశాబ్ద కాలం తర్వాత ఇప్పుడు సామాజిక మాధ్యమానికి సంబంధించిన ...11లో

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న ఆప్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట దక్కలేదు. లిక్కర్ కేసులో 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)' తనను అరెస్టు చేయడం అక్రమం అంటూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీకి నష్టం చేసేందుకే సరిగ్గా సమయం చూసుకుని ఈడీ తనను ...11లో

కవితకు కస్టడీ పొడిగింపు

రౌస్ ఎవెన్యూ కోర్టు తీర్పు

- బీజేపీకి ఓటు వేయొద్దు..: కవిత
- అప్పుడెందుకు అరెస్టు చేయలేదని నిలదీత



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్‌స్కాం మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టు జ్యుడీషియల్ కస్టడీని పొడిగించింది. 23న తిరిగి ఆమెను కోర్టు ముందు హాజరు పరచాలని ఈడీ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ అయిన కవితకు గత నెల 26న రౌస్ ఎవెన్యూ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఆ కస్టడీ సమయం ముగియడంతో మంగళవారం ఆమెను మరోసారి అధికారులు కోర్టు ముందు హాజరుపరించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరపు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వర్చువల్ మోడ్ లో వాదనలు వినిపించారు. కవిత బయట ఉంటే కేసు దర్యాప్తు ప్రభావితం అవుతుందని కోర్టుకు నివేదించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కీలకదశలో ఉందని, ఆమె కస్టడీని మరో 14 రోజులు పొడిగించాలని కోరారు. అయితే ఈ వాదనలపై కవిత తరపు న్యాయవాది నితీశ్ రాణా అభ్యంతరం తెలిపారు. కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగించడానికి ఈడి వద్ద కొత్తగా ఏమి ...10లో

అప్పుల్లో కుటుంబాలు


పడిపోతున్న ఆదాయాలు.. పెరుగుతున్న భారాలు

- 47 ఏండ్ల కనిష్టానికి తగ్గిన పొదుపు సామర్థ్యం..
- ఆర్థిక వ్యవస్థలో సంక్షోభ ఛాయలు

గతంలో ఏదో పనిచేసైనా ఉన్నదాంట్లో దాచుకునే వారు. ఇపుడు కుటుంబం గడవటానికే అప్పులకోసం వెంపర్లాట తప్పటంలేదు.పదేండ్ల మోడీపాలనలో పేదలు మరింతలవుతుంటే..పెద్దలు మాత్రం శత కోటీశ్వరులైపోతున్నారు. చదువుకుని డిగ్రీలు చేతపట్టుకుని...ఉద్యోగం లభించక నిరుద్యోగం పెరిగిపోతోంది. ఏటా రెండుకోట్లమందికి ఉద్యోగాలిస్తామని ప్రకటించి..దశాబ్దం అయినా దిక్కులేదు. ఉపాధి లేక, కాలే కడుపులకు గంజి కూడా దొరక్క జనం గగ్గోలు పెడుతున్నారు.మరోవైపు దేశంలో ఉన్న పేదలు మధ్యతరగతికి చేరుకుంటున్నారని బీజేపీ సర్కార్ అంటోంది. గరీబోళ్లకు ఇచ్చే సబ్సిడీలకు ఎగనామం పెట్టడానికి చర్యలు తీసుకుంటూనే..ఎన్నికల్లో ఓట్లు రాబట్టుకోవటానికి 81 కోట్లమంది పేదలకు ఉచితబియ్యం అందిస్తామంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో తాజా నివేదికలు ఆర్థికవ్యవస్థ ముఖచిత్రాన్ని కండ్లకు కట్టినట్టు చూపుతున్నాయి.

న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ప్రజల ఆదాయాలు పడిపోవడం.. అప్పుల భారం పెరగడంతో దేశంలో ఆర్థిక సంక్షోభ చాయలు నెలకొన్నాయి. బీజేపీ ప్రభుత్వ విధానాలతో ప్రజల పొదుపు సామర్థ్యం దాదాపు ఐదు దశాబ్దాల కనిష్టానికి పడిపోయింది. ఉద్యోగాల్లేవ్, ఉపాధి కరువవటంతో..ఆదాయాలు, పొదుపు తగ్గింది. రుణాల భారం పెరగడంతో భారత కుటుంబాలపై ఆర్థిక ఒత్తిడి తీవ్రంగా పెరిగిపోయింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో కుటుంబాల అప్పు స్థాయి 40 శాతానికి చేరింది. మరోవైపు పొదుపు సామర్థ్యం జీడీపీలో 5 శాతానికి దిగజారి.. అతి కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సెప్టెంబర్ 2023 అంచనా ప్రకారం.. 2022-23లో కుటుంబాల నికర విత్త పొదుపు స్థాయి జీడీపీలో 5.1 శాతానికి పడిపోయింది. ఇది 47 ఏండ్ల కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. దీన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఖండించడం మరింత విమర్శలకు దారి తీసింది. నివాసాలు, వాహనాలు వంటి ఆస్తులను కొనుగోలు చేయడానికి రుణాలు తీసుకోవడం వల్ల కుటుంబాలు గతంలో కంటే తక్కువ నిజ ఆస్తులను కలిగి ఉన్నాయని ఆర్థిక శాఖ పేర్కొంది. ఇది సంక్షోభం కాదని, భవిష్యత్‌పై విశ్వాసమని చెప్పినా నమ్మే వారెవరూ లేకపోవడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ ప్రకటించిన 2022-23 జాతీయాదాయం సవరించిన అంచనాల్లో.. కుటుంబాల పొదుపు స్థాయి జీడీపీలో 5.3 శాతానికి తగ్గి.. 47 ఏండ్ల కనిష్ఠ స్థాయికి దిగజారింది. మరోవైపు కుటుంబాల అప్పులు జీడీపీలో 38 శాతానికి ఎగిశాయి. 2020-21లో ఇది రికార్డ్ స్థాయిలో 39.1 శాతంగా ఉంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రమాద ఘంటికలకు సంకేతం. మోతిలాల్ ఓస్వాల్ రిపోర్ట్ ప్రకారం.. 2022-23లో ప్రధానంగా ఆదాయాల వృద్ధిలో బలహీనతలు కుటుంబాల ...11లో



గుదిబండగా వ్యక్తిగత రుణాలు..

అవసరాల కోసం తీసుకుంటున్న వ్యక్తిగత రుణాలు కుటుంబాలకు గుదిబండగా మారుతున్నాయి. డిసెంబర్ 2023 నాటికి కుటుంబాల అప్పులు జీడీపీలో 40 శాతానికి పెరిగి కొత్త గరిష్ట స్థాయికి చేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి. బ్యాంకుల డేటా ఆధారంగా అన్‌సెక్యూర్డ్ వ్యక్తిగత రుణాలు వేగంగా పెరిగి కుటుంబాల అప్పులను మరింత పెంచనున్నాయి. ఆ తర్వాత సురక్షిత రుణాలు, వ్యవసాయ రుణాలు, వ్యాపార రుణాలు వేగంగా పెరుగుతాయి.

పాలక పక్షానికి కష్టం..

ప్రతిపక్షాలకు మంచి ఫలితాలు...

- తెలంగాణ భవన్‌లో ఉగాది వేడుకల సందర్భంగా పంచాంగకర్తలు
- మకర రాశి వారు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్రోధి నామ సంవత్సరంలో పాలక పక్షానికి కష్టాలు ప్రారంభంకానున్నాయని పంచాంగకర్తలు తెలిపారు. కొంచెం కష్టపడితే ప్రతిపక్షాలకు మంచి ఫలితాలు వస్తాయని వారు చెప్పారు. ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సీనియర్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాగకర్త ఫణీంద్ర కుమార్...క్రోధి నామ సంవత్సరంలో మంచి, చెడు మిశ్రమంగా కనిపిస్తున్నాయని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనీ, పాడిపంటలకు ఇబ్బంది ఉండబోదని వివరించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్ జాతకాలను ఆయన ఈ సందర్భంగా ...11లో



సారు పిలిచాడని పోతే.. సస్పెండయ్యారు

ప్రభుత్వ ఉద్యోగులతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి రహస్య సమావేశం

- ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని చర్యలు
- 106 మంది ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

నవతెలంగాణ-సిద్దిపేట/సిద్దిపేట కలెక్టరేట్

సార్ పిలిచాడని సమావేశానికి పోతే.. 106 మంది ప్రభుత్వ ఉద్యోగులు సస్పెండ్‌కు గురయ్యారు. ఈ వార్త ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేటలో ఐదేండ్లకు పైగా కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామిరెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా ...3లో



రైతు కుటుంబాల్లో వెలుగులు నింపుతాం..

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

- రవీంద్ర భారతిలో ఉగాది వేడుకలు
- పంచాంగం ఆవిష్కరణ

నవతెలంగాణ-కల్చరల్

రైతు కుటుంబాల్లో నవ వసంతాలను తెచ్చి, పున్నమి వెన్నెలను నింపడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. క్రోధినామ తెలుగు సంవత్సర ఉగాది వేడుకలను ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి లో ఘనంగా నిర్వహించారు. క్రోధీనామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. బాచుపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం చేశారు. అనంతరం సంతోష్ కుమార్ శాస్త్రిని సన్మానించారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి.. క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది నవ వసంతంలో రైతులకు మేలు కలగాలని, ప్రజలందరి ఆశయాలు నెరవేరి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఉగాది రోజున ...11లో



రోజుకో పేరు

ఖమ్మం కాంగ్రెస్ టిక్కెట్‌పై ఉత్కంఠ

- సీఈసీ ముగిసినా వీడని సందిగ్ధత
- కొత్తగా తెరపైకి మండవ, సుహాసిని పేర్లు
- ప్రసాద్‌రెడ్డికే అవకాశాలంటున్న శ్రేణులు







నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ టిక్కెట్‌పై ఉత్కంఠ కొనసాగుతోంది. పైగా టిక్కెట్ కేటాయింపు ఆలస్యమవుతున్నా కొద్దీ రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తోంది. జిల్లా రాజకీయాలతో సంబంధం లేని వారి పేర్లు కూడా వినిపిస్తుండటం ఆశ్చర్యం గొల్పుతోంది. ఖమ్మం స్థానానికి స్థానికేతరులను ఎక్కువగా ఆదరించిన గత చరిత్ర ఆధారంగా కొత్త పేర్లు వినిపిస్తున్నాయనే టాక్ నడుస్తోంది. కొత్తగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, గతంలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన నందమూరి హరికృష్ణ కూతురు సుహాసిని పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి కుమారుడు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి, వీవీసీ గ్రూపు సంస్థల అధినేత వంకాయల పాటి రాజేంద్రప్రసాద్ పేర్లు కూడా వ్యాప్తిలోనే ఉన్నాయి. మంత్రుల కుటుంబీకుల పేర్లు క్రమేణా పక్కకు పోతుండగా కొత్త పేర్లు తెరపైకి వస్తుండటం ఆసక్తికరంగా మారింది. అయినప్పటికీ మొదటి నుంచి టిక్కెట్ రేసులో ప్రముఖంగా వినిపిస్తున్న పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డికే ఎక్కువ అవకాశాలున్నాయని పార్టీ శ్రేణులు అంటున్నాయి. మరోవైపు మొన్న 6వ తేదీన హైదరాబాద్ తుక్కుగూడ సభకు ముందు మంత్రుల కుటుంబీకులకు ఎవరికీ ఇచ్చేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పినట్టు టాక్ నడుస్తోంది.

కాంగ్రెస్‌కు గ్యారంటీ సీటు కావడమేనా ప్రతిబంధకం..?

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి దాదాపు నెల రోజులవుతోంది. గత నెల 16వ తేదీన నోటిఫికేషన్ వచ్చింది. ఆ తర్వాత 14 మంది అభ్యర్థులపై కాంగ్రెస్ అధిష్టానం స్పష్టతనిచ్చింది. నాలుగు విడతలుగా అభ్యర్థులను ప్రకటించింది. ఏ ఒక్క జాబితాలోనూ ఖమ్మం ఊసు లేకపోవడం చర్చనీయాంశమైంది. ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలను గత ఎన్నికల్లో కాంగ్రెస్ కైవసం చేసుకుంది. 16 లక్షలకు పైగా ఓటర్లు ఉన్న ఈ శాసనసభ స్థానాల అన్నింటిలో కలిపి కాంగ్రెస్, దాని మద్దతుదారులు మూడు లక్షల పైచిలుకు ఓట్ల మెజార్టీ సాధించారు. కాబట్టి ఈ స్థానం నుంచి ...11లో

నీటి నిల్వలపై శ్వేతపత్రం ఇవ్వాలి

సాగునీటిని తక్షణమే విడుదల చేయండి : సీఎం రేవంత్‌కు సీపీఐ (ఎం) లేఖ

- కాళేశ్వరంపై సూచనలు స్వీకరించి, అఖిలపక్షం ముందుంచాలని విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో ప్రస్తుతం పంటలెండిపోతున్నాయని సీపీఐ (ఎం) ఆందోళన వ్యక్తం చేసింది. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది. వారిని తక్షణం ఆదుకునేందుకు వీలుగా శ్రీరాం సాగర్, మానేరు, మల్లన్న సాగర్ తదితర జలాశయాల్లోని నీటి నిల్వలకు సంబంధించిన పూర్తి వివరాలతో శ్వేతపత్రాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరింది. తద్వారా సాగునీటి విడుదలకు ఉన్న అవకాశాలను స్పష్టం చేయాలని విజ్ఞప్తి చేసింది. నీటిని విడుదల చేయటం ద్వారా కాపాడగలిగిన మేరకు పంటలను కాపాడాలని సూచించింది. మిగిలిన వాటికి నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి.నాగయ్య, టి.సాగర్... ముఖ్యమంత్రి ...11లో

మహాలో సీట్ల సర్దుబాటు

శివసేన 21, కాంగ్రెస్ 17, ఎన్సీపీ 10 స్థానాల్లో పోటీ

- బీజేపీని ఓడించడమే కూటమి లక్ష్యం: ఠాక్రే, పటోలే



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరింది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన పార్టీకి 21 సీట్లు కేటాయించారు. ఇక కాంగ్రెస్ పార్టీ 17 సీట్లలో అభ్యర్థులను నిలపనుంది. అలాగే శరద్ పవార్ సారథ్యంలోని నేషలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) 10 సీట్లలో పోటీ చేస్తోంది. సాంగ్లీలో తిరిగి శివసేన (ఠాక్రే) పోటీ చేస్తుంది. భీవండిలో మాత్రం ఎన్సీపీ తమ పార్టీ అభ్యర్థిని దింపుతోంది. ఆయా స్థానాలపై కాంగ్రెస్ కాస్త వెనక్కి తగ్గింది. అయితే ముంబయి ఉత్తరం లోక్‌సభ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ తీసుకుంది. ఎన్సీపీ అధినేత శరద్ పవార్, శివసేన (ఠాక్రే) నేత ఉద్ధవ్ ఠాక్రే, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే వారం రోజుల పాటు సాగిన చర్చల అనంతరం రాష్ట్రంలోని 48 లోక్‌సభ స్థానాలకు ఎన్నికల పొత్తును ప్రకటించారు. బీజేపీని ఓడించడమే కూటమి లక్ష్యమని ...11లో

మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి జీవితం ఆదర్శనీయం

- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతరాములు :చిట్యాలలో నర్రా వర్ధంతి సభ



నవతెలంగాణ-చిట్యాలటౌన్

సీపీఐ(ఎం) సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి జీవితం ఆదర్శనీయమని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలలో మంగళవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నర్రా రాఘవరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. రాఘవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం చెరుపల్లి మాట్లాడుతూ.. నకిరేకల్ నియోజకవర్గంలో ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన రాఘవరెడ్డి ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. జీవితాంతం ప్రజల కోసమే పనిచేశారన్నారు. రాఘవరెడ్డి శిష్యుడిగా తాను ఎంతో గర్విస్తున్నానన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడమే రాఘవరెడ్డికి నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, నాయకులు శీలా రాజయ్య, బొబ్బిలి సుధాకర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు గుండాల యాదయ్య, చంద్రమౌళి, బొబ్బిలి వెంకటరెడ్డి, కొంపెల్లి రమేష్, నలపరాజు శేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం పండుగ పూట ఆందోళన

- ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



నవతెలంగాణ-అర్వపల్లి

తాగు నీరు కూడా అందడం లేదంటూ మహిళలు ఆందోళనకు దిగారు. మంగళవారం ఖాళీ బిందెలతో సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం తిమ్మాపురం గ్రామంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. పది రోజుల నుంచి తిమ్మాపురం క్రాస్‌రోడ్ వద్ద నీళు రావడం లేదని, అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగాది పండుగ రోజున కనీసం స్నానాలు చేయడానికి కూడా నీళ్ల లేకపోవడంతో ఆందోళన చేయాల్సి వచ్చిందన్నారు. వెంటనే అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. గ్రామ ప్రత్యేకాధికారి శశిరెడ్డికి సమాచారం అందజేయడంతో ఆయన అక్కడకు చేరుకుని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు. వాటర్‌ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు బొల్లం నిమ్మమ్మ, మాజీ వార్డు సభ్యులు బొల్లం వెంకటేశ్వర్లు, బొల్లం జానయ్య, జీడీ పూలమ్మ, మద్ది మల్లమ్మ, తొండల కొండమ్మ, చామకూరి నాగమ్మ, వేముల కొండలక్ష్మమ్మ, కోడెబోయిన సైదమ్మ, నాగరాజు, మహేష్, కోటేష్, కృష్ణ, గోపయ్య, రఘుపతి తదితరులు పాల్గొన్నారు

పల్లె రవికుమార్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

- టైరు పగిలి మెట్రో పిల్లర్‌ను ఢీకొన్న కారు



నవతెలంగాణ-చైతన్యపురి

తెలంగాణ జర్నలిస్టుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షుడు, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పల్లె రవికుమార్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. మంగళవారం ఖైరతాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన స్నేహితుడిని పరామర్శించిన అనంతరం ఆయన ఎల్‌బీనగర్‌లోని ఇంటికి కారులో బయల్దేరారు. అయితే మార్గమధ్యంలో కొత్తపేట రైతు బజార్ వద్ద కారు టైరు పగిలిపోయి ఊడిపోయింది. దాంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను, మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో రవికుమార్‌కు ఎలాంటి గాయాలూ కాలేదు. డ్రైవర్ ఖదీర్ స్వల్పంగా గాయపడ్డాడు.

వచ్చే ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వానలు

- రాష్ట్రంలో తగ్గిన ఉష్ణోగ్రతలు..చల్లబడ్డ వాతావరణం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే ఐదురోజుల పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. మంగళవారం రాష్ట్రంలో మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా వర్షం కురిసింది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కళ్లకల్‌లో అత్యధికంగా 1.05 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లా వడ్డేమానులో అత్యధికంగా 40.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల పరిధిలో మాత్రం 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వచ్చే మూడు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు మరో రెండు, మూడు డిగ్రీల మేర తగ్గే అవకాశాలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందనీ, గరిష్ట ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

'మైనంపల్లి' మంత్రం పారేనా..?

కాంగ్రెస్ 'మల్కాజిగిరి' ఇన్‌చార్జీగా బాధ్యతలు
ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూడింటిపై పట్టు
పార్టీ, సర్కార్ అండ.. కార్యకర్తలే బలం..!





నవతెలంగాణ-సిటీబ్యూరో

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునిత మహేందర్‌రెడ్డి గెలుపు బాధ్యతలను ఆ పార్టీ అధిష్టానం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు అప్పగించింది. టీడీపీలో సీనియర్ నాయకుడిగా ఎదిగిన మైనంపల్లి బీఆర్ఎస్‌లో చేరడం, అనంతరం రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తాజాగా పార్టీ అధిష్టానం ఒక్కో నియోజకవర్గానికి ఒక ఇన్‌చార్జిని నియమించింది. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సంబంధాలు ఎక్కువగా ఉన్న మైనంపల్లికి పార్లమెంట్ ఎన్నికల బాధ్యతలు కట్టబెట్టింది.

పోల్ మేనేజ్‌మెంట్.. ఆర్థిక వ్యవహారాలపై చర్చ..

మైనంపల్లికి పలు పర్యాయాలు ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం ఉంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ఈ ఓటమికి ప్రధాన కారణం పోల్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఆర్థిక వ్యవహార లోపమే అనే విమర్శలు ఉన్నాయి. అయితే, అప్పటితో పోలిస్తే ప్రస్తుత పరిస్థితులు వేరనీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టడం, కార్యకర్తల బలం, భారీగా చేరికలు, సీనియర్ నాయకుడు మైనంపల్లి ఇన్‌చార్జిగా ఉండటం అభ్యర్థికి కలిసొచ్చే అంశాలని ఆ పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మెదక్ నుంచి కుమారుడు పోటీ చేయడంతో ఆ భారం కూడా ఈయనపైనే పడింది. మల్కాజిగిరి గెలిచేస్తానన్న ధీమాతో పట్టించుకోలేదని తెలుస్తోంది. ఈసారి అలాంటి లోపం లేకుండా పూర్తిగా మల్కాజిగిరిపైనే మైనంపల్లి దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఆ నేపథ్యంలోనే ఆయనకు బాధ్యతలు అప్పగించినట్టు తెలుస్తోంది. అయితే నిన్న మొన్నటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావే కొనసాగుతారని అందరూ భావించారు. దీంతో పోల్ మేనేజ్‌మెంట్‌తోపాటు ఆర్థిక వ్యవహారాలను ఆయన చూసుకుంటారు.. మనం ప్రచారం చేస్తే సరిపోతుందని పార్టీ క్యాడర్, సీనియర్ నాయకులు భావించారు. అనూహ్యంగా ఇన్‌చార్జి బాధ్యతలు మైనంపల్లి హనుమంతరావుకు అప్పగించడంతో పోల్ మేనేజ్‌మెంట్, ఆర్థిక వ్యవహారం అనేది ప్రశ్నార్థకంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి నియోజకవర్గంలో పోల్‌మేనేజ్‌మెంట్ సరిగా లేదనీ, ఆర్థిక వ్యవహారాలు కూడా సక్రమంగా జరగకపోవడంతోనే మైనంపల్లి ఓటమి పాలయ్యారనే అపవాదు ఉంది. కాంగ్రెస్ పార్టీలో పోల్ మేనేజ్‌మెంట్, ఆర్థిక వ్యవహారాలను స్వయంగా ఆయనే చూసుకుంటారా..? లేక అభ్యర్థి తరపు వారు హ్యాండిల్ చేస్తారా..? లేక నియోజకవర్గాల ఇన్‌చార్జీలకు అప్పగిస్తారా..? అనే అంశాలు చర్చనీయాంశమవుతున్నాయి.

మూడింటిలో పరిచయమే..

సునితా మహేందర్‌రెడ్డి గెలుపు కోసం ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన మైనంపల్లి హనుమంతరావుకు అనుకూల, ప్రతికూల పరిస్థితులపై రాజకీయ చర్చ మొదలైంది. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోకవర్గాలు ఉన్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సుపరిచితుడిగా ఎదిగిన మైనంపల్లికి.. ఆ జిల్లా పరిధిలోని మేడ్చల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో క్యాడర్, లీడర్లు ఉన్నారు. కార్యకర్తలను సమన్వయం చేయడం, కాంగ్రెస్‌కు మెజార్టీ ఓట్లు సాధించడం సులభమేనని అనుచరులు అంటున్నారు. మిగిలిన నియోజకవర్గాలైన ఉప్పల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, కూకట్‌పల్లిలో మైనంపల్లికి పెద్దగా పరిచయం ఉన్న నాయకులు లేకున్నా కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం ఉంది. ఈ నాలుగు ప్రాంతాలపై ఆయనకు పట్టు లేకపోవడంతో నాయకులను సమన్వయం చేసుకోవడంలో కాస్త ఇబ్బంది పడే అవకాశం ఉంది. కాగా.. ఏడు నియోజకవర్గాల్లో ఒక్కరూ కాంగ్రెస్ ఎమ్మెల్యే లేరు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సునితా మహేందర్‌రెడ్డిని గెలిపించాలంటే చెమటోడ్చక తప్పదని విశ్లేషకులు చెబుతున్నారు.

చేరికలతో మరింత బలం..

మల్కాజిగిరి పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. 2018 ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి. అయినా అప్పటి ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఎంపీగా గెలిచారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒకటి, రెండు స్థానాలు మినహా మిగతా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచారు.

ఈ సమీకరణాలకు సిట్టింగ్ ఎంపీ రేవంత్‌రెడ్డి సీఎం కావడం, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం తోడు కావడంతో గెలుపు సాధ్యమే అని పార్టీ శ్రేణులు లెక్కలేసుకుంటున్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లోకి చేరికలు పెరిగాయి. పేరున్న నాయకులతోపాటు సెకండ్ క్యాడర్, మేయర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మండల, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అధికార పార్టీలో చేరిపోయారు. బోడుప్పల్‌కు చెందిన 10 మందికిపైగా కార్పొరేటర్లు, నిజాంపేట మేయర్ నీలా గోపాల్‌రెడ్డి దంపతులు, కీసర ఎంపీపీతోపాటు మరికొందరు ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన కూన శ్రీశైలంగౌడ్ సైతం అధికార పార్టీలో చేరడంతో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుపై జోరుగా చర్చ నడుస్తోంది. ఇలాంటి తరుణంలో మల్కాజిగిరిలో 'మైనంపల్లి' మంత్రం పారుతుందో..? లేదో..? తెలియాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే..!.

కూల్ డ్రింక్స్‌ను నిషేధించాలి

- పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగాలి : మాజీ వీసీ ప్రొ. ఎస్వీ సత్యనారాయణ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. కోయ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-ఓయూ

దేశ ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న శీతల పానీయాలను నిషేధించాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రజలు కూడా ఎవరికి వారే హానికరమైన కూల్ డ్రింక్స్‌ను బహిష్కరించాలని సూచించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్వీ సత్య నారాయణ మాట్లాడుతూ.. దేశ ప్రజల ఆరోగ్యానికి శీతల పానీయాల రూపంలో పెనుముప్పు పొంచి ఉందన్నారు. పురుగుల మందుల తయారీలో వాడే రసాయనాలతో కూల్ డ్రింక్స్ తయారు చేస్తున్నారని చెప్పారు. వాటిని తాగితే ప్రజల ఆరోగ్యం పాడవుతుందన్నారు. గ్రామాల్లోనూ తాగునీరు లేకున్నా శీతల పానీయాలు మాత్రం పుష్కలంగా దొరుకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించి మరీ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నామని వాపోయారు. కూల్ డ్రింక్స్ కన్నా ప్రకృతి సిద్ధ పానీయాలు ఎంతో మేలన్నారు. ప్రతి ఒక్కరూ కూల్ డ్రింక్స్ కాకుండా సహజ పానీయాలైన కొబ్బరి నీళ్లు, చెరుకజూ, నిమ్మ, పండ్ల రసాలు తాగడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. అందరూ కలిసి ఒకచోట చేరి పండుగలు జరుపుకోవడం వల్ల మానవ సంబంధాలు మెరుగుపడతాయని చెప్పారు. నేటి ఆధునిక సమాజంలో మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టెక్నాలజీ పెరిగి ప్రపంచమంతా కుగ్రామంగా మారినా ప్రజలు మాత్రం ఒంటరి వారయ్యారని, సెల్ ఫోన్స్ మనుషులను ఏకాకిలను చేస్తున్నాయని చెప్పారు.జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోయ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. కూల్ డ్రింక్స్ వల్ల ఎలాంటి ఉపయోగాలూ లేవన్నారు. కూల్ డ్రింక్స్ పేరుతో కంపెనీలు వేల కోట్ల వ్యాపారాన్ని చేస్తున్నాయని, కానీ ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదన్నారు. లాభాలు పెంచుకునేందుకు కంపెనీలు సినిమా తారలతో వ్యాపార ప్రకటనలు ఇచ్చి అసత్య ప్రచారాలు ముమ్మరం చేస్తున్నాయని తెలిపారు. కోలా కంపెనీలకు లాభాలు తప్ప ప్రజల ఆరోగ్యం పట్టదన్నారు. అలాగే దేశంలో నీటిని ఈ కంపెనీలు విచ్చలవిడిగా వినియోగించుకుంటూ నీటి ఎద్దడికి కారణం అవుతున్నాయని చెప్పారు. మన దేశంలో కూల్ డ్రింక్స్‌లో అధిక శాతం పెర్టీసైడ్స్ కలుపుతున్నారని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా జేవీవీ ఇలా కూల్ డ్రింక్స్ అనర్థాలపై అవగాహన కల్పిస్తూ.. ఉగాది రోజున పచ్చడిని పంపిణీ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ఐ పురస్కరించుకుని మంగళవారం జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. దేశ ప్రజల ఆరోగ్యానికి శీతల పానీయాల రూపంలో పెనుముప్పు పొంచి ఉందన్నారు. పురుగుల మందుల తయారీలో వాడే రసాయనాలతో కూల్ డ్రింక్స్ తయారు చేస్తున్నారని చెప్పారు. వాటిని తాగితే ప్రజల ఆరోగ్యం పాడవుతుందన్నారు. గ్రామాల్లోనూ తాగునీరు లేకున్నా శీతల పానీయాలు మాత్రం పుష్కలంగా దొరుకు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బులు చెల్లించి మరీ అనారోగ్యాన్ని కొనితెచ్చు కుంటు న్నామని వాపోయారు. కూల్ డ్రింక్స్ కన్నా ప్రకృతి సిద్ధ పానీయాలు ఎంతో మేలన్నారు. ప్రతి ఒక్కరూ కూల్ డ్రింక్స్ కాకుండా సహజ పానీయాలైన కొబ్బరి నీళ్లు, చెరుక

ప్రకృతి పానీయాలు ఆరోగ్యానికి మేలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

- గడియారం సెంటర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ



నవతెలంగాణ-నల్లగొండ టౌన్

ప్రకృతిలో లభించే పానీయాల వల్ల ఆరోగ్యాలకు ఎంతో మేలు జరుగుతుందని, కృత్రిమ పానీయాల వల్ల ఆరోగ్యాలు పాడవుతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో 'హానికరమైన కృత్రిమ పానియాలు మానేద్దాం- ప్రకృతి పానియాలు సేవిద్దాం' అనే నినాదంతో టీఎస్‌యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతిలో జరిగే మార్పులను ఉగాది పండుగ సూచిస్తుందన్నారు. ఉగాది పచ్చడిలో ఉండే షడ్రుచులకు సంబంధించిన పదార్థాలు మానవ ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. కార్పోరేట్ శక్తుల లాభాలను పెంచేందుకే సీతల పానీయాలు వచ్చాయని, వాటిని తాగడం వల్ల అనారోగ్యమే తప్ప లాభం లేదని అన్నారు. మహేష్‌బాబు లాంటి సినిమా హీరోలు శీతల పానీయాల అడ్వర్టైజ్‌మెంట్‌లు ఇస్తూ యువతను పెడదారి పట్టిస్తున్నారని, అలాంటివారు నిజంగా హీరోలేనా సమాజానికి నిజమైన విలన్స్‌గా భావించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా పదేండ్లుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందున వారిని అభినందిస్తున్నట్టు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కమిటీలు సమాజానికి మేలుకోరే ఇలాంటి కార్యక్రమాలు చేయాలని సూచించారు. శీతల పానియాలు తయారు చేసే కంపెనీలకు ప్రభుత్వాలు ఇబ్బడి ముబ్బడిగా రాయితీలు కల్పిస్తున్నాయని, ఆ రాయితీలను రద్దు చేయాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ.. శాస్త్రీయ ఆలోచనతోనే సమాజం ముందుకు పోతుందని, శాస్త్రీయ వైఖరులను అలవర్చుకునే యువత తమ భవిష్యత్‌ను ఉజ్వలంగా మలుచు కోగలుగుతుందని చెప్పారు. బహుళ జాతీయ సంస్థలు తమ స్వప్రయోజనాల కోసం మార్కెట్లోకి విచ్చలవిడిగా సరఫరా చేస్తున్న శీతల పానీయాలను తాగొద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సుమారు 800 మంది ప్రజలు ఉగాది పచ్చడి సేవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జీవీవీ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, జేవీవీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు జి.అరుణ, గేర నర్సింహ, నలపరాజు వెంకన్న, మురళయ్య, సోషల్ మీడియా కన్వీనర్ యరనాగుల సైదులు, వీఓ టి.భానుప్రసాద్, రవి, సైదులు పాల్గొన్నారు.

మే 13న ఓటేయండి.. ప్రజాస్వామ్య బాధ్యతను నిర్వర్తించండి

- తెలంగాణలో పాడిపంటలు బాగా పండాలి
- తెలుగు భాష అందమైనది..నృత్యకీర్తనలు గొప్పవి
- రాష్ట్ర ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు : రాజ్‌భవన్ ఉగాది వేడుకల్లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజాస్వామ్య బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. తెలుగు భాష అందమైనదనీ, తెలుగులోని నృత్యకీర్తనలు ప్రపంచంలోనే పేరొందినవని కొనియాడారు. రాష్ట్రంలో పాడి పంటలు బాగా పండాలనీ, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఉగాది వేడుకలను పురస్కరించుకుని పంచాంగ పఠనం నిర్వహించారు. శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థులు శాస్త్రీయ, బంజారా నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరధే, రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, గవర్నర్ కార్యదర్శి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఐఏఎస్, ఐపీఎస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో తెలంగాణ మరింత దూకుడుగా ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. మన దేశం అన్ని రంగాల్లో స్వదేశీ ఉత్పత్తులతో ముందుకు వెళ్తున్నదని చెప్పారు. జ్యోతిష్య అంచనాలు ఏమైనప్పటికీ నిరంతర ప్రయత్నాలు, నిబద్ధత, పట్టుదలతో అభ్యుదయ సమాజ నిర్మాణం అనే కలను సాకారం చేసుకోగలుగుతామనేది దృఢ విశ్వాసం తనకున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉగాది పచ్చడి ఆరు రుచులను కలగలుపుకుని పోయినట్టు ప్రతి ఒక్కరూ తమ జీవితంలో వచ్చే కష్టాలను దృఢ సంకల్పంతో ఎదుర్కొని ముందుకెళ్లాలని సూచించారు. అరవై సంవత్సరాల కాలచక్రంలో క్రోధి ముప్పై ఏడవదనీ, ఈ సంఖ్య శుభసూచికమని చెప్పారు. దేశం సర్వతోముఖాభివృద్ధి, పురోగతి, స్వావలంబన కోసం ప్రత్యేకంగా ప్రార్థిస్తున్నానన్నారు. దేశీయ పరిశోధనలు, ఆవిష్కరణలు, అధిక ఉత్పత్తుల సంస్కృతిని ప్రోత్సహిద్దామని పిలుపునిచ్చారు. జీవితంలో మనం అన్ని అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూ, మన ప్రయత్నాలపై విశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

డీఎస్పీ ప్రణీత్‌రావు బెయిల్‌పై నేడు కోర్టు నిర్ణయం

- నలుగురు కానిస్టేబుళ్ల నుంచి ఫోన్‌ట్యాపింగ్‌పై మరింత సమాచారం సేకరిస్తున్న స్పెషల్‌టీం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో నిందితుడైన డీఎస్పీ ప్రణీత్‌రావు బెయిల్‌పై బుధవారం నాంపల్లి కోర్టు నిర్ణయం తీసుకోనున్నది. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ ప్రణీత్‌రావు సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఈయనకు బెయిల్ ఇవ్వరాదనీ, కేసు ఇంకా విచారణ సాగుతున్నదనీ, ఒకవేళ బెయిల్ లభిస్తే ప్రణీత్‌రావు ఆధారాలను తారుమారు చేసే అవకాశమున్నదని పంజాగుట్ట స్పెషల్ టీం తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. వీరిద్దరి వాదనలను విన్న న్యాయమూర్తి తన తీర్పును బుధవారానికి వాయిదావేశారు.

ఈ కేసు దర్యాప్తు జరుపుతున్న పోలీసు అధికారులు.. తమ అదుపులో ఉన్న నలుగురు ఎస్‌ఐబీ కానిస్టేబుళ్లను ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై క్షుణ్ణంగా విచారిస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు బుజంగరావు, తిరుపతన్నలతో పాటు నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీజీపీ రాధాకిషన్‌రావులు ఇచ్చిన పలు ఆదేశాలను ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి వీరు అమలు చేసినట్టు ఆరోపణలున్నాయి.

అంతేగాక, గత ఉప ఎన్నికల సందర్భంలో విపక్షాలకు చెందిన వాహనాలను అడ్డుకొని అందులో నుంచి కోట్ల రూపాయల డబ్బులను స్వాధీనం చేసుకోవటంలో ఈ కానిస్టేబుళ్ల పైఅధికారుల ఆదేశాలను తూ.చా తప్పకుండా పాటించారని విచారణలో వెల్లడైనట్టు తెలుస్తున్నది. దీంతో వీరెక్కడెక్కడ, ఎవరెవరి నాయకుల వాహనాలను అడ్డగించి, ఎంతమేర డబ్బులను స్వాధీనపర్చుకున్నారు? ఆ డబ్బులను ఎక్కడికి తరలించారు? అనే కోణంలో స్పెషల్ టీం అధికారులు సీరియస్‌గా ఆరా తీస్తున్నట్టు సమాచారం.

బుధవారంతో తమ కస్టడీలో ఉన్న రాధాకిషన్‌రావు విచారణ గడువు పూర్తవుతుండటంతో ఆయనను కోర్టులో హాజరుపర్చటానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. కాగా, మంగళవారం కూడా రాధాకిషన్‌రావును ఈ కేసు దర్యాప్తును నిర్వహిస్తున్న స్పెషల్ టీమ్‌ను పర్యవేక్షిస్తున్న నగర పశ్చిమ మండలం డీసీపీ విజయ్‌కుమార్ క్షుణ్ణంగా విచారించినట్టు సమాచారం. ఈ సందర్భంగా కొంత అదనపు సమాచారాన్ని ఫోన్ ట్యాపింగ్‌లకు సంబంధించి ఆయన సేకరించినట్టు తెలుస్తున్నది.

రైతులకు ఇబ్బందులు రానియ్యం

- గజ్వేల్ రైతులకు మంత్రి కోమటిరెడ్డి హామీ
- ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంటు మార్చాలంటూ బాధితుల మొర



నవతెలంగాణ-హైదరాబాద్

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆర్‌ఆర్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న గజ్వేల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన దాదాపు 500 మంది రైతులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. పీర్లాపల్లి, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లి, ఆలీరాజ్‌పేట్, నర్సన్నపేట, చేబర్తి, పాతూరు, మక్తామాసాన్‌పల్లి, సామలపల్లి, సెంటూర్, బంగ్లవెంకటాపూర్, బేగంపేట్, ఎల్కంటి గ్రామాలకు చెందిన రైతులకు ఇటీవల ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణ భూసేకరణకు నోటీసులు వచ్చాయన్నారు. అయితే తాము ఇప్పటికే మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుల నిర్మాణాలతో భూనిర్వాసితులం అయ్యామని తెలిపారు.

మళ్లీ తమకు మిగిలిన కొద్దిపాటి భూములు ఆర్‌ఆర్‌ఆర్‌లో పోతే తాము జీవనాధారం కోల్పోతామంటూ బాధితులు మంత్రి దష్టికి తీసుకువచ్చారు. మా పరిస్థితిని మానవతా ధక్పథంతో పరిశీలించి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చేందుకు చొరవచూపాలని మంత్రి కోమటిరెడ్డిని కోరారు. రైతులతో సుదీర్ఘంగా మాట్లాడిన మంత్రి వారి సాధకబాధకాలను తెలుసుకుని, తాను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆందోళన చెందవద్దని రైతులకు ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాల వలన రాష్ట్ర భవిష్యత్తును మార్చే ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వంలా ఒంటెద్దు పోకడలు పోకుండా.. ప్రజాస్వామ్యయుతంగా రైతుల సమస్యలను తీర్చుతూనే రాష్ట్ర అభివద్ధికి పాటుపడతామని చెప్పారు.




రెండో దశ సార్వత్రిక ఎన్నికల బరిలో
1,210 మంది అభ్యర్థులు

- 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ఎన్నికల్లో 88 స్థానాలకు ఎన్నికలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రెండో దశ సార్వత్రిక ఎన్నికల్లో 1,210 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికల రెండో దశలో 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరిగే 88 స్థానాల్లో 1,210 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. 88 స్థానాల్లో 2,633 నామినేషన్లు దాఖలయ్యాయి. దాఖలైన 2,633 నామినేషన్ల పరిశీలన తరువాత 1,428 నామినేషన్లు చెల్లుబాటు అయ్యేవిగా గుర్తించినట్లు పేర్కొంది. మొత్తం 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నామినేషన్ల ఉపసంహరణ తరువాత 1,210 మంది బరిలో ఉన్నారని పేర్కొంది. కేరళలో 20 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి అత్యధికంగా 500 నామినేషన్లు, కర్ణాటకలోని 14 స్థానాల నుంచి 491 నామినేషన్లు వచ్చాయి. త్రిపురలో ఒక స్థానం నుంచి కనీసం 14 నామినేషన్లు వచ్చాయి. మహారాష్ట్రలోని నాందేడ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి గరిష్టంగా 92 నామినేషన్లు వచ్చాయి. అయితే కేరళలో 500 నామినేషన్లలో 204 నామినేషన్లను ఆమోదించగా, మిగిలిన వాటిని తిరస్కరించారు. నామినేషన్ల ఉపసంహరణ తరువాత, 194 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కర్నాటకలో 247, మహారాష్ట్రలో 204, కేరళలో 194, రాజస్థాన్ 152, ఉత్తరప్రదేశ్‌లో 91, మధ్యప్రదేశ్‌లో 88, అసోంలో 61, బీహార్‌లో 50, పశ్చిమ బెంగాల్‌లో 47, చత్తీస్‌గఢ్ లో 41, జమ్ము కాశ్మీర్‌లో 22, త్రిపురలో 9 మంది బరిలో ఉన్నారు.

ఇదిలావుండగా, పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మరో 100 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పారామిలిటరీ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)ని మోహరించాలని ఎన్నికల సంఘం హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖని ఆదేశించినట్టు వర్గాలు తెలిపాయి.



ఉత్తుత్తి హామీలే..

పదేండ్ల పాలనలో అన్ని వర్గాలకూ మొండిచెయ్యే

- ఆందోళనకరంగా పేదరికం, నిరుద్యోగం
- అన్నదాతలకు అందని చేయూత
- మహిళలపై పెరుగుతున్న నేరాలు
- మరోసారి ఓట్ల వేటకు సిద్ధమవుతున్న కమలదళం

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లను బుట్టలో వేసుకొనే దిశగా బీజేపీ తన ఎన్నికల ప్రణాళికను ఆకర్షణీయంగా రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది. ఇందులో ప్రధానంగా నాలుగు వర్గాలపై... పేదలు, యువకులు, రైతులు, మహిళలు... దృష్టి సారించే అవకాశాలు కన్పిస్తున్నాయి. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తవుతున్నాయి. గతంలో కూడా ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఆయా వర్గాలపై బీజేపీ హామీల వర్షం కురిపించింది. అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత వాటన్నింటినీ గాలికి వదిలేసింది. బీజేపీ ఈ పది సంవత్సరాల కాలంలో ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేసిన దాఖలాలు లేవు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు తరుముకొచ్చే సరికి పేదలు, అన్నదాతలు, మహిళలు, యువత గుర్తొచ్చారు. వారిపై ఎక్కడ లేని ప్రేమ ముంచుకొచ్చింది. గత చరిత్రను పరిశీలిస్తే మాత్రం కమలదళం ఇస్తున్న హామీలు నీటి మూటలేనని స్పష్టమవుతోంది.

పాక్, బంగ్లా కంటే పేదరికం అధికం

నిటి ఆయోగ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం గత తొమ్మిది సంవత్సరాల్లో 24.82 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడ్డారు. పేదరిక నిష్పత్తి 2013-14లో 29.17శాతం ఉండగా 2022-23 నాటికి గణనీయంగా తగ్గి 11.28 శాతానికి చేరుకుంది. అయితే కోవిడ్ సమయంలో పెరిగిన పేదరికాన్ని ఈ నివేదిక పరిగణనలోకి తీసుకోలేదని నిపుణులు తెలిపారు. వినియోగ పేదరిక రేఖ (అంతర్జాతీయంగా పేదరికాన్ని అంచనా వేసేందుకు అవలంబించే సంప్రదాయ పద్ధతి) సమాచారాన్ని తీసుకోలేదని మరి కొందరు ఎత్తిచూపుతున్నారు. అంతేకాదు... గత ఆరు సంవత్సరాలుగా దేశంలో వాస్తవ వేతనాల్లో పెరుగుదల కన్పించడం లేదు. అవి స్థిరంగానే ఉన్నాయి. ఈ పరిణామం వినియోగ డిమాండ్‌పై ప్రభావం చూపింది.

ప్రపంచబ్యాంక్ తెలిపిన వివరాల ప్రకారం పేదరిక రేటు, అంతర్జాతీయ దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న ప్రజల దామాషా 2018 వరకూ నిలకడగా తగ్గుతూ వచ్చింది. ఆ తర్వాత పెరుగుదల కన్పించింది. 2020లో... అంటే కోవిడ్ సమయంలో గరిష్ట స్థాయికి చేరింది. 2021లో మళ్లీ తగ్గింది. మన దేశంలో పేదరిక రేట్లు పొరుగున ఉన్న బంగ్లాదేశ్, పాకిస్తాన్‌తో పోలిస్తే బాగా అధికంగా ఉన్నాయి.

అభద్రతలో యువత

యువతకు ఉపాధి కల్పించే విషయంలో మోడీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసింది. దేశంలో నిరుద్యోగులుగా ఉన్న వారిలో 83శాతం మంది యువతేనని ఇండియా ఎంప్లాయిమెంట్ నివేదిక-2024 తెలిపింది. దీనిని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (ఐహెచ్‌డీ) సంయుక్తంగా రూపొందించాయి. దేశంలోని మొత్తం నిరుద్యోగ యువతలో సెకండరీ, ఉన్నత విద్య అభ్యసించిన వారి సంఖ్య 2000 నుండి 2022 నాటికి రెట్టింపు అయింది. రెగ్యులర్ ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య 2018 తర్వాత బాగా తగ్గడం గమనార్హం. యువతలో కొద్ది మంది మాత్రమే సామాజిక భద్రతా పథకాలు, కార్యక్రమాల ద్వారా ప్రయోజనాలు పొందారు. అత్యధికులు మాత్రం అభద్రతతో జీవితాలు నెట్టుకొస్తున్నారు.

నత్తనడక నడుస్తున్న రైతు పథకాలు

ఇక రైతుల విషయానికి వస్తే వాస్తవానికి వారి అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టింది. వీటిలో 2016లో ప్రారంభించిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఒకటి. ప్రీమియంకు సంబంధించి ఇది ప్రపంచంలోనే మూడో అతి పెద్ద పథకం. ఈ పథకానికి దరఖాస్తు చేస్తున్న అన్నదాతల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది. అదే సమయంలో క్లెయిముల చెల్లింపు తగ్గిపోతోంది. 2018-19లో రూ.28,651.8 కోట్ల క్లెయిముల చెల్లింపు జరిగితే 2021-22 నాటికి ఆ మొత్తం రూ.14,716.9 కోట్లకు తగ్గిపోయింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి కార్యక్రమాలు కూడా ఇలాగే నడుస్తున్నాయి. ఆయా పథకాల్లో లబ్దిదారుల సంఖ్య క్రమేపీ పడిపోతోంది. బడ్జెట్ కేటాయింపులు, ఖర్చు కూడా నానాటికి తీసికట్టు నాగంబొట్టు మాదిరిగా తయారయ్యాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉద్యోగాల కల్పన కోసం నానాటికీ డిమాండ్ పెరుగుతుంటే ఉద్యోగాలు పొందిన వారి సంఖ్యలో మాత్రం పెద్దగా పురోగతి కన్పించలేదు. ఉద్యోగాల కోసం డిమాండ్ 41శాతం పెరగ్గా ఇచ్చిన ఉద్యోగాలలో పెరుగుదల కేవలం 38శాతం మాత్రమే.

తగ్గుతున్న మహిళా ఉద్యోగులు

మహిళా సాధికారత విషయంలో కేంద్ర ప్రభుత్వ మాటలకు, చేతలకు మధ్య ఏ మాత్రం పొంతన ఉండడం లేదు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల సంఖ్య అనేక దశాబ్దాలుగా తగ్గుతూ వస్తోంది. గత తొమ్మిది సంవత్సరాల్లో ఈ ధోరణి మరింత అధికమైంది. ప్రపంచబ్యాంక్ సమాచారం ప్రకారం 2012 నాటికి 27శాతం మంది మహిళలు ఉపాధి పొందుతుంటే 2021 నాటికి అది 22.9 శాతానికి పడిపోయింది. ఈ తిరోగమన ధోరణి ఆందోళన కలిగించే విషయమే.

మహిళలపై పెరుగుతున్న నేరాలు

జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఇటీవల విడుదల చేసిన వార్షిక నేర నివేదిక ప్రకారం దేశంలో మహిళలకు భద్రత కరువవుతోంది. 2022లో మహిళలపై నేరాలకు సంబంధించి 4,45,256 కేసులు నమోదయ్యాయి. అంటే ప్రతి గంటకు సుమారు 51 ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయన్న మాట. 2020లో 3,71,503 కేసులు నమోదు కాగా 2021లో వాటి సంఖ్య 4,28,278కి పెరిగింది.

సికార్‌లో సీపీఐ(ఎం) జెండా

- వామపక్షాలకు బలమైన కేంద్రం
- ఇండియా ఫోరం తరపున సీపీఐ(ఎం) అభ్యర్థి అమ్రారామ్

జె.జగదీష్, నవతెలంగాణ



'సుత్తి కొడవలి నక్షత్రం... మా ఎన్నికల గుర్తు', ఇండియా ఫోరం అభ్యర్థి అమ్రారామ్‌కు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గం అంతటా ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది.

ఆరావళి కొండల సరిహద్దులో ఉన్న సికార్ మండలం పాత కోటలు, హవేలీలతో నిండి ఉంది. పదేండ్లుగా సికార్ బీజేపీకి కంచుకోటగా ఉంది. స్వామి సుమేదానంద సరస్వతి, ఆర్యసమాజ్ సన్యాసి, 2014, 2019లో గెలిచారు. హర్యానాకు చెందిన సుమేదానంద ఎంపీగా పూర్తిగా విఫలమయ్యారనే విషయాన్ని సికార్‌లోని బీజేపీ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. కానీ మోడీ, అమిత్ షా ద్వయం సుమేదానందాని మళ్లీ బరిలోకి దింపింది.

సుమేదానంద, సంఘ్ పరివార్ కోటలను బద్దలు కొట్టడానికి ఇండియా ఫోరం రైతు నాయకుడు అమ్రారామ్‌కు బాధ్యత అప్పగించింది. అమ్రారామ్ సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి. కిసాన్ సభ అఖిల భారత ఉపాధ్యక్షుడు. సికార్‌లోని దోడ్, దాతారమ్‌గఢ్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. సికార్ లోక్‌సభ నియోజకవర్గానికి 2006లో జరిగిన ముక్కోణపు పోటీలో ఆయనకు 1.62 లక్షల ఓట్లు వచ్చాయి.

రైతు నేత అమ్రారామ్ లోక్‌సభ నియోజకవర్గ వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. వసుంధర రాజే హయాంలో వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఏఐకేఎస్ నాయకత్వంలో అమ్రారామ్ నేతృత్వంలో జరిగిన దిగ్గజ పోరాటం రాష్ట్రాన్ని కుదిపేసింది. సచివాలయం చుట్టూ రెండు వారాలుగా సాగిన ఆందోళనకు బీజేపీ ప్రభుత్వం మోకరిల్లాల్సి వచ్చింది. కరెంటు రేట్లు, పంటల బీమా, వ్యవసాయానికి నీరు వంటి పలు డిమాండ్లను లేవనెత్తుతూ అమ్రారామ్ సికార్, సమీప ప్రాంతాల్లో అనేక ఆందోళనలకు నాయకత్వం వహించారు. రాజస్థాన్‌లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి కూడా అమ్రారామ్ నాయకత్వం వహించారు.

సికార్‌లో బీజేపీ ఎన్నికల కమిటీకి ఇన్‌చార్జ్‌గా ఉన్న మనోజ్ సైనీ అమ్రారామ్ బలమైన ప్రత్యర్థి అని బహిరంగంగా అంగీకరించారు. ఆయన గొప్ప వ్యక్తి అని అన్నారు. "సిట్టింగ్ ఎంపీపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. కానీ ఇక్కడ ఓటు బీజేపీకి, మోడీకి వేయాలి. ఎంపీకి కాదు. అభ్యర్థి సమస్య కాదు" అని అన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కిషన్ పారీఖ్ మాట్లాడుతూ సికార్‌లో కొడవలి గుర్తుకు మంచి గుర్తింపు ఉందన్నారు. అమ్రారామ్ ప్రత్యర్థులు కూడా గుర్తించే వ్యక్తిత్వం ఉన్నవారు. బీజేపీ సికార్ నుంచి పారిపోతుందని పారీఖ్ అన్నారు.

నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సికార్‌లోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఐదింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. సీపీఐ(ఎం) దోడ్ నియోజకవర్గంలో రెండో స్థానంలో, దాతారంగఢ్‌లో మూడో స్థానంలో నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా ఫోరంలో అన్ని పార్టీలు 1.38 లక్షలకు పైగా ఓట్లను సాధించాయి. సికార్‌లోని 1.5 లక్షల మైనారిటీ ఓట్లు కూడా ప్రభావం చూపనున్నాయి.

సికార్‌తో నిత్యం టచ్‌లోనే..

సికార్‌లోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకటైన నీమ్‌కటనాలోని హేమ్‌రాజ్‌పురాలో అభ్యర్థి పర్యటన సందర్భంగా అమ్రారామ్ మాట్లాడారు. నీమ్‌కటనా ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు సురేష్ మోడీ ఆయనతోనే ఉన్నారు. ఇండియా ఫోరం అభ్యర్థిని సికార్ ప్రజలు ఉత్సాహంగా స్వీకరిస్తున్నారని అమ్రారామ్ అన్నారు. "సిట్టింగ్ ఎంపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. సికార్‌లో పర్యటించడమే చాలా అరుదు. సికార్ ఆయన యాక్షన్ ఫీల్డ్. అది ఓటర్లకు కూడా తెలుసు" అని అన్నారు. రైతులు పూర్తి స్థాయిలో తమతోనే ఉన్నారు. రైతాంగ సమస్యలు, నియోజకవర్గంలో అభివృద్ధి లేమి, అగ్నివీర్ సహా యువత సమస్యలు, ధరల పెరుగుదల, అవినీతి, బీజేపీ నియంతృత్వం వంటి సమస్యలపై అమ్రారామ్ దృష్టి సారించారు. కాంగ్రెస్‌తో సహా ఇండియా ఫోరంలోని ఇతర పార్టీల కార్యకర్తలు ఉత్సాహంగా భాగస్వామ్యం అవుతున్నారు. బీజేపీని ఓడించేందుకు సికార్‌లో ఇండియా ఫోరం ఏకమైందని అమ్రారామ్ అన్నారు.

సికార్‌లో ఇండియా ఫోరం ఐక్యంగా ఉందని సురేశ్ మోడీ అన్నారు. అమ్రారామ్ నామినేషన్ దాఖలుకు అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్, పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ తోడస్రా హాజరయ్యారు. తొడస్రా సికార్‌లోని లక్ష్మణ్‌గఢ్ నుంచి ఎమ్మెల్యే. ప్రచార కార్యక్రమాలను ఆయన సమన్వయం చేస్తున్నారు. రాజస్థాన్‌లో సీపీఐ(ఎం), రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ, భారత్ ఆదివాసీ పార్టీలతో కూడిన ఫోరం బీజేపీ ఆశ్చర్యానికి గురి చేసింది. చురు, బికనీర్ వంటి నియోజకవర్గాల్లో సీపీఐ(ఎం)తో కలిసి ఉండడం వల్ల కాంగ్రెస్‌కు లాభం చేకూరుతుందని మోడీ అన్నారు.

కేంద్రమంత్రి మెడకు ఉచ్చు..!

న్యూఢిల్లీ : తిరువనంతపురం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సమర్పించిన అఫిడవిట్ వివరాల్లో తప్పులతడకలను, వ్యత్యాసాలను పరిశీలించి, ధ్రువీకరించాల్సిందిగా భారత ఎన్నికల కమిషన్, కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)ని ఆదేశించింది. మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆర్థిక స్థితిగతుల గురించి తప్పుడు సమాచారం ఇచ్చారని కాంగ్రెస్ ఈసీకి సోమవారం ఫిర్యాదు చేసింది. ఆ నేపథ్యంలో ఈసీ పై ఆదేశాలు జారీ చేసింది. తప్పుడు వివరాలతో అఫిడవిట్‌ను సమర్పించినట్లైతే ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 125ఎ కింద కఠిన చర్యలు ఎదుర్కొనాల్సి వుంటుంది. నామినేషన్ పత్రాల్లో లేదా అఫిడవిట్‌లో సమాచారం దాచిపెట్టిన పక్షంలో ఆరు మాసాల వరకు జైలు శిక్ష, లేదా జరిమానా లేదా రెండూ వర్తిస్తాయి.

ఈ నెల 5న చంద్రశేఖర్ తనకు రూ.28కోట్ల విలువ చేసే ఆస్తులు వున్నట్టు లోక్‌సభ అఫిడవిట్‌లో ప్రకటించారు. చరాస్తుల విలువ రూ.13,69,18,637 కోట్లు కాగా, ఆయన భార్య ఆస్తుల విలువ రూ.12,47,00,408 కోట్లుగా వుంది. ఇందులో చేతిలో వున్న నగదు, బ్యాంకుల్లో డిపాజిట్ల వివరాలు, బ్యాంకింగేతర ఫైనాన్షియల్ కంపెనీలు, సహకార సొసైటీలు, అలాగే బాండ్ల రూపంలో పెట్టుబడులు, డిబెంచర్లు, మ్యూచువల్ ఫండ్‌ల్లో, కంపెనీల్లో యూనిట్లు, షేర్లు, ఇతర ఆర్థికపరమైన పెట్టుబడులు వున్నాయి. అలాగే ఆయన చరాస్తుల్లో 1942 మోడల్ రెడ్ ఇండియన్ స్కౌట్ కారు కూడా వుంది. కర్నాటకలో రిజిస్టర్ అయిన ఈ వాహనాన్ని 1994లో రూ.10వేలకు కొనుగోలు చేశారు. రూ.3.25కోట్ల విలువ చేసే బంగారం, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు వున్నాయి. ఇక స్థిరాస్తుల్లో రూ.5,26,42,640కు కొనుగోలు చేసిన స్థిరాస్తి వుంది. దీని ప్రస్తుత మార్కెట్ విలువ దాదాపు రూ.14,40,00,000గా వుంది. ఇవి కాకుండా అదనంగా ఆయనకు, భార్యకు వివాదంలో వున్న కొన్ని ఆస్తులు వున్నాయి. చంద్రశేఖర్‌కు రూ.19,41,92,894, ఆయన భార్యకు రూ.1,63,43,972 మేరా అప్పులు వున్నాయి. వీటిల్లో బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు, తదితరాల నుంచి తీసుకున్న రుణాలు కూడా వున్నాయి. 2022-23లో తన ఆదాయ పన్ను రిటర్న్‌లో తన మొత్తం ఆదాయం రూ.5,59,200గా వున్నట్లు చంద్రశేఖర్ చెప్పారు. కానీ, 2021-22లో ఈ మొత్తం కేవలం రూ.680గా వుంది.

ఏడేండ్లలో వందశాతం పడిపోయిన ఆదాయం

2016-17, 2022-23 మధ్య కాలంలో రాజీవ్‌చంద్రశేఖర్ వార్షిక ఆదాయం దాదాపు వంద శాతమూ కుంచించుకుపోగా, ఆయన భార్య అంజు చంద్రశేఖర్ ఆదాయం ఏకంగా 500శాతం పెరిగింది. 2018లో రాజ్యసభ, 2024లో లోక్‌సభ ఎన్నికలకు గానూ ఆయన సమర్పించిన అఫిడవిట్ల వివరాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

2018, 2024 మధ్య కాలంలో ఆయన చరాస్తుల విలువ 66శాతం మేరా అంటే రూ.27.98కోట్లు నుంచి రూ.9.25కోట్లకు తగ్గిపోయింది. అదే సమయంలో ఆయన అప్పులు సున్నా నుంచి రూ.19.41కోట్లకు పెరిగాయి.

ఏడు అర్థిక సంవత్సరాల్లో చంద్రశేఖర్ ఆదాయం రూ.28కోట్ల నుంచి రూ.5.5లక్షలకు పడిపోయినట్టు ఆదాయపన్ను రిటర్న్ వివరాలు తెలుపుతున్నాయి. అదే సమయంలో ఆయన భార్య ఆదాయం రూ.21.44 లక్షల నుంచి రూ.1.2కోట్లకు పెరిగింది.

2018లో చంద్రశేఖర్ అందచేసిన అఫిడవిట్ ప్రకారం, చంద్రశేఖర్ స్థూల ఆదాయం రూ.28.27కోట్లు వుంది. ప్రధానంగా జూపిటర్ కేపిటల్ ప్రయివేట్ లిమిటెడ్ నుంచి వచ్చే వేతనం, బెంగళూరులోని కోరమంగళలో గల భవనానికి వచ్చే అద్దెలు, వ్యాపారంలో వచ్చే లాభాలు, రాజ్యసభ ఎంపీగా తన వేతనం, నియోజకవర్గ అలవెన్స్, ఆఫీస్ వ్యయం కింద వచ్చే అలవెన్స్, రోజువారీ అలవెన్స్, డివిడెండ్ ఇన్‌కం, పన్ను రహిత బాండ్ల నుంచి, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ యూనిట్ల నుండి వచ్చే వడ్డీ.. మైనర్ పిల్లలకు సంబంధించిన ఆదాయం, బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుంచి వచ్చే వడ్డీ ఇవన్నీ కలిపి ఈ ఆదాయంగా చూపించారు. ఆయన స్థిరాస్తుల స్థూల విలువ కూడా పొంతన లేకుండా వుంది. చరాస్తుల వివరాలను చూపించే పత్రంలో వాటి స్థూల విలువ రూ.9.25కోట్లుగా చూపించారు. కానీ మరో అనుబంధ పత్రంలో వాటి విలువ రూ.13.69కోట్లుగా చూపించారు. అంటే రూ.4.43కోట్లు తేడా వుంది. కానీ ఆయన భార్య చరాస్తుల విలువ మాత్రం ఒక్కలాగే రూ.12.47కోట్లుగా వుంది.

తప్పుడు ప్రచారం

తనపై వచ్చిన ఆరోపణలపై చంద్రశేఖర్ స్పందిస్తూ, చట్టం ప్రకారమే తాను అన్నీ వెల్లడించానని చెప్పారు. ఇదంతా తప్పుడు ప్రచారమన్నారు. కాంగ్రెస్ ఇలాంటి ఆరోపణలు చేయడం ఇదే మొదటిసారి కాదన్నారు.

ఓరుగల్లు సీటుపై బీఆర్ఎస్ తర్జన భర్జన

- తాటికొండకు ఇవ్వాలా..? వద్దా...?
- తెరపైకి పరంజ్యోతి, సుధీర్‌కుమార్ తదితరుల పేర్లు
- ముఖ్య నేతలతో కేసీఆర్ సమాలోచనలు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్



వరంగల్ లోక్‌సభ సీటుపై బీఆర్ఎస్‌లో తర్జన భర్జనలు కొనసాగుతున్నాయి. సీనియర్ నేత కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్య 'హ్యాండి'వ్వటంతో ఇప్పటికీ కోలుకోని ఆ పార్టీ, ఆ సీటును ఎవరికి కేటాయించాలనే దానిపై మల్లగుల్లాలు పడుతోంది. కడియం కోసం సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్‌ను కాదనటంతో ఆయన కాంగ్రెస్‌లో చేరిన సంగతి విదితమే. ఇదే కారణంతో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ సైతం కారు పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ కండువా కప్పుకున్నారు. ఇంత చేసినా సీటు దక్కించుకున్న కడియం...బీఆర్ఎస్‌కు క్షేత్రస్థాయిలో బలం లేదనే కారణం చెబుతూ పార్టీని వీడారు. దీంతో వరంగల్లు సీటును ఎవరికివ్వాలి..? ఇస్తే వారైనా ఉంటారా..? లేక చివరి నిమిషంలో పార్టీ మారతారా..? అనే సందేహం ఆ పార్టీని వెంటాడుతోంది. దీంతో అభ్యర్థిని ఖరారు చేయలేకపోతున్నారనే వాదనలు వినబడుతున్నాయి.

కడియం బయటకు వెళ్లిపోగానే... మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే వార్తలు వెలువడ్డాయి. అయనకే ఎంపీ టిక్కెట్ ఇస్తారనే ప్రచారం కూడా జరిగింది. కానీ ఇప్పటి వరకూ సంబంధిత ప్రకటన వెలువడలేదు. బీఆర్ఎస్ అధిష్టానానికి రాజయ్యపై కూడా నమ్మకం లేకపోవటమే ఇందుకు కారణం. గతంలో చిన్న చిన్న కారణాలతో పార్టీ మారిన ఆయన్ను అంతగా విశ్వసించలేమంటూ బీఆర్ఎస్ బాస్ తేల్చి చెప్పినట్టు సమాచారం. ఈ క్రమంలో ఎవర్ని అభ్యర్థిగా నిలపాలనే దానిపై ఆయన మరింత లోతుగా చర్చిస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం వరంగల్ జిల్లాకు చెందిన సీనియర్లతోపాటు పార్టీలోని ముఖ్య నేతలతో ఆయన గత కొద్ది రోజులుగా మంతనాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఉద్యమ నేత పరంజ్యోతి, హన్మకొండ జడ్పీ చైర్‌పర్సన్ సుధీర్ కుమార్ తదితరుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. వీరిలో ఎవరో ఒకర్ని ఎంపిక చేసి, ప్రకటించే అవకాశముందని తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

పార్టీ పేరు మార్పుపై సమాలోచనలు...

మరోవైపు బీఆర్ఎస్ పేరును టీఆర్ఎస్‌గా మార్చాలంటూ ఆ పార్టీ అధిష్టానంపై నేతలు ఒత్తిడి పెంచుతున్నారు. ఇటీవల వరంగల్ జిల్లాకే చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు ఈ అంశాన్ని బాహాటంగానే ప్రస్తావించిన సంగతి విదితమే. ఇదే తరహాలో ఇప్పుడు పలు జిల్లాలకు చెందిన మాజీ మంత్రులు, సీనియర్లు కూడా బీఆర్ఎస్ స్థానంలో టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేస్తే... పార్టీని ప్రజలు మళ్లీ అక్కున చేర్చుకుంటారంటూ చెబుతున్నారు. ప్రస్తుత ఎంపీ ఎన్నికలతోపాటు మున్ముందు స్థానిక సంస్థల ఎలక్షన్లలో గెలవాలంటే పేరు మార్చక తప్పదంటూ వారు కోరుతున్నారు. దీనిపై మరింతగా చర్చించి, ఓ నిర్ణయానికి వస్తామంటూ కేసీఆర్ వారికి నచ్చజెప్పినట్టు సమాచారం.

ఒక్క ఏడాదిలోనే
బీజేపీకి రూ.614.52 కోట్లు..

- ఈబీలకు ఇవి అదనం



తిరువనంతపురం : 2021-22 ఒక్క ఏడాదిలోనే కార్పోరేట్లు, వ్యక్తులు, ఎలక్షన్ కమిషన్ (ఈసీ) ఆమోదించని అక్రమ ట్రస్టుల నుంచి బీజేపీ రూ.614.52 కోట్లు సంపాదించింది. ఎలక్టోరల్ బాండ్ల నుంచి సంపాదించిన వేలకోట్లకు ఇది అదనమని దేశాభిమాని పత్రిక వెల్లడించింది.

2022 నవంబర్ 7న బీజేపీ ఎన్నికల కమిషన్ (ఈసీ)కి సమర్పించిన పత్రాల్లో చాలా మంది దాతల పాన్ నెంబర్, చిరునామా లేదు. ప్రతి ఆర్థిక సంవత్సరం రాజకీయ పార్టీలు ఇరవై వేలకు పైగా జమ చేసిన వారి జాబితాను ఈసీకి సమర్పించాల్సి వుంది. ఈసీ ఆమోదించని ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి బీజేపీ విరాళాలను స్వీకరించినట్టు ఆ పత్రాలు చూపుతున్నాయి. వాటిలో ఒకటి జనరల్ ఎలక్టోరల్ ట్రస్ట్ ఆఫ్ కేరళ. పది లక్షలు విరాళం అందించిన ఈ ట్రస్ట్ పాన్ నెంబర్, చిరునామా లేవు. అయితే వివరణ కోరకుండా బీజేపీ సమర్పించిన పత్రాలను ఈసీ ఆమోదించడం గమనార్హం. న్యూఢిల్లీలోని బహదూర్ షా జాఫర్ మార్గ్‌లోని హన్స్ భవన్‌లో నమోదైన ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ 2021-22లో బీజేపీకి రూ.249 కోట్ల విరాళాలను అందించింది.

మొత్తంగా 4,985 మంది ప్రముఖుల (వ్యక్తులు, సంస్థలు, ట్రస్టులు) నుండి చెక్‌లు, ఆన్‌లైన్, నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ (ఎన్ఇఎఫ్‌టి)ల ద్వారా బీజేపీకి నగదు బదిలీ చేశాయి. కేరళకు చెందిన సంస్థలు, వ్యక్తులతో కూడిన 27 మంది ప్రముఖుల నుంచి నగదు అందింది. బీజేపీకి కోటి రూపాయలు ఇచ్చిన మహ్మద్ మజీద్‌కు సంబంధించిన పాన్ నెంబర్, చిరునామా లేవు.

ఎలక్టోరల్ బాండ్ల పేరుతో దేశంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గతంలో ఎప్పుడూ లేనంత అవినీతికి పాల్పడింది. సుప్రీంకోర్టు తీర్పుతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వెల్లడించిన వివరాలతో ఈ అక్రమాలు వెలుగుచూసిన సంగతి తెలిసిందే.

సారు పిలిచాడని పోతే.. సస్పెండయ్యారు

(మొదటి పేజీ తరువాయి)

పోటీ చేస్తున్న విషయం విదితమే. ఎన్నికల ప్రచార సన్నాహాల్లో భాగంగా.. సిద్దిపేట జిల్లాకు చెందిన కొంతమంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో పట్టణంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఇటీవల ఆయన రహస్యంగా సమావేశమయ్యారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రచారంలోగానీ, సమావేశాల్లోగానీ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకూడదు .. కానీ గతంలో జిల్లాలో పనిచేసిన పెద్ద సారు పిలిచాడని.. ఎన్నికల సమావేశాలకు పోవద్దని తెలిసి కూడా సారుపై గౌరవంతో ప్రభుత్వ ఉద్యోగులు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు.. అనుమతులు లేకుండా, రహస్యంగా ప్రభుత్వ ఉద్యోగులతో ఎంపీ అభ్యర్థి సమావేశం నిర్వహించారని ఎన్నికల అధికారులకు సమాచారం అందించారు. ఉద్యోగులు పారిపోకుండా గేటుకు తాళం కూడా వేశారు. విషయం తెలుసుకున్న ఉద్యోగులు కొంతమంది గేటు దూకి పారిపోయారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అక్కడికి వచ్చి పరిశీలించారు. కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. అంతేకాకుండా, వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు కలెక్టర్‌ను కలిశారు. దాంతో 106 మంది ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సారు పిలిచాడని ఆయనపై గౌరవంతో సమావేశానికి పోతే సస్పెండ్ అయ్యామని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

సస్పెండ్ అయిన వారు..

సస్పెండ్ అయిన వారిలో సెర్ప్ ఉద్యోగులు 38 మంది.. వారిలో ఏపీఎంలు-14, సీసీలు-18, వీవోఏలు-4, సిఓ-1, సిబి ఆడిటర్స్-1, అలాగే 68 మంది ఈజీఎస్ ఉద్యోగుల్లో ఏపీవోలు-4, ఈసీలు -7, టిఏలు-38, సిఓలు-18, ఎఫ్ఎ-1 ఉన్నారు.

మొదటి దశలో కేవలం 8 శాతం మహిళా అభ్యర్థులు
- 102 స్థానాల్లో బరిలో 1,625 మంది అభ్యర్థులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19 జరగనుంది. మొదటి దశలో 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 102 లోక్‌సభ స్థానాల్లో 1,625 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో 134 మంది (8 శాతం) అభ్యర్థులు మాత్రమే మహిళలు ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం అభ్యర్థుల్లో దాదాపు 9 శాతం (726) మంది మహిళలు ఉన్నారు. వీరిలో 78 మంది మాత్రమే 17వ లోక్‌సభకు ఎంపికయ్యారు.

2023 సెప్టెంబరులో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లను రిజర్వ్ చేయాలనే బిల్లును ఆమోదించినప్పటికీ, రాజకీయ పార్టీలు ఎక్కువ మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టడానికి సిద్ధపడటం లేదని కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన డేటా స్పష్టం చేస్తుంది.

మొదటి దశలో 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మిజోరాం, అండమాన్ నికోబార్ దీవుల్లో వరుసగా 16 శాతం, ఒకరు, ఇద్దరు మహిళా అభ్యర్థులను నిలబెట్టాయి. మరోవైపు, మణిపూర్, నాగాలాండ్, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, త్రిపుర, జమ్మూ కాశ్మీర్‌తో సహా ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఒక్క మహిళా అభ్యర్థి బరిలో లేరు.

అరుణాచల్ ప్రదేశ్‌లో ఒక మహిళా అభ్యర్థిని మాత్రమే నిలబెట్టారు. బీహార్ 3, మధ్యప్రదేశ్ 7, మహారాష్ట్ర 7, మేఘాలయ 2, పుదుచ్చేరి 3, రాజస్థాన్ 12, సిక్కిం 1, ఉత్తరప్రదేశ్ 7, ఉత్తరాఖండ్ 4, పశ్చిమ బెంగాల్ 4 మహిళ అభ్యర్థులు బరిలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల మొదటి దశలో తమిళనాడులో అత్యధిక సంఖ్యలో మహిళ అభ్యర్థులను అభ్యర్థులను నిలబెట్టారు. అంటే 950 మంది అభ్యర్థుల్లో 76 మంది మహిళలు ఉన్నారని ఈసీ డేటా స్పష్టం చేస్తుంది.

సంపాదకీయం


బిబిసికి పొగ

బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బిబిసి) భారత్‌లో తన ప్రసారాలను నిలిపివేయడం మీడియా రంగానికి మరో కుదుపు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌డిఐ నిబంధనలను మార్చడంతోపాటు గతంలో ఆ సంస్థ కార్యాలయాలపై దాడులు చేసిన పర్యవసానంగా జరిగిన పరిణామమిది. గుజరాత్ మారణకాండ వెనుక నేటి ప్రధాని, ఆనాటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ పాత్ర గురించిన డాక్యుమెంటరీని బిబిసి ప్రసారం చేయడమే కేంద్రం కక్షకు అసలు కారణం. ఏతావాతా పరిశీలిస్తే మోడీని లేదా సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా ఎవరైనా వాస్తవాలు వెల్లడిస్తే వారిని వేటాడడం, హింసించడమే కేంద్ర ప్రభుత్వం పరమ కర్తవ్యంగా పెట్టుకుందని, అందుకు నిబంధనాల చట్రాన్ని బిగిస్తుందనీ మరోసారి విదితమయ్యింది.

> మీడియా గొంతు నొక్కడం నరేంద్ర మోడీ ప్రభుత్వ నిత్యకృత్యంగా ఉంది. పాత్రికేయుల్ని జైళ్లలో కుక్కడం, స్వతంత్ర వార్తా సంస్థలు, పోర్టల్‌లపై ఉపా వంటి రాక్షస చట్టాలను ప్రయోగించడం మనం చూస్తున్నాం. న్యాయ స్థానాలు, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలూ కొన్ని సందర్భాల్లో అభిశంసిస్తున్నా బీజేపీ కేంద్ర ప్రభుత్వం నవ్విపోదురు గాక అన్నట్టు వ్యవహరిస్తోంది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ ఇండెక్స్‌లో 180 దేశాల్లో భారత్ 161వ స్థానంలో ఉండడం సిగ్గుచేటు. ఈ దుస్థితి పోవాలంటే ప్రస్తుత కార్పొరేట్ మతతత్వ కూటమి పాలన అంతం కావలసిందే తప్ప మరో మార్గం లేదు.

బిబిసి కార్యాలయాలలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహించడం, ప్రశ్నలు సంధించడం, వేధింపులు సాగించి సంవత్సరం కూడా పూర్తికాకముందే బిబిసి భారత్‌లోని తన న్యూస్‌రూమ్‌ను మూసేసింది. నలుగురు బిబిసి మాజీ ఉద్యోగులు ఏర్పాటు చేసిన 'కలెక్టివ్ న్యూస్‌రూమ్' పేరిట ఏర్పడిన ప్రయివేటు లిమిటెడ్ కంపెనీకి బిబిసి ప్రచురణ లైసెన్సును అప్పగించింది. ఇలా అప్పగించడం ఓ అసాధారణమైన చర్య. అంతర్జాతీయంగా ప్రసార సేవలందిస్తున్న ఓ పబ్లిక్ సంస్థ తన కార్యకలాపాలను నిలిపివేయడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ఇది మన దేశ ప్రతిష్టకు మాయని మచ్చ.బ్రిటన్ వెలుపల మన దేశంలోనే బిబిసి కార్యకలాపాలు పెద్దఎత్తున నడుస్తుండడం ప్రత్యేకించి పేర్కొనదగినది.

1940 మేలో ప్రసారాలను ప్రారంభించిన బిబిసి ఇండియా బ్యూరోలో ఇప్పుడు సుమారు 200 మంది పనిచేస్తున్నారు. 2002లో జరిగిన గుజరాత్ అల్లర్లపై



బిబిసి ఓ డాక్యుమెంటరీని ప్రసారం చేసిన కొద్ది రోజులకే గత సంవత్సరం ఫిబ్రవరిలో ఢిల్లీ, ముంబయిలోని ఆ సంస్థ కార్యాలయాలలో ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు, సోదాలు జరగడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేసినా ఆ సంస్థ మన దేశంలో తన కార్యకలాపాలను నిలిపివేయడానికి లేదా స్థాయి తగ్గించడానికీ ఇష్టపడలేదు. ఉద్యోగాలలో కోత విధించలేదు. అదే సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు తీవ్రం కావడంతో గుక్కతిప్పుకోలేక పోయింది. దేశీయ డిజిటల్ మార్కెట్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) పరిమితి 26 శాతం మాత్రమేనని నూతన నిబంధనల్ని 2021లో కేంద్రం విధించింది. ఆ పరిమితి దాటిన కంపెనీలు తమ విదేశీ పెట్టుబడులను నియంత్రణలకు అనుగుణంగా తగ్గించుకోవాలి లేదా మూత వేసుకోవాల్సి ఉంటుంది.

బిబిసి ఇండియాలో 99.9 శాతం ఎఫ్‌డిఐ కావడంతో ఆ కొత్త నిబంధన గుదిబండగా మారింది. ఈ నేపథ్యంలో విధి లేని పరిస్థితులలో కార్యకలాపాలను నిలిపి వేయాలని నిర్ణయం తీసుకోవలసి రావడం విచారకరం. తాజా పరిణామాలపై బిబిసి న్యూస్ డిప్యూటీ సిఇఒ జోనాథన్ మన్రో 'భారత్‌లో బిబిసి మనుగడకు ఘన చరిత్ర ఉంది. ప్రేక్షకులకే తొలి ప్రాధాన్యత ఇచ్చాం. దానిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి కలెక్టివ్ న్యూస్‌రూమ్ ఏర్పాటు దోహదపడుతుందని వ్యక్తం చేసిన ఆశాభావం నెరవేరుతుందని ఆకాంక్షిద్దాం. జర్నలిజంలో రాజీ పడబోమని, తమ వెనుక బిబిసి ఉన్నదని కలెక్టివ్ న్యూస్‌రూమ్ సిఇఒ రూపా ఝా స్పష్టం చేయడం దానికి మరింత బలం చేకూరుస్తుంది.

మీడియా గొంతు నొక్కడం నరేంద్ర మోడీ ప్రభుత్వ నిత్యకృత్యంగా ఉంది. పాత్రికేయుల్ని జైళ్లలో కుక్కడం, స్వతంత్ర వార్తా సంస్థలు, పోర్టల్‌లపై ఉపా వంటి రాక్షస చట్టాలను ప్రయోగించడం మనం చూస్తున్నాం. న్యాయ స్థానాలు, అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలూ కొన్ని సందర్భాల్లో అభిశంసిస్తున్నా బీజేపీ కేంద్ర ప్రభుత్వం నవ్విపోదురు గాక అన్నట్టు వ్యవహరిస్తోంది. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ ఇండెక్స్‌లో 180 దేశాల్లో భారత్ 161వ స్థానంలో ఉండడం సిగ్గుచేటు. ఈ దుస్థితి పోవాలంటే ప్రస్తుత కార్పొరేట్ మతతత్వ కూటమి పాలన అంతం కావలసిందే తప్ప మరో మార్గం లేదు. అందుకు ప్రజలంతా నడుం బిగించాలి.

పాలస్తీనా ప్రతిఘటనకు ఆరునెలలు!



ఎం కోటేశ్వరరావు
83310 13288

2023 అక్టోబరు ఏడు నుంచి పాలస్తీనాలోని గాజా ప్రాంతంలో యూదు దురహంకారులు జరుపుతున్న మారణకాండ, దానికి పాలస్తీనియన్ల ప్రతిఘటనకు ఆరు నెలలు దాటింది. అమెరికా, ఇతర పశ్చిమదేశాల దన్ను చూసుకొని గాజాలో సాగిస్తున్న హత్యలు, విధ్వంస కాండ ఎప్పుడు, ఎలా ముగుస్తుందో తెలియదు.ఈ దారుణాన్ని నివారించలేని పనికిమాలిన సంస్థగా ఐరాస పేరుతెచ్చుకుంది.ఎన్ని కబుర్లు చెప్పినా ఆచరణకు వచ్చేసరికి న్యాయం వైపు ఎవరు నిలిచారో, అన్యాయం, అక్రమాలను ఎవరు సమర్ధిస్తున్నారో లోకానికి వెల్లడైంది.ఇజ్రాయిల్ జరుపుతున్న మారణకాండకు మద్దతు ఇస్తున్న జర్మనీపై అత్యవసరంగా ఆంక్షలు విధించాలని అంతర్జాతీయ కోర్టులో వామపక్ష నేత డేనియల్ ఓర్టేగా అధ్యక్షుడిగా ఉన్న లాటిన్ అమెరికాలోని నికరాగువా దాఖలు చేసిన పిటీషన్‌పై హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం విచారణ ప్రారంభించింది. మారణకాండకు మద్దతు ఇవ్వటమేగాక పాలస్తీనా నిర్వాసితులకు సాయం చేస్తున్న ఐరాస సంస్థకు జర్మనీ నిధులను నిలిపివేసిందని కూడా నికరాగువా పేర్కొన్నది. తక్షణమే గాజాలో దాడులను విరమించాలని, యుద్ధం, నేరాలకు జవాబుదారీ ఎవరో తేల్చాలని తాజాగా ఐరాస మానవహక్కుల మండలిలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెడితే ఓటింగ్ నుంచి మనదేశం, మరోపన్నెండు తప్పుకున్నాయి.చైనాతో సహా 28 దేశాలు అనుకూలంగా, అమెరికాతో పాటు మరో ఆరు వ్యతిరేకంగా ఓటు వేశాయి. విశ్వగురువులం కదా! మనం ఎటున్నట్లు? మానవహక్కుల రక్షణకా భక్షణకా? బేటీపడావో బేటీ బచావో అని చెప్పిన పెద్దలకు గాజాలో మరణిస్తున్నవారిలో 70శాతం మంది పిల్లలు, మహిళలు ఉన్న సంగతి తెలియదా? ఈ దారుణాలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌ను నిలదీసేందుకు ఎందుకు నోరు రావటం లేదు? ముస్లిం వ్యతిరేకత తప్ప ఎవరిని సంతుష్టీకరించేందుకు ఈ వైఖరి ?

గాజాలో జరుగుతున్నదేమిటి? తమ మాతృదేశ పునరుద్దరణ జరగాలన్న పాలస్తీనియన్ల అణచివేత తప్ప మరొకటి కాదు. ఎవరు చేస్తున్నారు? సామ్రాజ్యవాదుల మద్దతుతో వారి చేతిలో పావుగా ఉన్న ఇజ్రాయిల్, అంటే సామ్రాజ్యవాదులే దాడి కారకులు.చరిత్రలో వారు చేసిన దాడులన్నీ దారుణాలుగా నమోదయ్యాయి. అందుకు అత్యంత దుర్మార్గ ఉదాహరణ 1968 మార్చి 15వ తేదీన వియత్నాంలోని మై లాయి ఊచకోత. విలియం కాలే అనే అధికారి ఉత్తరువుల మేరకు ఎర్నెస్ట్ మెదీనా అనే అమెరికన్ కెప్టెన్ కదులుతున్న ప్రతిదాన్నీ అంతం చేయమని ఆదేశాలు జారీ చేస్తే అమెరికా సైనికులు ఐదు వందల మందిని చంపివేశారు. ఇప్పుడు గాజాలో జరుగుతున్నదానికి దానికి తేడా ఏమైనా ఉందా ? ఆసుపత్రులు, స్కూళ్లు, నిర్వాసితుల కేంద్రాలు, సహాయ శిబిరాలు, అన్నదానం చేస్తున్నవారు ఎవరు కనిపించినా హతమార్చాలని నేతన్యాహు ఆదేశాలు జారీ చేస్తే ఇజ్రాయిల్ సైనికులు అమలు చేస్తున్నారు. గత ఆరునెలల్లో 33,175(ఏప్రిల్ 7వ తేదీ నాటికి) మందిని చంపివేశారు. మరో విధంగా చెప్పాలంటే గాజాలోని ప్రతి 70 మందికి ఒకరిని, రోజుకు 180మందిని చంపారు. వీరుగాక 75,815 మందిని, రోజుకు 400 మందిని, ప్రతి 30 మందిలో ఒకరిని గాయపరిచారు. విధ్వంసమైన భవనాల గురించి చెప్పనవసరం లేదు. ఇరవై రెండు లక్షల మంది జనాభాలో 19లక్షల మంది నిరాశ్రయులు కావటం లేదా నెలవులు తప్పారంటే ప్రభావితం కాని కుటుంబం లేదంటే అతిశయోక్తి కాదు. ఇంతటి దుర్మార్గానికి పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు అమెరికా అన్ని రకాల ఆయుధాలను అందించటమే కాదు, ఎర్ర సముద్రంలోకి తన యుద్ధ నావలను దింపి బాసటగా నిలుస్తున్నది. ఆ ప్రాంత దేశాలు జోక్యం చేసుకోకుండా బెదిరిస్తున్నది.

సామ్రాజ్యవాదుల వర్తమాన రక్తచరిత్రలో విస్మరించరాని దుర్మార్గమిది. కొందరు సైనికులు చేసిన దారుణం కాదిది, వ్యవస్థాపూర్వకమైనది. ఎవరికి ఏది నేర్పితే దాన్నే పాటిస్తారు. ఇజ్రాయిల్ రక్షణ దళాల్లో ప్రతి యువకుడు కొంతకాలం విధిగా పని చేయాలి. ఆదేశించిన దుర్మార్గాలను అమలు చేయాలి. తిరస్కరిస్తే ఏం చేస్తారు ? ప్రజాస్వామిక హక్కు అని వదలి వేయరు. విదేశాల్లో ఉన్న ఒక యువ ఇజ్రాయిలీ కమ్యూనిస్టు ఈ దళాల్లో చేరేందుకు తిరస్కరించాడు. గాజా మారణకాండను నిరసిస్తూ జరిగిన ప్రదర్శనల్లో పాల్గొని అరెస్టయ్యాడనే కారణాన్ని చూపి అతని పౌరసత్వాన్ని ఇజ్రాయిల్ ప్రభుత్వం రద్దు చేసింది. దేశంలోకి రావటాన్ని నిషేధించింది.రాజ్య అణచివేత, మిలటరీ విధానాలను నిరసించాలని, అణచివేతను వ్యతిరేకించాలని సోదర ఇజ్రాయిలీలకు అతను రాసిన లేఖలో పేర్కొన్నాడు. మధ్య ప్రాచ్య సోషలిస్టు ఫెడరేషన్‌లో భాగంగా ఇజ్రాయిల్-పాలస్తీనా సోషలిస్టు ఫెడరేషన్ ఏర్పాటు జరిగినపుడే ఈ ప్రాంతంలోని జనాలందరూ సుఖంగా ఉంటారని పేర్కొన్నాడు. గాజాలో మారణకాండను విమర్శించినందుకు ఇజ్రాయిల్ పార్లమెంటులోని కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు ఒఫెర్ కాసిఫ్‌ను 2023 అక్టోబర్ 18న 45 రోజుల పాటు సస్పెండ్ చేస్తూ పార్లమెంటరీ నైతిక నియమాల కమిటీ తీర్మానించింది. అయినప్పటికీ ఖాతరు చేయని ఒఫెర్ అంతర్జాతీయ కోర్టులో దక్షిణాఫ్రికా దాఖలు చేసిన కేసును సమర్ధిస్తూ ఒక పిటీషన్‌పై సంతకం చేశాడనే సాకు చూపి ఏకంగా పార్లమెంటు సభ్యత్వాన్నే రద్దు చేసేందుకు పూనుకున్నారు.దానిలో భాగంగా 85 మంది ఎంపీలతో తీర్మానాన్ని ప్రతిపాదించారు.దాన్ని పార్లమెంటరీ కమిటీ జనవరి 30న 14-2 ఓట్ల మెజారిటీతో ఆమోదించింది. దక్షిణాఫ్రికా చర్య కుట్ర అని ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా సాయుధపోరాటాన్ని సమర్ధించటమేనని వర్ణించింది. ఫిబ్రవరి 19న పార్లమెంటులో ఓటింగ్ జరగ్గా అది వీగిపోయింది. నూట ఇరవై మంది సభ్యులకు గాను పదకొండు మంది వ్యతిరేకంగా, 24 మంది ఓటింగ్‌కు దూరంగా ఉండగా 85 మంది అనుకూలంగా ఓటు వేశారు. ఒక సభ్యుడిని తొలగించాలంటే 90 మంది మద్దతు అవసరం. దేశంలో ఎవరూ వ్యతిరేకంగా ఉండకూడదనే దుర్మార్గం తప్ప దీని వెనుక మరొకటి లేదు.పార్లమెంటులోని ఇతర వామపక్ష వాదులకూ ఇదే జరుగుతుందని హెచ్చరించటమే.

ఆరునెలల మారణకాండ తరువాత వెనక్కు తిరిగి చూసుకుంటే గాజా సర్వనాశనమైంది. అక్కడ బతికి ఉన్నవారు తిరిగి సాధారణ జీవితాలను ప్రారంభించే అవకాశం ఉంటుందా? ఇంకా ఎందరిని బలితీసుకుంటారనే ప్రశ్నలకు ఇప్పటికైతే సమాధానాలు లేవు. రంజాన్ మాసం తరువాత మరింత పెద్ద ఎత్తున దాడులు జరిపేందుకు ఇజ్రాయిల్ సన్నాహాలు జరుపుతున్నట్లు వార్తలు. అది ఒక్క గాజాకే పరిమితం అవుతుందా లేక మొత్తం మధ్య ప్రాచ్య దేశాలకు విస్తరిస్తుందా అన్నది చూడాల్సి ఉంది. గాజాలో మరణించిన వారందరూ హమాస్ సాయుధులే అన్నట్లుగా ప్రపంచాన్ని నమ్మించేందుకు ఇజ్రాయిల్ చూస్తున్నది. ఒప్పందం ప్రకారం కొందరు బందీలను విడిపించుకోవటం తప్ప హమాస్ వద్ద ఉన్న ఇతర బందీల జాడను కూడా తెలుసుకోలేకపోయింది. చీమ చిటుక్కుమన్నా కనుగొనే నిఘా వ్యవస్థను ఏమార్చి హమాస్ సాయుధులు సరిహద్దులోని ఇజ్రాయిల్ ప్రాంతంపై ఎలా దాడి చేశారన్నది ఇప్పటికీ వీడని రహస్యంగానే ఉండిపోయింది. దాడులు, హత్యాకాండతో పాలస్తీనియన్లను లొంగదీసుకోలేమని గ్రహించిన ఇజ్రాయిల్ వారిని రోగాలు, ఆకలితో మాడ్చి చంపేందుకు పూనుకున్నట్లు తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. గాజా మారణకాండను ఎలా ఆపాలన్నదాని కంటే అది కొనసాగితే ఇజ్రాయిల్ ప్రధాని




నెతన్యాహు, ఈ ఏడాది జరగనున్న ఎన్నికల్లో జో బైడెన్ భవితవ్యం ఎలా ఉండనున్నదో అంటూ అనేక మంది విశ్లేషణల్లో నిమగ్నమయ్యారంటే వారి చర్మం ఎంత మందంగా తయారైందో అర్ధం చేసుకోవచ్చు. కొందరైతే హమాస్ చేసిన దుర్మార్గాలంటూ ఇంకా చిలవలు పలవలుగా వర్ణిస్తూ గాజాలో జరుపుతున్నదారుణాలను తక్కువ చేసి చూపేందుకు చూస్తున్నారు.

గత ఆరునెలల్లో జరిగిన పరిణామాల్లో ఎమెన్‌పై అమెరికా నేరుగా యుద్ధానికి దిగటం ఒక ముఖ్యాంశం.ఇది కూడా ఇజ్రాయిల్ సంబంధిత పరిణామాల్లోనే జరుగుతోంది. ఉగ్రవాదంపై పోరు ముసుగులో గతంలో సౌదీ అరేబియా ద్వారా దాడులు చేయించింది. అమెరికాలో తయారైన విమానాలతో అక్కడి నుంచే వచ్చిన బాంబులతో జరిపించిన దాడిలో వేలాది మంది యెమెనీలు మరణించారు. ఇరాన్‌తో సయోధ్య కుదరటంతో సౌదీ నిలిపివేసింది.ఇప్పుడు నేరుగా అమెరికా ఆ పని చేస్తున్నది. ఎమెన్ అంతర్యుద్ధంలో రాజధానితో సహా ఉత్తర ఎమెన్‌పై పైచేయి సాధించిన హౌతీలు లేదా అన్సరల్లా సాయుధులు గాజా మారణకాండకు నిరసనగా ఎర్ర సముద్రం ద్వారా ఇజ్రాయిల్ వైపు వెళ్లే నౌకల మీద దాడులను జరుపుతున్నారు. దానికి ప్రతిగా నౌకల రక్షణ పేరుతో అమెరికా రంగంలోకి దిగి ప్రతిదాడులు చేస్తున్నది.సూయజ్ కాలువ ద్వారా ఎర్ర సముద్రంలో ప్రవేశించి హిందూ మహాసముద్రంలోకి రాకపోకలు సాగించే నౌకల రవాణాపై తీవ్ర ప్రభావం పడింది. అవి ఆఫ్రికా ఖండంలోని గుడ్‌హోప్ అగ్రంను చుట్టి వస్తున్నాయి. దాంతో ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ఎర్ర సముద్రం నుండి ఏడెన్ జలసంధి ద్వారా అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రంలోకి నౌకలు ప్రవేశించే కీలక ప్రాంతం బాబ్ అల్ మాండెబ్. ఈ కారణంగా ఎమెన్‌ను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని సామ్రాజ్యవాదులు ఎప్పటి నుంచో చూస్తున్నారు. ఆసియలోని ఎమెన్‌కు ఎదురుగా ఆఫ్రికా ఖండంలోని జిబౌటీ ఉంది. ఈ కారణంగానే ఎప్పుడు ఏ అవసరం వస్తుందో అన్నట్లుగా అక్కడ అనేక దేశాలు తమ మిలిటరీ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నాయి.

గాజా మారణకాండ నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించేందుకు సామ్రాజ్యవాదం మార్గాలను వెతుకుతున్నది. మధ్యప్రాచ్యం, పశ్చిమాసియాకు వివాదాన్ని విస్తరించేందుకు అమెరికా చూస్తున్నది.ఇరాన్‌ను ఒంటరిపాటు చేసేందుకు దీర్ఘకాలంగా అనుసరిస్తున్న ఎత్తుగడలకు ఎదురుదెబ్బ తగిలింది.చైనా చొరవతో ఉప్పు నిప్పుగా ఉన్న సౌదీ అరేబియా-ఇరాన్ సాధారణ సంబంధాలను నెలకొల్పుకున్నాయి. సౌదీ-ఇజ్రాయిల్ మధ్య సయోధ్య కుదర్చాలని అమెరికా ఎంతగా చూసినా కుదరలేదు. పాలస్తీనా స్వతంత్రదేశం ఏర్పడే వరకు సాధారణ సంబంధాలు కుదరవని సౌదీ స్పష్టం చేసింది. గాజాపై దాడులతో అది మరింత వెనక్కు పోయింది. కీలకమైన మధ్య ప్రాచ్య ప్రాంతాన్ని తన చేతుల్లో ఉంచుకోవాలన్న ప్రయత్నాన్ని అమెరికా కొనసాగిస్తూనే ఉంది.ఐరోపాలో రష్యాకు వ్యతిరేకంగా నాటో కూటమిని ఏర్పాటు చేసినట్లే ఇరాన్‌ను దెబ్బతీసేందుకు అలాంటి మరోకూటమి ఏర్పాటు చేయాలని, దానిలో ఇజ్రాయిల్‌కు కీలకపాత్ర ఉండేట్లు చూడాలన్నది లక్ష్యం. అమెరికా, ఇజ్రాయిల్‌ను గట్టిగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసి కూడా సౌదీ అరేబియా నేతలు ఇరాన్‌తో సయోధ్య కుదుర్చుకోవటం అమెరికా ఊహించినట్లు కనపడదు. ఇరాన్‌కు మద్దతుగా చైనా, రష్యా నిలవటం మరొక కొత్త పరిణామం. ఉక్రెయిన్ వివాదం, గాజా మారణకాండ దాన్ని మరింత పటిష్టం చేసిందని చెప్పవచ్చు. కొందరైతే ఈ కూటమితో అమెరికా ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నదనే వర్ణిస్తున్నారు.

> గాజా మారణకాండ నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించేందుకు సామ్రాజ్యవాదం మార్గాలను వెతుకుతున్నది. మధ్యప్రాచ్యం, పశ్చిమాసియాకు వివాదాన్ని విస్తరించేందుకు అమెరికా చూస్తున్నది. ఇరాన్‌ను ఒంటరిపాటు చేసేందుకు దీర్ఘకాలంగా అనుసరిస్తున్న ఎత్తుగడలకు ఎదురుదెబ్బ తగిలింది. చైనా చొరవతో ఉప్పు నిప్పుగా ఉన్న సౌదీ అరేబియా-ఇరాన్ సాధారణ సంబంధాలను నెలకొల్పుకున్నాయి. సౌదీ-ఇజ్రాయిల్ మధ్య సయోధ్య కుదర్చాలని అమెరికా ఎంతగా చూసినా కుదరలేదు. పాలస్తీనా స్వతంత్రదేశం ఏర్పడే వరకు సాధారణ సంబంధాలు కుదరవని సౌదీ స్పష్టం చేసింది. గాజాపై దాడులతో అది మరింత వెనక్కు పోయింది.

> చీమ చిటుక్కుమన్నా కనుగొనే నిఘా వ్యవస్థను ఏమార్చి హమాస్ సాయుధులు సరిహద్దులోని ఇజ్రాయిల్ ప్రాంతంపై ఎలా దాడి చేశారన్నది ఇప్పటికీ వీడని రహస్యంగానే ఉండిపోయింది. దాడులు, హత్యాకాండతో పాలస్తీనియన్లను లొంగదీసుకోలేమని గ్రహించిన ఇజ్రాయిల్ వారిని రోగాలు, ఆకలితో మాడ్చి చంపేందుకు పూనుకున్నట్లు తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. గాజా మారణకాండను ఎలా ఆపాలన్నదాని కంటే అది కొనసాగితే ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, ఈ ఏడాది జరగనున్న ఎన్నికల్లో జో బైడెన్ భవితవ్యం ఎలా ఉండనున్నదో అంటూ అనేక మంది విశ్లేషణల్లో నిమగ్నమయ్యారంటే వారి చర్మం ఎంత మందంగా తయారైందో అర్ధం చేసుకోవచ్చు.



నన్ను నేను వెతుక్కుంటూ..

చాలా అసహనంగా ఉంది!
నా నడక ఎటువైపో
నాకే తెలియని తికమక

ఆకలి డొక్కల జీవితాలు
ఆగిపోతాయేమో
అనుకున్న రోజుల్లో
కడుపు నింపే చేయూత
అనుకున్నానేగాని
ఆకలితో కూడా ఆడుకుంటున్న
రాజకీయం ఇది
అని అనుకోలేదు గాక అనుకోలేదు.

అప్పుడెప్పుడో
సంతోషపునదుల సంగమంలో
స్వేచ్ఛగా ఈత కొట్టిన
రోజుల్ని తీసుకొచ్చి
నాలుగు గోడల మధ్య బంధించి
బోన్సాయ్‌ను చేస్తారనుకోలేదు.


గెలుపు కోసం అరాజకీయులు
పరుగులు పెడుతున్నప్పుడు
వేయి పుట్లను
పండించగలిగే మేలైన
ఒక్క జ్ఞాపకపు గింజను కూడా
కాలం నా సంతోషపు గుమ్మిలో
వేయలేదని కలవరపడుతున్నాను

నా చేవ్రాలు అవసరమైనప్పుడు
కన్నీటి పొరలు కప్పేసిన
నా కళ్లను తెరవకుండానే
నా పేరులో
నన్ను నేను వెతుక్కుంటూ
అకాలంపై సంతకాన్నవుతున్న
అభాగ్యుడను!

ఈ నీటిబుడగ దేహాన్ని
మునివేళ్లపై మోస్తూ
అన్ని వేళ్లను సమానంగా
నేలపై మోపలేక
నా చూపును నలుదిక్కులకు
ప్రసరించలేక
నా బుద్ధిని నేను సక్రమంగా
ఉపయోగించలేక
చేతులు కట్టుకొని నిలబడ్డాను
నిస్సహాయంగా-

- విల్సన్‌రావు కొమ్మవరపు
89854 35515

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం!




డా. ఎస్ తిరుపతయ్య
9849228212

భారతదేశ పార్లమెంటుకు ఎన్నికలు తెలుగు రాష్ట్రాల్లో మే13వ తేదీన జరగబోతున్నాయి. పార్టీలూ, నాయకులూ ఒకరిపై మరొకరు విరుచుకుపడుతున్నారు. ఈ ఆట ఎప్పుడూ ఉండేదే. ప్రస్తుత అధికార బీజేపీ పార్టీ మళ్లీ గెలిస్తే ఇక నియంతృత్వమే ప్రారంభమవుతుందని విశ్లేషకులు ఇప్పటిదాకా భావించారు. కానీ ఆ పార్టీ, ఎన్నికలు పూర్తయ్యేదాకా కూడా ఆగటం లేదు. ప్రతిపక్ష పార్టీలను ఎన్నికల పోటీలోనే లేకుండా చేయటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటమా? నియంతృత్వంలోకి జారిపోవటమా? రెండింటిలో ఏదో ఒకటి తేల్చుకుని, ఓటు వేయాల్సిన సందర్భంలో ప్రజలు ఉన్నారు. అయితే, పొద్దున లేస్తే పొట్ట తిప్పలతోనో, చదువో, ఉద్యోగ వేటలోనో జీవితం గడిచిపోయే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారత రాజకీయాల్లోని ఎంతో లోతైన విషయాలను విశ్లేషించుకుని, తగిన నిర్ణయం తీసుకోవటం సాధ్యపడుతుందా అనే అనుమానం కలుగుతుంది. నిజంగా, ఇది చాలా వరకు ఒక ఆటంకమే. అయినప్పటికీ, ప్రజల రాజకీయ వివేక చరిత్రా, తిరుగుబాట్ల చరిత్రా ఏమంత తక్కువది కాదు. అలాగే, మరొక ఆటంకం కూడా ఉంది. బ్రిటీషు పరిపాలనా కాలంలో చాలా కాలం ఇక్కడ పనిచేసి బ్రిటన్‌కు వెళ్లిపోయిన ఒక అధికారిని అక్కడి పత్రికల వాళ్ళు మీరు భారత దేశంలో ప్రత్యేకంగా ఏం గమనించారని అడిగిన ప్రశ్నకు, 'భారతీయులు పుకార్లను బాగా నమ్ముతారు' అని సమాధానం ఇచ్చాడు. ఈ ఆరోపణ ఈ రోజుకీ వర్తించే పరిస్థితి ఉండటం ఒక విచారకరమయిన వాస్తవం. ప్రజల ఈ బలహీనత మీద ఆధారపడే కొన్ని పార్టీలు వారి రాజకీయ పునాదిని నిర్మించుకున్నాయి. కాబట్టి పుకార్లను, ముఖ్యంగా వివిధ సామాజిక వర్గాల మధ్య ఉండే విభేదాలను వైషమ్యాలుగా మార్చే పుకార్లను, నమ్మకుండా ఉండటం మాత్రమే కాదు, ఉద్దేశ్య పూర్వకంగా వాటికి కారణమయ్యే వారిని సామాజిక ద్రోహులుగా పరిగణించటం ఇప్పుడు అందరికీ చాలా అవసరం.

డా.అంబేద్కర్ నాయకత్వంలో ప్రస్తుత రూపుదిద్దుకున్న రాజ్యాంగంలో ఇతర అధికరణాల కంటే రాజ్యాంగ పీఠిక, ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కుల అధ్యాయాలే చాలా కీలకం. సామాన్య ప్రజానీకానికి కావాల్సిన రాజ్యాంగ సూత్రాలన్నీ ఈ మూడు భాగాల్లోనే ఉన్నాయి. ఏ పార్టీ అయినా రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నామని చెప్పుకోవాలంటే పై మూడింటికి లోబడే పని చేయాలి. అదే, ప్రధాన రాజ్యాంగ స్వరూపం. కానీ, ఈ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఊహించుకున్నంత ఆదర్శంగా ఏనాడూ ఆచరణలో లేవు. గత పదేండ్లలో పరిస్థితి పూర్తిగా విషమించింది. కేంద్ర ప్రభుత్వాన్ని వెనుక నుంచి నడిపిస్తున్న ఆరెస్సెస్ అయితే ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాలను విదేశీ భావనలు అంటున్నది. 'ఈ రాజ్యాంగంలో ఏముంది? మనదేశానికి ఎప్పటినుండో ఒక రాజ్యాంగం (మను ధర్మం) ఉంది, అదే మనకు శిరోధార్యం' అని చెబుతున్నది. మనసులో ఇటువంటి ఉద్దేశాలు పెట్టుకుని సాగిన తాజా పదేండ్ల పరిపాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సౌధాలు యధేచ్ఛగా కూలగొట్టబడ్డాయి. ఆర్‌బీఐ, ఎలక్షన్ కమిషన్‌లు, సీబీఐ, ఈడీ, ఐటీలు రాజకీయాలకు బలై, ఎలా కీలుబొమ్మలుగా మిగిలాయో మనం చూస్తూనే ఉన్నాం. సుప్రీం కోర్టు రెక్కలు కూడా విరగ్గొడుతున్నారు. ఆ ఒక్కటి కూడా పాలకుల నిర్ణయాలకు తానా అంటే తందాన అన్నప్పుడు నియంతృత్వం తుదిరూపం తీసుకున్నట్టు లెక్క.

మన స్వాతంత్ర సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలు ఎన్నో కలలుగంటూ మనల్ని ఎక్కించిన రైలును ఇప్పుడు పాలకులు వెనక్కితిప్పారు. రైలు వేగంగా వెనక్కి వెళ్తున్నది. ఇప్పుడు ప్రజాస్వామ్యం పేరు జపిస్తూనే పాలకులు దాని గొంతు పిసుకుతున్నారు. రాజ్యాంగం ఉండగానే, రాజ్యాంగం అనుమతించని పనులన్నిటినీ యధేచ్ఛగా చేస్తున్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ప్రజలు అనుభవించే పరిస్థితి లేదు. తమ సమస్యల పరిష్కారానికి పౌరులకు నిరసన తెలియజేసే హక్కు లేదు. పత్రికలకు ప్రభుత్వ వ్యతిరేక గళాలని వినిపించే హక్కు లేదు. మేధావులూ, ఉద్యమకారులైతే జైల్లోకి వెళ్ళటానికి సిద్ధమవ్వాలి. నేరుగా మతోన్మాదాన్ని విమర్శించే మేధావులు 'గుర్తు తెలియని' వ్యక్తులచేత చంపబడతారు. ప్రగతిశీల శక్తుల దగ్గర మొదలు పెట్టి, ప్రత్యామ్నాయ (ప్రతిపక్ష) రాజకీయ పార్టీలను కూడా అంతం చేసే బరితెగింపు స్థితికి దేశంలో ఒక వర్గం చేరుకుంది.

కేంద్రంలో ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే, దేశం రానున్న కాలంలో సరిదిద్దుకోలేని వ్యవస్థాగత మార్పులకు లోనవుతుంది. వాళ్ళు బహిరంగంగానే ప్రకటిస్తున్నట్టు రేపు అధికారికంగానే ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చేస్తారు లేదా దాన్ని సమాధి చేసి, వారిదైన మరో రాజ్యాంగాన్ని అమలుచేస్తారు. ఫలితంగా దేశంలోని తొంబై శాతం ప్రజలు తాము ఇప్పటిదాకా అనుభవించిన హక్కులనూ, మనుషులందరూ ఒక్కటే అనే సమాన హోదానూ, అందరూ పైకి ఎదగటానికి గల కొన్ని అవకాశాలనూ సంపూర్ణంగా కోల్పోతారు. జవాబు దారీ తనంతో కూడిన పరిపాలననూ, మనుషులందరూ సమానమనే భావననూ, మత సామరస్యం, ప్రజలమధ్య సోదర భావంతో కూడిన మానవ సంబంధాలనూ,



విజ్ఞానంతో కూడిన హేతుబద్ధతకు నిలబడే చర్చలనూ లేకుండా చేస్తే, ఇక మిగిలేవి మూఢనమ్మకాలు, మత విద్వేషం, కుల వివక్ష, లింగ వివక్ష, అసమానతలతో కూడిన విలువలే మిగులుతాయి. ఎప్పుడో చనిపోయిన ఈజిప్టు మమ్మీలు ఎన్నటికీ ప్రాణం పోసుకోకపోవచ్చు కానీ, కంప్యూటర్ యుగంలో కండ్లు తెరిచిన భారతీయ మనువు, తిరిగి తన సామాజిక వర్గ ఆధిపత్యాన్ని మరో వెయ్యేళ్ళు సుస్థిరం చేయటానికి సమాయత్తమవుతున్నాడు.

మోడీ అనే ఒక వ్యక్తిని ఎన్నో శక్తులు కలిగినవాడిగా, అన్ని నియమాలకూ అతీతమైన వ్యక్తిగా ఉదరగొడుతున్నారు. ఇదంతా నియంతృత్వ సమాజాల్లో జరిగే ప్రచార వ్యవహారం. ఇది ప్రజాస్వామ్య సంస్కృతి కానే కాదు. ఎన్నికల్లో గానీ, రాజకీయ చర్చల్లో గానీ ప్రజలకు చెప్పుకోవటానికి రాజకీయ పార్టీల దగ్గర సరుకు లేనప్పుడే ప్రజలతో మైండ్ గేమ్ ఆడతారు, సెంటిమెంట్లను రెచ్చగొడతారు. ప్రజల దైనందిన జీవిత విషయాలపై హేతుబద్ధమైన చర్చతో కాకుండా అభూత కల్పనలు, దారుణ వక్రీకరణలకు దిగుతూ అబద్ధాలను ప్రచారంలో పెడతారు. మతం పేరుతో ప్రజలను సమీకరించే వారికి, ఆ పని కొన్ని కులాల ప్రయోజనాల కోసమే చేస్తున్నామని తెలుసు. నేరుగా అది చెప్పలేక, అందరికీ సంబంధించిన మతాన్ని ముందు పెడతారు. మతంలో గొప్ప ఏదీ లేనప్పుడు ఇతర మతాల పట్ల అకారణ ద్వేషాన్ని పెంచుతారు. మన దేవునికి అన్యాయం జరిగిందని అంటారు. మన మతం ప్రమాదంలో పడింది అంటారు. మన సంస్కృతికి అవమానం జరిగింది అంటారు. మనపూర్వీకులది అతి గొప్ప చరిత్ర అంటారు. ఈరోజు మన ఈ దుస్థితికి ఫలానా మతస్తులే కారణం అంటారు. ఇంకా, దేశభక్తి ప్రచారంతో వస్తారు. సంస్కృతి పునరుద్ధరణ పేరుతో వస్తారు. ఏదీ లేకపోతే తల్లిదండ్రుల పట్లా, కుటుంబ సంబంధాల పట్లా గౌరవం పెంచుతున్నట్టు లేదా వ్యక్తిత్వ వికాసం పెంపొందిస్తున్నట్టు కూడా వస్తారు. వాస్తవంగా సాధారణ ప్రజలకు ఇవి సెంటిమెంట్లే గానీ, ఇవేవీ తీవ్రమైన దైనందిన సమస్యలు కావు. వాటిలో కొన్ని నిజమైన సమస్యలున్నా వాటిని రాజ్యాంగ, చట్టబద్ధ పాలన పరిధిలో పరిష్కరించవచ్చు. దానికి ప్రజల దృష్టినంతా మరో మతస్తుల మీద కేంద్రీకరింప చేయాల్సిన పని లేదు.

'మనం గత వైభవాన్ని' కోల్పోయామనో, మన సంస్కృతికి పెను ప్రమాదం పొంచి ఉందనో ప్రజలు రోజూ వారి మానసిక ఒత్తిడిలో లేరు. లక్షలాదిగా ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతులకూ, నిరుద్యోగులకూ, ఇతర వర్గాల ప్రజలకూ ఇవేవీ దైనందిన సమస్యలు కానే కావు. నిత్య జీవిత ఆర్థిక, సామాజిక అంశాలే వారికి జీవన్మరణ సమస్యలు. కానీ నేడు రాజకీయం, సామాజికం, సకల మీడియా అంతా కలసి ప్రజలను తమ వర్తమాన, భౌతిక విషయాల మీద కాక ఇటువంటి నిరర్థకమైన విషయాల చుట్టూనే తిప్పుతున్నాయి. ప్రజల ఆర్థిక సమస్యలకు కారణమయ్యే అంతర్జాతీయ ఆర్థిక దోపిడీ దారులూ, దేశంలో సామాజిక దోపిడీ దారులూ కలిసిపోయి వేస్తున్న వేషాలే ఇవన్నీ. ఇలా, ఒక వైపు నియంతృత్వం అమలు చేస్తూ, మరోవైపు మానవ అసలు జీవితంలోని కష్టాలపై హేతుబద్ధ చర్చ లేకుండా ప్రజల దృష్టిని ఇతర విషయాలపైకి మరల్చటం అనేది మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఇటలీ దేశంలో జరిగింది, జర్మనీ దేశంలో జరిగింది. ఇప్పుడు మన దేశంలో జరుగుతున్నది.

ఇటువంటి పరిస్థితుల్లో జరుగుతున్న ఎన్నికలు కాబట్టే ఈ 2024 ఎన్నికలకు చాలా ప్రాధాన్యత ఉంది. ప్రజల సామాజిక, రాజకీయ చైతన్యానికిదొక పరీక్షా సమయం. ఈ కీలక మలుపు దగ్గర మనం ఒక నాయకుడిని మాత్రమే కాదు ఒక రాజకీయ విధానాన్ని ఎన్నుకోబోతున్నాం. ఎన్నికల్లో ఒకవైపు మతతత్వ నియంతృత్వ పరిపాలనా, మరోవైపు గాయపడి ఇంకా మిగిలిపోయిన ప్రజాస్వామ్యం, రాజ్యంగాలూ ఉన్నాయి. కాబట్టి, ప్రజలు ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యతిరేక పార్టీలకు ఓటు వేయకుండా గట్టి నిర్ణయం తీసుకోగలగాలి. ఓటు మాత్రమే కాదు, నిరంతర చైతన్యం, ధిక్కారాల ద్వారా మాత్రమే పౌరులు ప్రజాస్వామ్యాన్నీ, రాజ్యాంగాన్నీ కాపాడుకోగలరు, మరింత ప్రజాపక్షం చేసుకోగలరు.

> కేంద్ర ప్రభుత్వాన్ని వెనుక నుంచి నడిపిస్తున్న ఆరెస్సెస్ అయితే ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాలను విదేశీ భావనలు అంటున్నది. 'ఈ రాజ్యాంగంలో ఏముంది? మనదేశానికి ఎప్పటినుండో ఒక రాజ్యాంగం (మను ధర్మం) ఉంది, అదే మనకు శిరోధార్యం' అని చెబుతున్నది. మనసులో ఇటువంటి ఉద్దేశాలు పెట్టుకుని సాగిన తాజా పదేండ్ల పరిపాలనలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ సౌధాలు యధేచ్ఛగా కూలగొట్టబడ్డాయి. ఆర్‌బీఐ, ఎలక్షన్ కమిషన్‌లు, సీబీఐ, ఈడీ, ఐటీలు రాజకీయాలకు బలై, ఎలా కీలుబొమ్మలుగా మిగిలాయో మనం చూస్తూనే ఉన్నాం. సుప్రీం కోర్టు రెక్కలు కూడా విరగ్గొడుతున్నారు. ఆ ఒక్కటి కూడా పాలకుల నిర్ణయాలకు తానా అంటే తందాన అన్నప్పుడు నియంతృత్వం తుదిరూపం తీసుకున్నట్టు లెక్క

అంబేద్కర్ జయంతోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



నవతెలంగాణ - హుజురాబాద్

ఈ నెల 14న నిర్వహించే బీఆర్.అంబేద్కర్ 133వ జయంతోత్సవ కార్యక్రమ కరపత్రాలను మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద జయంతోత్సవ కమిటీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జయంతోత్సవ కార్యక్రమానికి ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జయంతోత్సవ కమిటీ చైర్మన్ ఖాలీద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సమ్మయ్య, పూలే జయంతి కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్, చందుపట్ల జనార్ధన్, సొల్లు బాబు, వేల్పుల రత్నం, ఎర్ర రాజకుమార్, జమదగ్ని, విష్ణుదాస్ గోపాలరావు, తులసి లక్ష్మణమూర్తి, డాక్టర్ తడికమళ్ళ శేఖర్, మంద బిక్షపతి, మోరే సతీష్, మాడుగుల ఓదెలు, తిప్పారపు భవనచంద్ర, తునికి వసంత్, కరిమ, దాట్ల ప్రభాకర్, కోడూరి సమ్మయ్య, ఎర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

వట్టిపోతున్నయ్...



ముగ్దుంపూర్‌లో ఎండిపోయిన వ్యవసాయబావి

మూడువారాలుగా రెండు మీటర్లచొప్పున పడిపోతున్న భూగర్భజలాలు..

- డెడ్‌స్టోరేజీ దిశగా ప్రధాన జలాశయాలు..
- 20శాతం చెరువుల్లోనే నిల్వలు ఉన్న కొద్దిపాటి నీరు
- ఓవైపుఎండలు.. మరోవైపు సాగునీరందక ఎండిన 30వేల ఎకరాల్లో వరి

దంచికొడుతున్న ఎండలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నీటి వనరులు వేగిరంగా కరిగిపోతున్నాయి. ప్రధాన జలాశయాల్లో నీరు అడుగంటుతుండగా.. 4451 చెరువులు, కుంటల్లో కేవలం 20శాతం మేరకే కొద్దిపాటి నీళ్లు ఉన్నట్టు ఇరిగేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. దీనికితోడు భూగర్భజలాలు వారవారానికి మీటరు, రెండుమీటర్ల చొప్పున పడిపోతున్నాయి. ప్రధానంగా మెట్ట ప్రాంతాల్లో నెల వ్యవధిలోనే ఏకంగా 5 నుంచి 6మీటర్ల లోతుకు పడిపోయాయి. ఈ పరిస్థితుల్లో యాసంగిలో వేసిన ప్రధాన పంట వరి విస్తీర్ణంలో సుమారు 30వేల ఎకరాలు ఎండినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రధానజలాశయాలు, భూగర్భజలాలు, సాగు పరిస్థితులను ఓసారి పరిశీలిద్దాం...

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి

మార్చి 30, 31, ఏప్రిల్ మొదటి వారంలో భారీ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. దాదాపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 42డిగ్రీల సెల్సియస్ వరకు ఎండలు దంచికొట్టాయి. దీంతో భారత వాతావరణశాఖ ఏప్రిల్ మొదటి వారం నుంచే కనిష్ఠంగా 41, గరిష్ఠంగా 44డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించింది. ఇప్పటికే కరీంనగర్, పెద్దపల్లి, రాజన్నసిరిసల్ల, జగిత్యాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. ఇదేసమయంలో ఉమ్మడి జిల్లాలోప్రధాన జలాశయాలన్నీ నిండుకుంటున్నాయి. ప్రస్తుతం ఎల్లంపల్లిప్రాజెక్టులో 20.175టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికిగాను ప్రస్తుతం 7టీఎంసీలే ఉన్నాయి. ఇదే సమయానికి గతేడాది 12.64టీఎంసీలు ఉన్నాయి. మధ్యమానేరుప్రాజెక్టులో కూడా 27.50టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం 6.5టీఎంసీల నీళ్లే ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి 12.5టీఎంసీలు ఉండటం గమనార్హం. ఇక కరీంనగర్ జిల్లాకు సాగు, తాగునీటికి జలప్రదాయినిగా ఉన్న ఎల్ఎండిలో 24.034టీఎంసీల సామర్థ్యానికిగాను 5.63టీఎంసీలే ఉన్నాయి. గతేడాది ఇదే సమయానికి 12.654 ఉన్నాయి. ఇక చెరువులు, కుంటలు దాదాపు ఎండిపోయిన పరిస్థితే ఉంది. కరీంనగర్ జిల్లాలో 1406, జగిత్యాల జిల్లాలో 1226, పెద్దపల్లి జిల్లాలో 1203, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 716 చెరువులు కుంటల్లో కేవలం 20శాతం మేరనే నీళ్లు ఉన్నట్టు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు.

అడుగంటుతున్న భూగర్భ 'ఆశలు'

జిల్లాలో ఫిబ్రవరి మొదటి వారం నుంచే భూగర్భజలాలు గణనీయంగా పడిపోతున్నాయి. నెల వ్యవధిలోనే ఒక్కో ప్రాంతంలో రెండు, మూడు మీటర్లు పడిపోయాయి. ప్రధానంగా గతేడాదితో పోల్చితే ఈ పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అందులోనూ మానకొండూర్‌లో గతేడాది మార్చిలో 0.70మీటర్లఎత్తులో ఉన్న భూగర్భజలాలు ఇప్పుడు 5.32 మీటర్లకు పడిపోయాయి. జమ్మికుంటలో గతేడాది మార్చిలో 3.28 మీటర్ల లోతులో నీళు ఉంటే ఇప్పుడు 5.35మీటర్లకు పడిపోయాయి. ఇక గంగాధర మండలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందనే చెప్పవచ్చు. అక్కడ గతేడాది 15.51మీటర్లలో అండర్‌గ్రౌండ్ వాటర్ లెవల్స్ ఉంటే ఈ సారి 16.57మీటర్ల లోతుకు పడిపోయాయి. ఎక్కువ లోతుల్లోకి పడిపోయిన మండలాలు పరిశీలిస్తే చొప్పదండిలో 14.23, రామడుగులో11.90, చిగురుమామిడిలో 10.96మీటర్ల లోతుల్లో పడిపోయాయి. మిగిలిన మండలాల్లో 9 మీటర్ల నుంచి 10 మీటర్ల మధ్య లోతుల్లో భూగర్భజలాలు ఉన్న మండలాలు కొత్తపల్లి, గన్నేరువరం, తిమ్మాపూర్, కరీంనగర్ అర్బన్, హుజూరాబాద్ మండలాలు ఉన్నాయి. ఇక 5మీటర్ల వరకు ఉన్న మండలాల్లో వీణవంక, శంకరపట్నం, జమ్మికుంట, ఇల్లందకుంట, మానకొండూర్ ఉన్నాయి.

30వేల ఎకరాల్లో ఎండిన వరి...

కరీంనగర్ జిల్లాలో ఈ యాసంగిలో వరి 2,66,293 ఎకరాల్లో వేశారు. మిగిలిన విస్తీర్ణంలో మక్క 25,164, పొగాకు 541, పొద్దుతిరుగుడు 355, పల్లి 462, పెసర 63, నువ్వు 48, పత్తి 19 ఎకరాల్లో సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరిపైనే కరువుప్రభావం పడింది. ఎండిన పంటతో కొందరికి ఎలాంటి ఉపయోగం లేకపోగా.. మరికొందరు గణనీయంగా దిగుబడి తగ్గుతుందని వాపోతున్నారు. ఇక ఒకటి, రెండెకరాలు ఉన్న రైతులు మరికొంత భూమి కౌలుకు తీసుకుని సాగు చేసిన వారూ రెండుచోట్లా నష్టపోయారు. అయితే ప్రతి మండలంలోనూ కనీసంగా 3వేల ఎకరాలవరకు నీరందక ఎండిపోయినట్టు వ్యవసాయశాఖ అంచనాలోతెలుస్తోంది. ఈ లెక్కన కనీసంగా 30వేల ఎకరాల్లో దిగుబడి మాటేమోగానీ, పంట చేతికొచ్చే పరిస్థితులు లేవనే చెప్పవచ్చు.



ముగ్దుంపూర్‌లో ఎండిపోయిన వరి చేలు

చర్చలు సఫలం.. టోకెన్ సమ్మె విరమణ

నవతెలంగాణ - కరీంనగర్

సీఐటీయూ నాయకులతో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ చర్చలు సఫలం అయినట్టు నాయకులు తెలిపారు. దీంతో టోకెన్ సమ్మె విరమించినట్టు చెప్పారు. ఈ నెల 8న రాత్రి సీఐటీయూ అనుబంధ యూనియన్ కరీంనగర్ కార్పొరేషన్ కమిటీ నాయకులకు, జనగాం రాజమల్లుకి కమిషనర్ ఫోన్ చేసి క్యాంప్ ఆఫీస్‌కు రావాలని కోరారు. జనగాం రాజమల్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కంపెల్లి పోచయ్య, కార్పొరేషన్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శి దాసరి రాజమల్లయ్య, కవ్వంపెల్లి రవి, బందెల తిరుపతి కమిషనర్‌తో చర్చలు జరిపారు. ఈ చర్చల సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 4 నెలలకు ఏరియర్స్ గాను 2 నెలల ఏరియర్స్ చెక్కుపై సంతకం అయిపోయింది, త్వరలోనే మీ అకౌంట్‌లోకి డబ్బులు జమవుతాయని తెలిపారు. మిగతా రెండు నెలల ఏరియర్స్ వచ్చే నెలలో వేస్తామని, సంవత్సరానికి 15 రోజుల సీఎల్ అమలు చేయాలని నాయకులు చెప్పడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి కమిషనర్ అమలయ్యేలా చేస్తామన్నారు. వెహికిల్ రిపేర్లు, వాహనాల షెడ్డులో ఫ్రిజ్ ఫిట్ చేపించుటకు ఇతర విషయాలపై అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడారు. కమిషనర్ జ్వరంతో ఉన్నప్పటికీ నాయకులతో మాట్లాడి డిమాండ్స్‌పై చర్చించి పరిష్కరించారు. అనంతరం చర్చలలో పాల్గొన్న నాయకులు తర్వాత కమిటీ సభ్యులతో చర్చించి టోకెన్ సమ్మెకు వెళ్లవద్దని నిర్ణయించారు. కనుక తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ)గా 10వ తేదీన సమ్మె చేయటం లేదని, ఈ విషయం సీఐటీయూ సంఘ కార్మికులు గమనించి విధులకు తప్పకుండా హాజరుకావాలని అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రాజమల్లయ్య, కవ్వంపెల్లి రవి కార్మికులను కోరారు.

పూలే జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్

నవతెలంగాణ - కరీంనగర్



బీసీల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా బీసీ కుల సంఘాలతో కలిసి ఘనంగా నిర్వహిస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ తెలిపారు. మంగళవారం నగరంలో భాగ్యనగర్‌లోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతి ఏటా పూలే ఉత్సవాలను ప్రభుత్వమే నిర్వహించేదని, పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు కాకుండా ఈసారి అధికారులు మాత్రమే నిర్వహిస్తున్నారని అన్నారు. 136 బీసీ కులాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అగ్రకులాలను కలుపుకొని పెద్దఎత్తున నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు ఎకరాల్లో పూలే స్మృతి వైనం ఏర్పాటు చేసి 200 అడుగుల పూలే విగ్రహం ఏర్పాటు చేస్తేనే బీసీలను గౌరవించినట్లని అన్నారు. పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూలే జయంతిని నామమాత్రంగా నిర్వహించిందని, కనీసం విగ్రహం ఏర్పాటు చేయలేదని, మాజీ సీఎం కేసీఆర్ ఎన్నడూ పూలే చిత్రపటానికి పూలదండ కూడా వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జయంతి చేయాలంటే భవనం లేదని, ముకరంపురలోని జ్యోతిబాపూలే మైదానంలో జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు అప్పటి మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్‌లకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రస్తుతం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బీసీ భవనం, జ్యోతిబాపూలే మైదానంలో విగ్రహాల ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం నిర్మిస్తున్న కలెక్టరేట్‌కు పూలే పేరు పెట్టి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోకి రాగానే ప్రగతిభవన్‌కు పూలే పేరును పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పూలే జయంతి ఉత్సవాలలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీతారాముల కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

ఇల్లందకుంట ఆలయ ఈఓ కంది సుధాకర్



నవతెలంగాణ - ఇల్లందకుంట

కరీంనగర్ జిల్లాలో ప్రముఖ క్షేత్రం ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో 2024 బ్రహ్మోత్సవాల ప్రచార పోస్టర్‌ను ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సుధాకర్, అర్చకులు మంగళవారం ఆవిష్కరించారు. అలాగే ప్రచార వాహనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలోనే అతిపెద్ద సీతారాముల ఆలయం ఇల్లందకుంటలోనే ఉందన్నారు. కల్యాణ మహోత్సవానికి ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని చెప్పారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - చొప్పదండి



చొప్పదండి మండల కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల అఖిల్ జెండా ఆవిష్కరించి, స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాసరెడ్డి, మునిగాల సుధాకర్‌గౌడ్, కొత్తూరి మహేష్, మునిగాల రాజేందర్, దూస కైలాసపతి, గుంటి స్వరూపశ్యామ్, కనుమల్ల రాజశేఖర్, బండారి అఖిల్, జక్కుల అనిల్ కుమార్, తిరుపతి, శ్రీనివాస్, విజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

5వేలకోట్లతో మున్నూరుకాపు కార్పొరేషన్ ప్రకటించాలి

మున్నూరుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోనగంటి మల్లయ్య

యువగర్జన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ - జమ్మికుంట

మున్నూరు కాపులకు రూ.5వేల కోట్లతో ఆర్థిక కార్పొరేషన్ ప్రకటించాలని మున్నూరు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోనగంటి మల్లయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మున్నూరు కాపు యువగర్జన పోస్టర్‌ను మున్నూరు కాపు జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఏబూషి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొన్నగంటి మల్లయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు పొన్నగంటి సంపత్, మున్నూరు కాపు సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సాయిని రవి, ఆకుల రాజేందర్ మాట్లాడారు. ఈ నెల 14న కరీంనగర్ వి కన్వెన్షన్ హాలులో ఉదయం 10గంటలకు మున్నూరు కాపు యువగర్జన సమావేశం ఉంటుందన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో మున్నూరు కాపు యువత తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. పటేల్ గెజిట్ కోసం పోరాడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మున్నూరు కాపులు ఐకమత్యంతో ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగపరంగా వెనుకబడి పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలలో రాజకీయంగా మున్నూరు కాపులకు సంఖ్యాపరంగా రిజర్వేషన్ కల్పిస్తూ, సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూత్ నాయకులు కొత్తూరి రాజేందర్, బరిగెల అనుదీప్, కౌన్సిలర్లు పొనగంటి రామ్మూర్తి, పొన్నగంటి సారంగం, మేడిపల్లి రవీందర్, సీనియర్ రిపోర్టర్లు కొలకాని రాజేందర్, పంతాటి రవీందర్, నాయకులు ఆకుల నారాయణ, పొన్నగంటి సతీష్, పొనగంటి శ్రీధర్, ప్రభాకర్, వెంకన్న, కొమురయ్య ఉన్నారు.

కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత చండ్ర రాజేశ్వరరావు

సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్



చిత్రపటానికి పూలమాల వేస్తున్న సురేందర్‌రెడ్డి

కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, భూ పోరాటాల రథసారథి చండ్ర రాజేశ్వరరావు అని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. భారతదేశంలో విప్లవం పరిపూర్ణంగా విరజిల్లాలని భూమికోసం, భుక్తికోసం, పేదప్రజల విముక్తి కోసం, ప్రజల హక్కుల సాధనకై అమరుడైన ప్రజల ఆశాజ్యోతి, భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి మంగళవారం కరీంనగర్‌లోని స్థానిక బద్ధం ఎల్లారెడ్డి భవన్‌లో పూలమాలలు వేసి సీపీఐ శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. అగ్ర నాయకులు, భూ పోరాట యోధులు దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు లక్షలాది ఎకరాల భూములు సాధించడానికి అనేక భూ పోరాటాలు చేసి తనకున్న వందలాది ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన త్యాగధనుడు చండ్ర రాజేశ్వరరావు అని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య రక్షణ కోసం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నపుడు ప్రజలు శాంతితో జీవించాలని ప్రాణాలు లెక్కచేయకుండా చండ్ర రాజేశ్వరరావు మతోన్మాదులకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించి మతోన్మాదుల ఎదురించి జనసేవ దళ్‌ను నిర్మించాడు అని తెలిపారు. బ్రిటీష్ వారి నుంచి స్వాతంత్ర్యం రావడానికి తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థకు నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా అంతరాలు లేని సమాజాన్ని నిర్మించుటకు భూస్వామ్య కుటుంబాలలో జన్మించి విచ్ఛిన్నకర శక్తుల నుంచి ప్రజాస్వామ్యం కోసం నిరంతరం పాటుపడే వ్యక్తి రాజేశ్వర రావు అని అన్నారు. 25 సంవత్సరాల పాటు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన కూడా సామాన్య జీవితం గడిపిన మహోన్నత నాయకుడు చండ్ర రాజేశ్వర రావు అని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి యువతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బోనగిరి మహేందర్, నాయకులు సందీప్ రెడ్డి, మారుతి, గణేష్, అభి, మణి తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు, పిల్లలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట మండలంలోని శాయంపేట గ్రామంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మురికి పూర్ణిమ ఆధ్వర్యంలో పేద మహిళలకు, పిల్లలకు చీరలు, డ్రెస్సులు మంగళవారం పంపిణీ చేశారు. సందర్భంగా మురికి పూర్ణిమ మాట్లాడారు. వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కొంతమంది మహిళలకు, పిల్లలకు నూతన వస్త్రాలను అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ కార్యదర్శి భాగ్యలక్ష్మి, రీజనల్ చైర్‌పర్సన్ గంప సురేందర్, ప్రముఖ వ్యాపారి మురికి అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ రైస్ పట్టివేత

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను పోలీసులు పట్టుకున్నారు. గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన బెజ్జంకి అంజయ్య అనే రేషన్ డీలర్ పీడీఎస్ రైస్‌ని ఎక్కువ ధరకు దుర్శేడ్ గ్రామానికి చెందిన రైస్‌మిల్ యజమాని మొగసాల సంతోష్‌రెడ్డికి అమ్మడానికి రైస్‌మిల్‌కు అదే గ్రామానికి చెందిన ఊరడి మధు టాటా ఇంట్రా ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. 810 బస్తాల పీడీఎస్ రైస్‌ను, వాహనం స్వాధీనం చేసుకున్నారు. అలాగే రేషన్ డీలర్ అంజయ్య, రైస్‌మిల్ యజమాని సంతోష్ రెడ్డి, తరలిస్తున్న ట్రాలీ వాహన డ్రైవర్ మధు లపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మంచి కళాశాల ఎంపికే విద్యార్థి ఉజ్వల భవితకు మార్గం..

- కళాశాలల ప్రలోభాలు షురూ..
- విద్యార్థులపై ఇంటర్ కళాశాలల వల
- రంగలోకి కార్పొరేట్ విద్యాసంస్థల పీఆర్ఓలు
- రాయితీలంటూ ఫోన్లు..


నవతెలంగాణ - కరీంనగర్

మీ పిల్లాడికి పదో తరగతిలో మంచి జీపీఏ వస్తుంది. మీ పిల్లాడికి పదిలో 9.5 జీపీఏ దాటిందా.. ఎక్కడా చేరొద్దు.. మా కళాశాలలో రాయితీతో విద్యనందిస్తాం. అన్ని సౌకర్యాలుంటాయి. మంచి భవిష్యత్తు ఉంటుంది. ఎలాంటి నిర్ణయం తీసుకోకు. పదో తరగతి పూర్తయిన విద్యార్థికి ఓ ఇంటర్ కళాశాల విద్యాసంస్థ ప్రతినిధి ఫోన్ చేసి అన్న మాటలివి. పది ఫలితాలు రాక ముందే పలు ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకటే ప్రచారం చేస్తున్నాయి. తమ కళాశాల అంటే తమ కళాశాలలో చేరాలని గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీంతో తమ పిల్లలను ఎక్కడ చేర్చాలో తెలియక తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. ఈ సమయంలోనే అప్రమత్తంగా వ్యవహరించాలి. ఆయా కళాశాలల యాజమాన్యాలు చెబుతున్నది ఎంత వరకు వాస్తవమో తెలుసుకోవాలి. అన్ని ఉన్నాయో లేదో ప్రత్యక్షంగా పరిశీలించాకే నిర్ణయం తీసుకోవాలి.

కష్టపడి చదివే విద్యార్థులు కళాశాలలో చేర్చుకుంటే వారిని చూపి ఎక్కువ మందిని చేర్చుకోవాలన్న ఉద్దేశంతో కొన్ని ప్రయివేటు కళాశాలల నిర్వాహకులున్నారు. ప్రతిభావంతులు ద్వారా వచ్చే ఫలితాలపై ఆధారపడి విద్యార్థుల చేరికలు ఉంటాయి. జిల్లాలో 12వేల మందికిపైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతిభావంతులకు కొదవ లేదు. దీంతో కులం, ప్రాంతం పేర్లు వాడటం, ఉపాధ్యాయులతో చెప్పించడం, పీఆర్వోలతో గాలించడం చేస్తున్నారు. ఫలితాలు రాకముందే ఎవరు ఏ జీపీఏ సాధిస్తారో, వారి ఆర్థిక పరిస్థితి సేకరించగలిగారంటే వారి నెట్‌వర్క్ ఎంత పకబ్బందీగా ఉందో అర్థమవుతుంది. ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఐఐటీ, ఎంసెట్, నీట్.. అంటూ వల విసురుతున్నారు.

కోర్సు ఎంపికపై అవగాహన ..

పదో తరగతి తర్వాత ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులపైనే తల్లిదండ్రులు ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల ఇష్టాలను గుర్తించకుండా బీటెక్, వైద్య విద్యలో సీట్లు అంటూ కళాశాలల నిర్వాహకులు చేస్తున్న ప్రచారంతో అటువైపు మెగ్గు చూపుతున్నారు. సీట్లు పరిమితంగా ఉన్న వాస్తవం విస్మరిస్తున్నారు. ఐఐటీలో 10వేలలోపు సీట్లు ఉంటే లక్షల మంది విద్యార్థులు రాస్తున్నారు. సీట్లు రాని వారు సాధారణ కళాశాలల్లోనే చేరాల్సిన పరిస్థితి ఉంటుంది. పాలిటెక్నిక్, వోకేషనల్ వృత్తి విద్యాకోర్సులు చాలానే ఉన్నాయి. విద్యార్థులకు కచ్చితంగా ఉద్యోగం, ఉపాధి కల్పించే కోర్సులు చాలా ఉన్నాయి. వీటిపై దృష్టి సారిస్తే మేలు జరుగుతుంది.



తల్లిదండ్రులూ గమనించండి..

మంచి కళాశాల ఎంపికే విద్యార్థి భవితకు మంచి మార్గం వేస్తుంది. జిల్లాలో ప్రభుత్వ నిబంధనల పాటించి నిర్వహించే జూనియర్ కళాశాలలు జిల్లాలో చాలా తక్కువగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య మాత్రం ప్రతి సంవత్సరం పెరుగుతూనే వస్తుంది. ఆ మేరకు నిపుణులైన అధ్యాపకులు, ప్రయోగశాలలు, క్రీడాస్థలం లాంటి వసతులు ఉండాలి. ఇవేమీ లేకుండానే కొన్ని ప్రయివేటు విద్యాసంస్థలు నడుస్తున్నాయి. బహుళ అంతస్తుల భవనాలు, బట్టీ పట్టేవిధానం తప్ప ప్రయోగపూర్వకంగా విద్య అందించే పరిస్థితి కనబడటం లేదు. విద్యాశాఖ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి అనుమతులిస్తుండటంతో ప్రతి ఏడాది ఇదో తంతు కొనసాగుతుంది. చాలా కళాశాలలో అధ్యాపకులు ఒక చోటస్థిరంగా ఉండరు. యాజమాన్యాలు నిపుణుల పేర్లు చెప్పి ప్రవేశాలు పూర్తి చేసుకుంటారు.

ప్రలోభల వలలో పడద్దు.. ప్రభుత్వ కళాశాల ఎంపిక మిన్న

డీఐఈవో జి.జగన్‌మోహన్‌రెడ్డి



కార్పొరేటర్, ప్రయివేటు కళాశాలల ప్రలోభ వలలో పడద్దు. పదో తరగతి తరువాత ఏం చదువుతారన్న విషయమై విద్యార్థుల ఆసక్తి గుర్తించాల్సి ఉంది. విద్యార్థులు ఏ సబ్జెక్టులో రాణించగలరో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. అంతే తప్ప కళాశాలల ప్రచారం నమ్మి నిర్ణయం తీసుకోకూడదు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన లేకుంటే బంధువులు లేదా శ్రేయోభిలాషుల సూచనలు తీసుకోవచ్చు. ప్రస్తుతం ఏ సబ్జెక్టు చదివినా అవకాశాలు ఉన్నాయి. అయితే, క్రమశిక్షణతో పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి. ఇందుకు ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు, ఉచిత బుక్స్, మధ్యాహ్న భోజనం అందుతుంది. నిష్ణాతులైన అధ్యాపకులచే భోదన ఉంటుంది. వోకేషనల్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

కొండగట్టులో ఉగాది పంచాంగ శ్రవణం

నవతెలంగాణ-మల్యాల

మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణం వీక్షిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సన్మానిస్తున్న నాయకులు

కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా సత్యనారాయణరెడ్డి

నవతెలంగాణ-మల్లాపూర్

కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన వాకిటి సత్యనారాయణరెడ్డి నియమించినట్లు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట అన్వేష్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తానని అన్నారు.

వాకిటి సత్యనారాయణరెడ్డి కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా నియామకం కాగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఫిషేర్మన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, కూన గోవర్ధన్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు దామెరా రాజశేఖర్‌రెడ్డి, మామిడి రాజశేఖర్ రెడ్డి ఇప్పపల్లి గణేష్, గోపిడి నరేష్ రెడ్డి, వంగ అశోక్, దామ రాజు పాల్గొన్నారు.

కట్టు తప్పుతున్న ఖాకీలు..!

- సివిల్ పంచాయతీలు ఎక్కువ.. విధి నిర్వహణ తక్కువాయే..?
- ఫిర్యాదుదారుల పట్ల కర్కశత్వమే..
- అసాంఘికాలకు అడ్డాగా జగిత్యాల జిల్లా

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



జగిత్యాల జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి పోలీస్‌శాఖలో పని చేస్తున్న అధికారులు గతంలో కంటే క్రమశిక్షణ విషయంలో కట్టు తప్పుతున్నారని పలు సందర్భాలు నిరూపిస్తున్నాయి. అన్ని శాఖల్లోకెళ్ళా పోలీస్‌శాఖ అంటే క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచేది. కానీ ప్రస్తుతం ఆ శాఖలోని అధికారులు ఒకరిని మించి మరొకరు తామేమి తక్కువ తీసిపోలేదని విధి నిర్వహణలో అభాసు పాలవుతున్నారు.

మత్తులో జిల్లా...

జిల్లాలో ఒకవైపు గంజాయి, మత్తు పదార్థాలు విరివిగా లభ్యమవుతున్నాయి. మరో వైపు ఉగ్రవాదుల కార్యకలాపాలకు సంబంధించి ఎన్ఐఏ వంటి జాతీయ దర్యాప్తు సంస్థలు జగిత్యాలలో తనిఖీలు చేసేంతవరకూ జిల్లా పోలీస్‌శాఖ కని పెట్టలేక పోయిందంటే ఆ శాఖ ఏ స్థాయి నిద్రావస్థలో ఉందో స్పష్టం అవుతుంది.

జిల్లాలో పోలీస్‌శాఖలోని కొంత మంది అధికారులు, సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరు జిల్లా ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. బాధితులు ఫిర్యాదు చేయడానికి వెళితే వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారే ఆరోపణలు ఉన్నాయి. ఆ శాఖలో పని చేస్తున్న తోటి సిబ్బందిపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న అధికారులు మరోవైపు. ఇలా జిల్లాలో ఆ శాఖలో పని చేస్తున్న వారు ప్రవర్తిస్తున్న తీరు గతంలో ఎన్నడూ లేని విధంగా కొనసాగుతుంది. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై స్పందించి కొరడా జులిపిస్తున్నా. కొంతమంది అధికారుల ప్రవర్తనలో మార్పు రాకపోవడం శోచనీయం.

ఫిర్యాదులకు పటిష్ట వ్యవస్థ ఎక్కడ ?

జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లలో బాధితులు తమ సమస్యలపై ఫిర్యాదులు చేస్తుంటే వాటిని స్వీకరించడానికి కూడా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రజలు లేదా బాధితుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ వారి సమస్యని విని తక్షణమే వారి ఫిర్యాదును స్వీకరించి జనరల్ డైరీలో నమోదు చేయాల్సి ఉన్న ఆయా స్టేషన్‌లలో రిసెప్షన్‌లో పని చేస్తున్న సిబ్బంది తమ 'సారు' లేరు అని వచ్చే వరకు ఆగాలని బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్న సందర్భాలు అనేకం వెలుగు చూస్తున్నాయి. చట్ట ప్రకారం ఫిర్యాదు స్వీకరించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉన్న ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఫిర్యాదులు చేసి కూడా ఏం ప్రయోజనం లేదని బాధితులు మధన పడుతున్నారు.

రక్షణ పేరుతో భక్షణన..

క్రిమినల్ కేసులు కోర్టులలో మూలుగుతుంటే బాధితులకు రక్షణ కరువై.. నిందితులకు శిక్షలు పడకపోవడంతో నేరస్తులు పెరిగి, నేరాలు పెరుగుతూ నేర సామ్రాజ్యం విస్తరిస్తుంటే శాంతి భద్రతలకు విఘాతం కలిగి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులే పాత, కొత్త తేడా లేకుండా క్రమశిక్షణ కట్టు తప్పుతుంటే ప్రజలకు రక్షణ కల్పించాల్సిన వారే భక్షిస్తుంటే ప్రజల రక్షణ బాధ్యత ఎవరిదనీ జిల్లా ప్రజల ప్రశ్నిస్తున్నారు.

తీవ్ర కేసులలో నేరస్తులకు నూతన పాస్ పోర్ట్‌లు జారీ ..

హత్య, తీవ్రమైన నేరాలకు సంబంధించి అరెస్ట్ అయిన నిందితులకు సంబంధించిన పాస్ పోర్ట్ లను సీజ్ చేయడంలో పోలీస్ శాఖ విఫలమ వుతుంది. అదే విధంగా ఆ కేసులు కోర్టులలో విచారణ జరుగుతుండగా కొంత మంది నిందితులకు నూతన పాస్ పోర్ట్‌లు జారీ అవుతు న్నాయంటే ఆ శాఖ వైఫల్యమా లేదా నిందితుల చాకచక్యమా ! ఇది విన్న జిల్లా ప్రజలు ఔరా అంటూ ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు.



మాట్లాడుతున్న కృష్ణారావు

రైతుల పక్షాన ప్రభుత్వం పని చేస్తోంది

సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతోని చర్చించి ఆయన మాట్లాడారు. రైతులకు పంట ఎండిపోయి నష్టపోతారని ఉద్దేశంతో ఎస్ఆర్ఎస్‌పి ఎస్సీ మాట్లాడి రెండు తడిలకు నీరు ఇవ్వాల్సిందిగా కోరారు. దానికి వారు స్పందించి అధికారులు కచ్చితంగా నీటిని ఇస్తామని మాట ఇచ్చినట్లు తెలిపారు. దీంతో రైతులు జువ్వాడి కృష్ణారావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు కాస సంజీవ్, కంతి ప్రమోద్, భూస రాజేశ్వర్,వెంకట్‌రెడ్డి, దేశెట్టి రాజారెడ్డి, జలేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు



ధ్వంసమైన కెనాల్

పోరుమళ్ళలో డిస్ట్రిబ్యూటర్ కాల్వ గేట్లు ధ్వంసం

నవతెలంగాణ- మేడిపల్లి

మేడిపల్లి మండలం పోరుమళ్ళ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వెనుక భాగంలోని ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ (డిస్ట్రిబ్యూటర్ కాలువ) గేట్లు ఇరువైపులా ధ్వంసమావడంతో నీరు వృథా గా పోతోంది. గతంలో కూడా తొంబారావుపేట నుంచి కట్లకుంటకు మార్గమధ్యలో ఉన్న కాకతీయ కాలువకు గుంతలు ఏర్పడడంతో నీరు వృథాగా పోతోంది. సాగునీరును వృథా చేయకుండా చివరి ఆయకట్టు వరకు నీరందేలా చూడాలని సంబంధిత అధికారులను రైతులు, రైతు సంఘాల నాయకులు కోరారు.

పోరుమల్లలో మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు



ప్రారంభిస్తున్న మామిడి కొనుగోలు కేంద్రం

నవతెలంగాణ- మేడిపల్లి

మేడిపల్లి మండలంలోని పోరుమల్ల గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద పోరుమళ్ళ మ్యాంగో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారు మామిడి కొనుగోలు కేంద్రాన్ని ఎఫ్‌పిఓ(ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్) చైర్మన్ కొంగరి సంజీవ్, తాజా మాజీ సర్పంచ్, డైరెక్టర్ తౌటి తిరుపతిరెడ్డి బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఐక్యంగా మామిడి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రైతులతో పాటు సభ్యులకు మంచి గిట్టుబాటు ధర అందుతుందని తెలిపారు. కమిషన్ లేకుండా తక్కువ తరుగుతో 24 గంటల్లో నగదు చెల్లించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో చైర్మన్ కొంగర సంజీవ్, డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, నాగిరెడ్డి శ్రీనివాస్, నల్ల రాజు, బేతి అనిల్, జైపాల్, తిరుపతి, విగ్రో కంపెనీ ప్రతినిధి అసిస్టెంట్ మేనేజర్ జగదీష్, ఎఫ్‌పీవో సభ్యులు పాల్గొన్నారు.

దేదీప్యను సన్మానించిన మార్కండేయ సేవాసమితి



సన్మానిస్తున్న సేవాసమితి సభ్యులు

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో మార్కండేయ సేవాసమితి సభ్యులు కోరుట్ల పట్టణానికి చెందిన దేదీప్య ఇటీవల నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వీరవత్తిని శ్రీనివాస్ మాట్లాడుతూ.. రత్నలాంటి బిడ్డలు ఎవరికీ పుట్టారని పుట్టిన వారినే రత్నాలుగా తీర్చిదిద్దాలని అన్నారు. దేదీప్య మాట్లాడుతూ.. ఉద్యోగం సాదించాలంటే పట్టుదలతో చదవాలని, ఎన్నో ఎత్తు పల్లాలు దాటినప్పుడే విజయం సాధిస్తామని, అమ్మనాన్న అన్నయ్యలా సహకారం మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాస్ , ఉపాధ్యక్షుడు మల్లేష్, శ్రీకాంత్. ఆనంద్, రాజేష్, నవీన్, నాగరాజు, రణదేవ్, మల్లేష్, హరీష్, రాజు, రవి, జనార్దన్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- సమాజాన్ని కుల, మతాల పేరిట చీల్చడమే బీజేపీ ఏ జెండా..
- ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి
- ఎమ్మెల్యే, నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాల

అన్నీ వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం అని, భారత రాజ్యాంగం భగవద్గీత అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్, కాంగ్రెస్ నాయకులతో కలిసి కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పూజ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడారు. ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలని, ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే సంవత్సరంలో సంవృద్ధి వర్షాలు కురిసి, ప్రాజెక్టులు నీటితో కళకళలాడాలన్నారు. నాలుగు దశాబ్దాల ప్రజా జీవితంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా గెలిచానని, ప్రజా తీర్పుకు అనుగుణంగా జగిత్యాల ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం అదృష్టమని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల ప్రాంతాన్ని అభివృద్ధి చేశానని, ప్రజలకు సేవ చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. మంత్రిగా అవకాశం లభించినప్పుడు మూడు నెలల్లో పల్లె పల్లెల్లో విద్యుత్ సౌకర్యం కల్పించా అన్నారు. గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యతో సమాజం అభివృద్ధి చెందుతుందని విశ్వసించి, విద్యకు ప్రాధానత్య ఇచ్చానన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రభుత్వం స్పందించేలా చక్కెర కర్మాగారం పునః ప్రారంభించాలని ఒత్తిడి చేశానని తెలిపారు. ఏ సమస్య అయినా పరిష్కరించేందుకు ప్రశ్నించే గొంతుకగా నిలబడ్డాను అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అనాలోచిత చర్యతో రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టిందన్నారు.ప్రజలు మార్పు కోరి, కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. యూపీఏ పాలనలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలని, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలు చేశామని చెప్పారు. మోడీ పాలనలో ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసేలా 72000 కోట్ల నుండి 60000 కోట్లకు తగ్గించారన్నారు. మోడీకి మద్దతు ధర పట్ల చిత్తశుద్ధి లేదన్నారు.నిరుద్యోగ యువతకు ఏడాదికి 2 కోట్లు చొప్పున భర్తీ పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం చేసి, అమ్మకానికి పెడుతున్నారన్నారు. బీజేపీ గెలిస్తే, రిజర్వేషన్లు కనుమరుగు అయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో హిందూ వ్యతిరేకం అని కిషన్‌రెడ్డి పేర్కొనడం హాస్యాస్పదం అన్నారు. విమర్శలు సహేతుకంగా ఉండాలన్నారు. సమాజాన్ని చీల్చడమే బీజేపీ నైజాం అని పేర్కొన్నారు. మొన్నటి వరకు మోడీ 400 సీట్లు గెలుస్తామని అన్నారు. ఇప్పుడు 350 సీట్లు గెలుస్తాం అంటున్నారు. వారానికి 50 చొప్పున సీట్లు తగ్గుతున్నాయని ఎద్దేవా చేశారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు సేవలు అందిం చేందుకు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీగా పోటీ చేస్తున్నా అని, నిజామాబాద్‌లో సైతం జగిత్యాల ప్రజల ఆదరణ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఘనంగా క్రోధి నామ సంవత్సర వేడుకలు



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

క్రోది నామ సంవత్సర ఉగాది వేడుకలు జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, బూరెలు పంపిణీ చేశారు. అనంతరం జాతీయ సమైక్యతకు కృషి చేస్తున్న జిల్లాలోని 16 మంది పెన్షనర్లకు, సీనియర్ సిటీజన్స్‌కు జాతీయ సమైక్యతా పురస్కారాలు రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కందుకూరి కృష్టారెడ్డి, సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్‌ల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, పెన్షనర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం విజయ్, అసోసియేట్ అధ్యక్షుడు పి.సి.హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఉగాది క్రోధినామ నూతన సంవత్సరం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హనుమాన్ దేవాలయం వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు కైర నాగేష్, జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చిలివేరి నవీన్, భజరంగ్ దళ్ మండల కన్వీనర్ బండి జైపాల్ పాల్గొన్నారు.

సారంగాపూర్: దైనందన జీవితంలో ప్రతిరోజు ఉదయం నవ్వుతూ నడుస్తూ సుఖంగా బతకాలని జగిత్యాల ఎస్‌కెఎన్ ఆర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య అన్నారు. మంగళవారం ఉదయం జగిత్యాల పట్టణంలోని ఎస్‌కెఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎస్‌కెఎన్‌ఆర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుప్పాల శ్రీధర్, ఉప వైద్యాధికారి శ్రీనివాస్, సిటీ కేబుల్ అధినేత సూర్యం, ఉత్తర తెలంగాణ ఫిలిం ఇండస్ట్రీ ప్రముఖ వ్యాపారవేత్త మానాల పుల్లయ్య లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, బూరెలు పంపిణీ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు భాగ్యరాజ్ ఫంక్షన్ హాల్ అధినేత ములాసపు రాజన్న, ప్రధాన కార్యదర్శి పరంధాములు, కోశాధికారి ఎంబారి శ్రీనివాస్, పిల్లి కిషన్, అప్నా బజార్ శ్రీనివాస్, కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, కూసరి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు లక్ష్మారెడ్డి, గుండేటి కిరణ్ ప్రముఖ పాత్రికేయులు పురుషోత్తం రెడ్డి, కుసుంబ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పాటుపడాలి

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకల్లో జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. జగిత్యాలలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందిరాభవన్‌లో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు చెట్టే భార్గవ్ చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని కేంద్రంలో అధికారం తీసుకువచ్చే దిశగా కార్యకర్తలు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ ఛైర్మెన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, టీపీసీసీ ప్రచార కమిటీ మెంబర్ రఘువీర్‌గౌడ్, గొల్లపెల్లి మండల అధ్యక్షుడు మాజీ సర్పంచి ముస్కు నిశాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గంగం మహేష్, యూత్ నాయ కులు రాగుల ప్రదీప్, డబ్బు నిఖిల్, కిషోర్, మహిపాల్, ముల్లె శీను తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

సక్ష్యమ్ ఆధ్వర్యంలో దివ్యాంగ సేవా కేంద్రం పారంభం



ప్రారంభిస్తున్న కోటగిరి శ్రీనివాస్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జిల్లా కేంద్రంలో స్థానిక మేయో హాస్పిటల్ ప్రాంగణంలో సక్ష్యమ్ ఆధ్వర్యంలో దివ్యాంగ సేవా కేంద్రాన్ని యశస్వి ఎంటర్ప్రైజెస్ అధినేత కోటగిరి శ్రీనివాస్ ప్రారంభించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగ సేవా కేంద్రం జిల్లాలో ఉన్న దివ్యాంగులకు ప్రతిరోజు అందు బాటులో ఉంటుందని, ఈ దివ్య కేంద్రంలో దివ్యాంగులకు సంబంధించిన సమస్యలు, సదరం సర్టిఫికెట్స్, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, కృత్రిమ అవయవాలు, రక్తదానం, సెరిబ్రల్ పాలసీ, పుట్టుకతో వచ్చే మానసిక లోపాలు, వినికిడి లోపాలు ఉన్నవారికి అన్నిటికి సంబంధించి మార్గదర్శనం చేయడం తదితర సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సక్షమ్ అధ్యక్షులు డాక్టర్ తాటిపాముల సురేష్, కార్యదర్శి కూర్మాచలం రఘునందన్, సభ్యులు ఎన్నమనేని అశోక్‌రావు, గడ్డం మహిపాల్ రెడ్డి, జిడిగే పురుషోత్తం, జగిత్యాల భవిత సెంటర్ రాజేందర్, నాగభూషణం పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ మల్లికార్జున ఆలయ వార్షికోత్సవ వేడుకలు



అగ్నిగుండం దాటుతున్న భక్తులు

నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంలో శ్రీ మల్లికార్జున ఆలయ వార్షికోత్సవ ముగింపు వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం పూట మహా అన్నదానం పట్నాలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటుచేసిన అగ్నిగుండంలో శ్రీ మల్లికార్జున, కేతలమ్మ ఉత్సవ మూర్తులు దాటారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కిసాన్ కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతి రెడ్డి, ఆలయాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సంఘ గంగా రాజం యాదవ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నాయకులకు సన్మానం



నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు. కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావులు ప్రత్యేక పూజలు చేశారు. వారిని అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. వారిని శాలువాతో కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకట్, దొంతుల తుకారం, దోమకొండ రాజన్న, సల్కం నర్సయ్య, తోకలశేఖర్, జంగ విజయ్, జెసిబి శంకర్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



నవతెలంగాణ - చందుర్తి

మండలానికి చెందిన వివాహిత హైదరాబాదులో ఆత్మహత్య చేసుకోగా మల్యాల గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మల్యాలకు చెందిన చింతం రాజేశం భూమక్కల కూతురు మాధురి(20)కి కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రానికి చెందిన వ్యక్తితో రెండు సంవత్సరాల కిందట వివాహం జరిపించారు. ఉద్యోగరీత్యా హైదరాబాదులో ఉంటున్నారు. కుటుంబ కలహాలతో మధురి మంగళవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పండుగ రోజున మాల్యాల గ్రామంలో విషాదం నెలకొంది. మృతురాలికి ఏడాది కూతురు ఉంది.

నేతన్నల పోరాటానికే ప్రభుత్వం దిగొచ్చింది

స్వార్థ ప్రయోజనాలకు రాజకీయం చేయొద్దు

- కేంద్రం అనేక పథకాలను రద్దుచేసి 12శాతం జీఎస్టీ వేసింది
- ఎంపీ బండి సంజయ్ ఎన్నడూ స్పందించలేదు
- ఓట్లు దండుకోవడం కోసమే దీక్ష పేరుతో బండి కపట ప్రేమ
- పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ సభ్యులు

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం నివారణకు గత 15రోజుల నుంచి నేతన్నల పోరాటానికే ప్రభుత్వం దిగివచ్చి సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ కన్వీనర్లు ముశం రమేష్, పంతం రవి అన్నారు. కొందరు స్వార్థ రాజకీయాల కొరకు తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గత కొన్ని రోజుల నుంచి కార్మికులు వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని, జేఏసీ ఏర్పాటుచేసి పలు దఫాలుగా పోరాటాలు చేసిందన్నారు. దీని ఫలితంగా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాయిలు, యారన్ సబ్సిడీ, కరెంట్ సబ్సిడీ, సంవత్సరంపాటు పని కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్ రెడ్డి లు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జేఏసీ సభ్యులు తెలిపారు. నేతన్నలు చేసిన పోరాటాన్ని కొంతమంది తమ స్వార్థ రాజకీయాల కోసం పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. ఎంపీ బండి సంజయ్ దీక్ష చేస్తున్నానని ప్రకటించిడంతోనే ప్రభుత్వం స్పందించిందని, కార్మికులు పోరాడి సాధించిన విజయాన్ని తన విజయంగా చెప్పుకోవడం సరికాదన్నారు. జాతీయ చేనేత బోర్డు, జాతీయ టెక్స్టైల్ బోర్డు, ఐసీఐసీఐ లాంబార్డ్ ఆరోగ్య బీమా, హౌస్ కం వర్క్ షీట్ లాంటి పథకాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి వస్త్ర పరిశ్రమపై 12శాతం జీఎస్టీని పెంచిందన్నారు. కానీ ఏనాడు ఎంపీ బండి సంజయ్ స్పందించలేదన్నారు. గత మూడు నెలలుగా నేతన్నలు చేస్తున్న పోరాటం కనిపించలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు కేవలం ఓట్లు దండుకోవడం కోసమే దీక్ష చేస్తానని నేతన్నలపై కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. నేత కార్మికులపై ప్రేమ ఉంటే పదేళ్ల కింద పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసిన ఈఎస్ఐ హాస్పిటల్ ఎందుకు పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రజల సమస్యల పట్టించుకోని బండి సంజయ్‌కు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ఈ సమావేశంలో జేఏసీ సభ్యులు మండల సత్యం, వెల్లండి దేవదాస్, తాటిపాముల దామోదర్, కట్టెకోల లక్ష్మీనారాయణ, కోడం రమణ, సిరిసిల్ల రవి, పిస్క మధు, యేల్దండి శంకర్, గోనె పర్శరాములు, సిరిమల్ల సత్యం, నక్క దేవదాస్, గుండు రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



నవతెలంగాణ- హుజురాబాద్

పట్టణంలోని మూడో వార్డులో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది పండుగను పురస్కరించుకొని పోచమ్మ బోనాలను డప్పు సప్పులతో ఘనంగా ఊరేగింపుగా వెళ్లి దేవాలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ మక్కపల్లి కుమార్ యాదవ్, సంఘం అధ్యక్షులు రవీందర్, మొగిలి, రాజు, రాజయ్య, శ్రీనివాస్, బిక్షపతి పాల్గొన్నారు

ఓమౌజయా: ప్రజ్ఞాన క్షేత్రంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న ఆశ్రమ నిర్వహకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఓమౌజయ్యా ప్రజ్ఞాన క్షేత్రంలో సాంప్రదాయబద్ధంగా 24గంటల యజ్ఞం, 22రకాల వంటలతో మంగళవారం నిర్వహించిన ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేశారు. బుధవారము ఉదయం పూర్ణాహుతి అనంతరం శ్రీప్రభు వారి అనుగ్రహ ప్రవచనంతో ఉగాది మహోత్సవ వేడుకలు ముగుస్తాయని వివరించారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన అన్నదానంలో వేలాదిగా భక్తులు పాల్గొని 22రకాల అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ వేడుకల్లో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుట్టల మల్లన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



పుట్టల మల్లన్న ను దర్శించుకున్న ప్రభుత్వ విప్

నవతెలంగాణ - కొనరావుపేట

కొనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలోని పుట్టల మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవ పురస్కరించుకొని మంగళవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ శ్రీ క్రోధి నామ నూతన సంవత్సరం ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని వేడుకున్నారు.. ఆయన వెంట మాజీ సెస్ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి వేములవాడ ఆలయ ధర్మకర్త చేపూరి గంగాధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, తాళ్లపల్లి ప్రభాకర్, నందుగౌడ్, బోయిన దేవరాజ్, పెంతల శ్రీనివాస్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

13నుంచి సుద్దాలలో వృద్ధులకు నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభం

నవతెలంగాణ - కొనరావుపేట

కొనరావుపేట మండలంలోని సుద్దాల గ్రామంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 13నుంచి వృద్ధులకు సాధువులకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు దైవనంద స్వామి మంగళవారం తెలిపారు. ఆయన సందర్భంగా మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశీస్సులతో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వృద్ధులు సాధువులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి దాతలు కూడా ముందుకు రావాలని కోరారు.

గురుకుల విద్యార్థులకు కంటి పరీక్షలు

981మంది విద్యార్థులకు పరీక్షలు

72మందికి దృష్టి లోపం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ - భగత్‌నగర్

కరీంనగర్ జిల్లాలోని సంక్షేమ గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల విద్యార్థుల దృష్టి లోపాలను గుర్తించి వారికి సకాలంలో వైద్యం అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల విద్యాభ్యాస నాణ్యత మెరుగుపడటంతో పాటు వారి సమగ్రాభివృద్ధికి దోహదం చేస్తుంది. జిల్లాలో సోమవారం నాలుగు వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తంగా 981మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 72మందికి దృష్టి లోపం ఉన్నట్టు గుర్తించారు. ఏడుగురికి వైద్యం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

కార్యక్రమ వివరాలు:

- కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నెలాఖరు వరకు కొనసాగుతుంది.
- రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం విభాగానికి చెందిన నాలుగు వైద్య బందాలు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నాయి.
- ఈ బందాల్లో కంటి నిపుణులైన ఆప్తాలమిక్ సహాయకులు కూడా ఉన్నారు.
- ఒకటి నుండి పదో తరగతి వరకు చదివే అన్ని వసతిగహాలలోని విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తారు.
- దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు అవసరమైన వైద్యం, కళ్లజోళ్లను అందిస్తారు.

ప్రయోజనాలు:

- ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల దృష్టి లోపాలను ముందుగానే గుర్తించి వారికి సరైన వైద్యం అందించడం సాధ్యమవుతుంది.
- దీనివల్ల విద్యార్థుల చదువుపై ఎటువంటి ప్రతికూల ప్రభావం చూపకుండా నిరోధించవచ్చు.
- సకాలంలో వైద్యం అందించడం ద్వారా విద్యార్థుల కేంద్రీకతత మరియు గ్రహణశక్తి పెరుగుతుంది.

ఘనంగా ఉగాది వేడుకలు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం జెడ్పీటీసీ కార్యాలయంలో, అన్ని గ్రామాల్లో క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జెడ్పీటీసీ కార్యలయంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు స్వయంగా ఉగాది పచ్చడి తయారు చేశారు. పిండితో తయారుచేసిన బక్షాలను పాల్గొన్న వారందరికి అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలుతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు అందే సుభాష్, మండల కోఆప్షన్ మెంబర్ జబ్బర్, మీసం రాజం, ఎంపీటీసీ మధు, ఎనగందుల నరసింహులు, గుర్రాల రాజిరెడ్డి, కొర్రి అనిల్, మునిగే ప్రమోద్, ఎస్టీసెల్ మండల అధ్యక్షులు సీత్యా నాయక్, అజ్మీరా రాజు నాయక్, గనమేని సుధాకర్‌రావు, బంధారపు బాల్‌రెడ్డి, ఎనగందుల బాబు, సిరికొండ నాగరాజు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ : ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ - ముస్తాబాద్

మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉగాది పండగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్తాబాద్, పోతుగల్, గూడెం, ఆవునూరు, మద్దికుంట, మోహిని కుంట, బందనకల్‌తోపాటు అన్ని గ్రామాలలోని దేవాలయాల వద్ద వేద పండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం పచ్చడ ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా దేవాలయాల కమిటీ చైర్మన్‌లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీ నాయకులు, అన్ని సామాజిక వర్గాల ప్రజలు మహిళలు యువకులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి..

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..

నవతెలంగాణ - వేములవాడ

శ్రీ క్రోధి నామ నూతన సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం వేములవాడ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి రైతు మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం మత్తడి పోచమ్మ తల్లిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ క్రోధి నామ సంవత్సరం సందర్భంగా రైతులు తమ పాడి పశువులను పొలంబాట, సాగుబాట పట్టే విధంగా నూతన సంవత్సరం మొదటి రోజున ఎడ్లకు ప్రత్యేకంగా అలంకరణ చేసి నాగాండ్లను కట్టి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ వ్యవసాయ క్షేత్రాలను చదును చేయడం గత కొంతకాలంగా ఆనవాయితీగా వస్తుందని మన ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నూతన సంవత్సరంలో రైతు వర్గంతోపాటు రాష్ట్ర ప్రజలకు అంతే మంచే జరగాలని వర్షాలు సకాలంలో సమృద్ధిగా కురిసి పాడిపంటలతో వర్ధిల్లాలని వేడుకొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు సమపాళ్లలో కొనసాగిస్తూ ముందుకు పోతామన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సంక్షేమం లక్ష్యంగా పనిచేస్తే ముందుకు పోతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ బింగి మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు, కనికరపు రాకేష్, తోట రాజు, చిలక రమేష్, బైరి సతీష్ పండు, కదారి రాములు, మహాలక్ష్మి రైతు మిత్ర మండలి సభ్యులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - బోయినిపల్లి

ఉగాది పండగ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను బోయినిపల్లి మండలం కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి పొన్నంతో కలిసి ఉగాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్ మాట్లాడుతూ ఈ ఉగాది సంవత్సరం ఈ ఉగాది సంవత్సరంలో ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు. అనంతరం మండలంలోని పలు సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలుపగా సానుకూలంగా స్పందించాడన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, నాయకులు నాగుల వంశీ, ఏనుగుల కనకయ్య, జంగం అంజయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ - చందుర్తి

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను మంగళవారం ప్రజలు నిర్వహించుకున్నారు. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రైతుల సుఖ సంతోషాలతో జీవించాలి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలో మహాత్మానగర్‌లోని ప్రజాభవన్‌లో (మానకొండూరు నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో) శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులచే ఉగాది వేడుకలు, పంచాంగం శ్రావణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలకు శుభం కలగాలని, వానలు సమృద్ధిగా కురిసి రైతుల కుటుంబాలు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. మానకొండూర్ నియోజకవర్గం, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మొగిలిపాలెం మాజీ సర్పంచ్ మోరపల్లి సుస్మిత, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మామిడి అనిల్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గవ్వ రాజేందర్‌రెడ్డి, నాయకులు గోపు మల్లారెడ్డి, ఎస్ఎల్ గౌడ్, ఎంపీటీసీలు కొత్త తిరుపతిరెడ్డి, బండారి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు రాము, రెడ్డిగాని రాజు, పోలు రమేష్, బుదారపు శ్రీనివాస్, మాచర్ల అంజయ్య గౌడ్, కొండల్ రావు, శ్రీనివాస్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.



తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామంలో ఉగాది పర్వదినన్ని పురస్కరించుకొని శ్రీ తిరుమలప్ప స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ మండల వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎలుక అనిత ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ కుంభం శ్రీనివాస్, దేవాలయ చైర్మన్ రొండ్ల రాజేశ్వర్‌రెడ్డి, సభ్యులు తమ్మనవేని రాజయ్య, చెక్కబండి రమణారెడ్డి, చింతల శ్రీనివాస్, ల్యాగల దేవేందర్ రెడ్డి, గోనెల మోహన్, రంగరవేని శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు చిమ్మిరాల రామకృష్ణమాచార్యులు, పెరంబుదూరి రమేష్ పాల్గొన్నారు.

మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్

నగరంలో మేముసైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలు, చిన్నారులతో తెలుగు నూతన సంవత్సర ఉగాది పర్వదినం వేడుకలు నిర్వహించారు. ఉగాది పచ్చడి తయారు చేసి అందరికీ పులిహోర, భక్షాలు, మహిళలకు చీరలు, పిల్లలకు డ్రెస్సులు టవల్స్ పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్, రూప, అనురూప్, తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్ రూరల్ : మేము సైతం ఫౌండేషన్ సభ్యులు, పాల్గొన్న నిరుపేద ప్రజలు

నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలంలోని గ్రామ గ్రామాన గల దేవాలయాల్లో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినంను పురస్కరించుకుని వేదపండితులు పంచాంగ శ్రవనం చేశారు. కాసారం, మధురానగర్, గర్శకుర్తి, బూర్గుపల్లి, గంగాధర, గట్టుభూత్కూర్, మల్లాపూర్, కురిక్యాల, ఉప్పరమల్యాల, కాసారం, ఆచంపల్లి, ఒద్యారం, సర్వారెడ్డిపల్లి, కోట్ల నర్సింహులపల్లి, వెంకటాయపల్లి, కాచిరెడ్డిపల్లి, ర్యాలపల్లితోపాటు ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో వేదపండితులు పంచాంగ శ్రవనం



శ్రీ మహాలక్ష్మి రైతు మిత్రమండలితో ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - హుజూరాబాద్

నూతన సంవత్సర ఉగాది పర్వదిన వేడుకల హుజూరాబాద్‌లో ప్రజలు జరుపుకున్నారు. కొంతమంది పోచమ్మ దేవతకు బోనాలు సమర్పించుకున్నారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణ చేశారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చైర్‌పర్సన్ రాధిక, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కరీంనగర్ నగర కాంగ్రెస్ కార్యాలయంలో

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని నగర కాంగ్రెస్ కార్యాలయంలో సుడా చైర్మెన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రామకృష్ణ శర్మచే పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు ఉగాది పచ్చడి, భక్షాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విభిన్న రుచుల సమ్మేళనంతో కష్టసుఖాల పట్ల సమభావనను అలవరుస్తూ జీవన తాత్వికతను బోధించేదే ఉగాది పంచాంగ శ్రవణం అని నగునూర్ శ్రీదుర్గాభవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వర శర్మ అన్నారు. కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో చైత్ర మాస వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా ఉగాది పండుగను పురస్కరించుకుని ఆయన పంచాంగ శ్రవణం చేశారు.ఆలయ వసంతోత్సవాలలో భాగంగా పుణ్యవచనం, కలశ స్థాపన, అమ్మవారికి విశేష అలంకరణ, విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గన్నేరువరం





ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాలలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని కాసింపేట మానసదేవి ఆలయం, గన్నేరువరంలోని లక్ష్మీనరసింహ ఆలయం, శివభక్త మార్కండేయ ఆలయం, మైలారం మల్లికార్జున స్వామి ఆలయం, గుండ్లపల్లి రంగనాయకుల స్వామిఆలయం, గునుకుల కొండాపూర్ ఆంజనేయ స్వామి ఆలయాలలో ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాలలో పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు.

మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-పెద్దపల్లి
పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తాలో గాయత్రి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. క్రోది నామ సంవత్సర ఉగాది పండుగని పురస్కరిం చుకొని గాయత్రి సేవా సమితి సభ్యులు భాగస్వాములై నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి సేవా సమితి సభ్యులు కాసనగొట్టు వినయ్, రావికంటి రాజు, పైడా నరేందర్, ముస్త్యాల ప్రదీప్, బొల్లం శ్రీనివాస్, చిట్టిమల్ల రవి, సంకిస ఆంజనేయులు, నాగమల్ల శ్రీనివాస్, కటకం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెద్దపల్లి
పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని శాంతి నగర్ శ్రీసీతారాముల స్వామి దేవాలయంలో, సాయిబాబా దేవాలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు, పంచాంగ కర్తలు ఎమ్మెల్యే విజయరమణ రావు రాశి ఫలంతో పాటు ఇతర రాశుల పంచాంగాన్ని వివరించారు. అనంతరం అందరికి ఉగాది పచ్చడి వితరణ చేశారు. తెలంగాణ రాష్ట్ర, పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరికి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పట్టణ కౌన్సిలర్స్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాష్ట్ర కార్యదర్శి నరేష్‌కు కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-మంథని
మంథనిలో ఎన్ఎస్ యుఐ 54వ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నాయకత్వంలో మరింత ముందుకు తీసుక వెళ్తామని తెలిపారు.ఈ కార్యక్రమం అనంతరం మంథని మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమ సురేష్ రెడ్డి ఉగాది పచ్చడి, భక్షాలు అందరికీ అందజేశారు.ఈ కార్యక్రమంలో మంథని మండలం అధ్యక్షులు ఐలి ప్రసాద్,టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ శశి భూషణ్ కాచే,యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షులు పెంటరి రాజు,యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ల నాగరాజ్,యూత్ కాంగ్రెస్ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ ముదిరాజ్,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్య,యూత్ కాంగ్రెస్ నాయకులు పెరుగు తేజ,రాజేశ్వరరావు,ఎరుకల రమేష్.పోరెళ్ల రంజిత్,ఎరుకల సురేష్, విజయ్, మీడియా ఇంచార్జ్ అరేల్లి కిరణ్ గౌడ్.ఉరవకొండ గణేష్,రామగిరి మండలం మహిళ అధ్యక్షురాలు పబ్బతి రాధారెడ్డి,మహిళ నాయకురాలు కెక్కర్ల స్వరూప గౌడ్, తదితరులు పాల్గొన్నారు

మంథనిలో ఘనంగా ఉగాది వేడుకలు



నవతెలంగాణ-మంథని
మండలంలోని ప్రజలు మంగళవారం ప్రారంభమైన క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కుటుంబ సమేతంగా ఆయా గ్రామాలయాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంట్లో ఉగాది పచ్చడి తాగి, బూరెలు చేసుకుని కుటుంబ సమేతంగా కలిసి భుజంచారు. కొత్త సంవత్సరాంలో వర్షాలు సమృద్ధిగా కురిసి,పంటలు సమృద్ధిగా పండాలని,కరువు కాటకాలు లేకుండా చూడాలని ఆ భగవంతుణ్ణి ప్రజలు వేడుకున్నారు.మంథనిలోని పలు దేవాలయంలో భక్తులు దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో పంచాంగ శ్రావణ కార్యక్రమాలను నిర్వహించారు.ఆలయాల ఆవరణలో వాహన పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంథని పట్టణముతో పాటు మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడిపోయాయి. పలు కుటుంబాల్లో పచ్చడి సేవిస్తూ భక్షాలు భుజించారు.మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రురమ-సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఉగాది పచ్చడి అందజేసి,బూరెలనుపంపిణీ చేశారు.

గోల్డ్ మెడల్ సాధించిన శ్రీజకు సన్మానం



నవతెలంగాణ-మంథని
హిమాచల్ ప్రదేశ్ లో జరిగిన ఖేల్ ఇండియా ఉమెన్స్ వెయిట్ లిఫ్టింగ్ లీగ్ నేషనల్స్‌లో తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి గ్రామానికి చెందిన పులి శ్రీజ బంగారు పతకం సాధించారు. పులి బ్రహ్మం-లక్ష్మిల కూతురు శ్రీజ గోల్డ్ మెడల్ సాధించడం పట్ల శ్రీపాద శ్రీజను రాష్ట్ర ఐటీ,పరిశ్రమలు,శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు



నవతెలంగాణ-గోదావరిఖని క్రైం:
ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ తరపున రాబోవు 15 రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని ప్రజలకు, యువకులకు, విద్యార్థినీ, విద్యార్థులకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ గురించి పోలీసు వారి తరుపున సూచనలు చేశారు. ఈ మధ్యకాలంలో వేసవి సెలవుల సందర్భంగా అన్ని పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు, యువకులు వారి వారి స్వస్థలాలకు చేరుకొని ఖాళీగా ఉంటున్నందున వారి తల్లిదండ్రులకు సంబంధించిన వాహనాలను తీసుకొని ఎలాంటి డ్రైవింగ్ లైసెన్స్ లేకున్నా మైనర్ పిల్లలు డ్రైవ్ చేయడం,హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, రాష్‌గా డ్రైవింగ్ చేయడం,రాంగ్ రూట్‌లో వెళ్తూ ప్రమాదాలకు గురికావడం,ట్రిబుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాలకు గురికావడం, సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు లోనుకావడం కనిపిస్తుందని, ఇలాంటి ప్రమాదాలకు సంబంధించి ఈ మధ్యకాలంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 9 కేసులు నమోదు కావడం జరిగిందని తెలిపారు. దీనికి కారణం ట్రాఫిక్‌కు సంబంధించి నియమాలను పాటించకపోవడమే తెలిపారు. మైనర్ పిల్లలకి ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వరాదని, వాహనదారులు ఎవరు కూడా హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ పెట్టుకోకుండా వాహనం నడపరాదని, వాహనదారులు రాంగ్ రూట్‌లో వాహనాలు నడపరాదని, వాహన దారులు అతివేగంగా ర్యాష్‌గా వాహనాలను నడపరాదని, ట్రాఫిక్ సిగ్నల్‌ను పాటించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, లైసెన్స్ లేకుండా వాహనాలకు నడుపరాదని, వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పేపర్స్, ఇన్సూరెన్స్, ఫిట్నెస్, పొల్యూషన్ కాగితాలు లేకుండా వాహనాలను నడపరాదని తెలిపారు. నిబంధనలు పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలకు గురి కాకుండా మీరు, మీ కుటుంబ సభ్యులకు తోడుగా ఉండాలని, అదేవిధంగా ప్రమాదాలకు కారణమై ఇతరులను, వారి కుటుంబ సభ్యులను రోడ్డుపాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఏదైనా ప్రమాదానికి గురై కేసుల పాలు అయినట్లయితే భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగానికి గాని ప్రైవేటు ఉద్యోగానికి గానిఅర్హత ఉండదని హెచ్చరించారు. ఈ విషయాలను గమనించి వాహనదారులు నియమ, నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా డ్రైవ్ చేస్తూ మీ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని ఆశించారు.

ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న జీఎం

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖనిలో క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఉగాది పర్వదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం చింతల శ్రీనివాస్ హాజరై సింగరేణి ఉద్యోగులకు,వారి కుటుంబ సభ్యులకు, అధికారులకు, సూపర్ వైజర్లకు, యూనియన్ ప్రతినిధులకు, పుర ప్రజలకు ఈ సందర్భంగా ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరికీ ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ క్రోధినామ సంవత్సరం ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. వసంత రుతువులో వచ్చే ఉగాది పండగ మార్పునకు సంకేతమని, మనం కూడా మార్పునకు అనుగుణంగా మన నడవడిని మార్చుకొని కొత్త ఒరవడికి స్వాగతించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజీఎం రాంమోహన్, పర్సనల్ ఏజీఎం సిహెచ్.లక్ష్మి నారాయణ, ఏరియా ఇంజనీర్ రాంమూర్తి, ఎజీఎం ఐఈడి ఆంజనేయులు, ఎజియం సివిల్ నాగేశ్వర్ రావు, ఎన్విరాన్ మెంట్ అధికారి అంజనేయ ప్రసాద్, డీజీఎం ఫైనాన్స్ ధనలక్ష్మి బాయి, సర్వే ఆఫీసర్ ప్రభాకర్, అడిట్ అధికారి రాజం, పర్చేజ్ డిజియం శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ బాల సుబ్రమణ్యం, ఫారెస్ట్ అధికారి అభిలాష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్స్ బంగారు సారంగపాణి, జి.హనుమంతరావు, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి తదితరులున్నారు. ఉగాది పండుగ సందర్భంగా రామగుండం కార్పొరేషన్ 30వ డివిజన్ మల్లిఖార్జున్ నగర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్రోధి నామ సంవత్సరం ప్రజలందరికీ మంచి జరగాలని అందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. బీజేపీ నాయకులు పంగ రవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, బీజేపీ మాజీ మండలాధ్యక్షులు మామిడి సంపత్, అడ్డూరి రాజేష్, అరిగెల శ్రావణ్, నాయకులు కుమ్మరి మల్లేష్, చల్ల వేణు రెడ్డి, దుబ్బసి లక్ష్మణ్, బండారి శ్యామ్ తదితరులున్నారు.

సామాజిక సేవ అభినందనీయం

- అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్
- రెసిడెంట్ టీచర్స్ చలివేంద్రం ప్రారంభం



రిబ్బన్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్

నవతెలంగాణ-పెద్దపల్లి
సామాజిక సేవలో పాలుపంచుకోవడం అభినందనీయమని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి రెసిడెంట్స్ టీచర్స్ ఆధ్వర్యంలో పెద్దపల్లి అయ్యప్ప టెంపుల్ వద్ద మానస గంగోత్రి వాటర్ ప్లాంట్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ ప్రారంభించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఉగాది పచ్చడి, భక్ష్యాలు అదనపు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ..పెద్దపల్లిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులందరూ వారి వారి సంఘాలకు అతీతంగా ఐక్యంగా పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమన్నారు. వేసవి కాలంలో ప్రజల దాహర్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గాన్ని, అసోసియేషన్ సభ్యులను అదనపు కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వేగోళం సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు వి.హనుమంతు, పెద్దపల్లి మండల విద్యాధికారి సురేందర్ కుమార్, కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, కర్రే ప్రవీణ్, కనకయ్య, కిషన్ రెడ్డి, సంపత్ రెడ్డి, మెతుకు తిరుపతి, కర్నె రాజు, ఫణిందర్, సలహాదారులు చాట్ల ఆగయ్య, సీనియర్ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ యువత జిల్లా అధ్యక్షుడిగా సాగర్



నవతెలంగాణ-పెద్దపల్లి
అఖిల భారత యాదవ మహాసభ యువత విభాగం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా పెద్దపల్లి మండలం పాలితం గ్రామానికి చెందిన అట్ల సాగర్ యాదవ్‌ను నియమించినట్లు యువత రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు నియామక పత్రం విడుదల చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం ఓదెల జడ్పీటీసీ గంట రాములు యాదవ్ సాగర్‌కు నియామక పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సాగర్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.తన నియామకానికి సహకరించిన వారికి సాగర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సందనవేణ సునీత రాజేందర్, మేకల మల్లేశం, మారం తిరుపతి యాదవ్, పెగడ రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



నవతెలంగాణ-ఓదెల
పెద్దపల్లి జిల్లాలోని అతిపెద్ద శైవ క్షేత్రమైన శ్రీ ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉగాది వేడుకల్లో భాగంగా యాదవుల సంప్రదాయం ప్రకారం హరిపురం గ్రామానికి చెందిన మాకోటి కుటుంబ సభ్యులు మేకపోతులతో రథం తయారు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమ ంలో ఆలయ డైరెక్టర్లు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది, పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గుండెటి ఐలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పంచాంగ శ్రవణం వినిపిస్తున్న పూజారులు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలంలో తెలుగు సంవత్సరాది క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని లక్కారంలో గల శ్రీ సీతారాముల దేవాలయంలో, అదేవిధంగా పోతారం గ్రామ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వేదపండితులు, పంచాంగకర్తలు మాజీ ఎంపీపీ అత్తే చంద్రమౌళి ఆధ్వర్యంతో రాశి ఫలాలతో పాటు పంచాంగాన్ని వినిపించారు. అనంతరం మహిళలు, గ్రామ ప్రజలకు షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి అందజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ అత్తె చంద్రమౌళి మాట్లాటడుతూ జీవితం కూడా ఉగాది పచ్చడితో కూడుకున్న సమ్మేళనం అని, జీవితంలో కష్ట సుఖాలు, సంతోషాలు అన్ని రకాల అనుభవాలతో కూడుకొని ముందుకు పోయేదే జీవితమని అన్నారు. ఈ తెలుగు సంవత్సరాది క్రోధి నామ సంవత్సర ఉగాదిలో అందరికీ మంచి జరగాలని ఆశించారు. మండల ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వైట్‌హౌస్ వద్ద ఉగాది పర్వదిన వేడుకలు

పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న రామగుండం ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖనిలో క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని వైట్‌హౌస్ వద్ద దీటి బాలరాజు ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ హాజరయ్యారు. రామగుండం నియోజకవర్గ ప్రజలకు ఆయన క్రోధినామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం షడ్రుచుల సమ్మేళనంతో కూడిన ఉగాది పచ్చడి సేవించి, జీవితం కూడా ఉగాది పచ్చడితో కూడుకున్న సమ్మేళనం అని, జీవితంలో కష్ట సుఖాలు, సంతోషాలు అన్ని రకాల అనుభవాలతో కూడుకొని ముందుకు పోయేదే జీవితమని అన్నారు.ఈ ఉగాది సందర్భంగా ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ ఉగాది పండగ సంవత్సర కాలంలో రామగుండం నియోజకవర్గ అభివద్ధికి మరింతగా కషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, నాయకులు మహంకాళి స్వామి, పాతపల్లి ఎల్లయ్య, కాల్వ లింగస్వామి, ముస్తాఫా, గట్ల రమేష్, మారెల్లి రాజిరెడ్డి, చెరుకు బుచ్చిరెడ్డి, ఉల్లంఘుల రమేష్, మోహిత్ సన్నీ, మద్దెల శ్రీనివాస్, సిరాజుద్దీన్, మహంకాళి అంజయ్య, చాగంటి శంకర్ తదితరు లున్నారు.

వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నియోజవర్గ పరిధిలోని వివిధ డివిజన్లలోని నిరుపేద 8 మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఉగాది పండుగ సందర్భంగా వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వ్యాల్ల హరీష్ రెడ్డి తండ్రి వ్యాల్ల రామిరెడ్డి చేతుల మీదుగా బియ్యంతోపాటు నిత్యవసర వస్తువులను స్థానిక మార్కండేయ కాలనీలోని వీహెచ్‌ఆర్ ఆఫీస్‌లో అందించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు, ఆటో యూనియన్ కార్యవర్గ సభ్యులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కోసం స్పాట్ అడ్మిషన్లు

జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి నాగలైశ్వర్

నవతెలంగాణ-పెద్దపల్లి
ఏప్రిల్ 10 నుంచి 16 వరకు ఉద్యోగ నియామకాల కోసం రెసిడెన్షియల్ ఫౌండేషన్ కోర్సులో ఉచిత శిక్షణ కోసం స్పాట్ అడ్మిషన్లు తీసుకోవడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం.నాగలైశ్వర్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన వివిధ ఉద్యోగ నోటిఫికేషన్ లలో ఉచిత శిక్షణ 100 మంది షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగుల కోసం మూడు నెలల పాటు ప్రత్యేక ఉచిత ఫౌండేషన్ కోర్స్ ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించామని, ఇందులో భాగంగా ఏప్రిల్ 10 నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి, అర్హత గల ఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఏప్రిల్ 16 లోపు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులకు ప్రవేశం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు స్టడీ, కుల, ఆదాయ సర్టిఫికెట్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 9010136407, 9908261045 ఫోన్ నెంబర్ లను సంప్రదించాలని సూచించారు.

మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన

నవతెలంగాణ-రాయికల్ :
మండలంలోని సింగర్‌రావు పేట, అల్లీపూర్ మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర)లో 6వ తరగతి చదువుతున్న ఇద్దరు,7వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులను అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నడిసిప్లేన్ లీడర్లు తమ పిల్లలను చితకబాదారంటూ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాఠశాల ముందు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.పండుగ రోజు తమ పిల్లలను చూడడానికి వచ్చిన తల్లిదండ్రులు వారికి అయిన గాయాలను చూసి పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో చదువుతున్న సీనియర్ విద్యార్థులు బూతు మాటలు తిడుతూ,తమ పిల్లలకు తీసుకొచ్చిన తినుబండారాలను సైతం లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై అజయ్ పోలీసు సిబ్బంది సుమారు రెండు గంటలపాటు తల్లిదండ్రులకు సర్ది చెప్పారు. గాయాలపాలైన విద్యార్థులను విచారించి పాఠశాల సిబ్బందితో పాటు తాము కౌన్సిలింగ్ నిర్వహిస్తామని నచ్చజెప్పగా తమ పిల్లలను కొట్టిన విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకొని పాఠశాల నుండి పంపాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | ఏప్రిల్ 10, 2024 | www.navatelangana.com

తాటిగూడలో రాంజీ గోండ్ వర్ధంతి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తాటిగూడ గ్రామంలో మర్సుకోల రాంజీగోండ్ 167వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సేన అధ్యక్షుడు మడావి వెంకటేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం శంకర్, గ్రామ పటేల్ మడావి శేఖర్, అర్జు, రాజేశ్, ప్రమీళ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మందపల్లి-రేండ్లగూడ గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామంలోని చెడిపోయిన చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తున్నామని గ్రామ కార్యదర్శి లకావత్ శ్రీనివాస్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఆ గ్రామంలోని అన్ని వార్డులో ఉన్న బోర్లను పరిశీలించారు. అవసరమైన బోర్లకు మెకానిక్ సహాయంతో మరమత్తులు చేయించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నామని ఆయన వెల్లడించారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు. మంచినీటి బావులను పరిశీలించి, ఆ బావుల నుంచి నీటిని పైపుల ద్వారా సరఫరా చేస్తామన్నారు. గ్రామ ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

ప్రగతిని ప్రస్తావిస్తూ.. పురోగతి వివరిస్తూ..!

- ఉగాది సందర్భంగా సింగరేణి సీఎండీ లేఖ
- జైపూర్ ఎస్టీపీపీలో ఉగాది పచ్చడి పంపిణీ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణీ సంస్థ సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు సింగరేణీ సీఎండీ బలరామ్ ఉగాధి శుభాకాంక్షలు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్దేషిత వారిక్ష ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడాన్ని ప్రస్తావిస్తూ మంగళవారం ఆయన వ్యక్తిగత లేఖను విడుదల చేశారు. ఈ సంధర్భంగా జైపూర్ సింగరేణి ఎస్టీపీపీ పరిపాలన భవనంలో ప్లాంట్ ఈడీ బసివిరెడ్డి ఉద్యోగులకు ఉగాధి శుభాకాక్షంలు తెలుపుతూ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అదేవిధంగా సింగరేణి సంస్థ ప్రగతి, పురోగతిపై సీఎండీ ఇచ్చిన సందేశాన్ని చదివి విన్పించారు. సింగరేణి సీఎండీగా మూడు నెలల క్రితం పదవీ బాధ్యతలు చేపట్టి బలరామ్ ప్రస్తుత ప్రగతిని ప్రస్తావిస్తూ సింగరేణి పురోగతిపై లేఖ ద్వార వివరించారు. ప్రధానంగా సింగరేణి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల ఉత్పత్తిని అధిగిమించడంతో పాటు 698.6 లక్షల టన్నుల బొగ్గు రవాణ, 420.32 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించడాన్ని ప్రస్తావించారు. అదే విధంగా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ 2023-24 ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి సుమారుగా 8,308 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించి రాష్ట్ర ప్రజల అవసరాల కోసం సమకూర్చడం జరిగిందని పేర్కొన్నారు. అద్భుతమైన ఈ ప్రగతిలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి, వారి కుటుంబ సభ్యులను అభినందిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యతగా పరిగణించడం, కార్మికులకు కనీస అవసరాలు తీర్చడం, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత పాటిస్తూ దళారీలను కట్టడి చేయడం కోసం రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ, నేర దర్యాప్తు సంస్థల సహకారం తీసుకోవడాన్ని ప్రస్తావించారు.



ఎస్టీపీపీ పరిపాలన భవనంలో ఉద్యోగులకు పంపిణీ చేసే ఉగాది పచ్చడితో ప్లాంట్ ఈడీ బసివిరెడ్డి

అదేవిధంగా సింగరేణి భవిష్యత్తు దృష్టితో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించడం కోసం సంస్థ పరంగా తీసుకుంటున్న జాగ్రత్తలు లేఖ ద్వార వివరించారు. దీనికి తోడు రానున్న కాలంలో ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థలు ప్రయివేటు కంపెనీలతో తీవ్రమైన పోటీని ఎదుర్కోవల్సిన పరిస్థితులను గుర్తు చేశారు. ఇలాంటి వాటిని ఎదుర్కోవడం కోసం సింగరేణీయులు సన్నద్ధంగా ఉండాలని కోరారు. ఈ సంధర్భంగా 134 సంవత్సరాల సింగరేణి సుధీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి వ్యాపార విస్తరణ చర్యలకు రూపకల్పన చేస్తున్నామని ఈ క్రమంలో కొత్తగా గనుల ఏర్పాటు చర్యలను ప్రస్తావించారు. బొగ్గుతో పాటు థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోనూ సంస్థ సమర్థవంగా పని చేస్తే సింగరేణికి మరో 100 సంవత్సరాలకుపైగా ఎటువంటి ఇబ్బంది ఉండబోదని ధీమా వ్యక్తం చేశారు.

జన్నారం : తెలుగు తొలి సంవత్సరం ఉగాధి పండుగను, జన్నారం మండలంలో, మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో రైతులు తెల్లవారుజాముననే, లేచి పవిత్ర స్థానాలు ఆచరించి, తమ చేనులలో ప్రత్యేక పూజలు చేశారు. మంచి పంటలు పండాలని సమద్ధిగా వర్షాలు కురవాలని, అతివృష్టి అనావృష్టి రాకూడదని, వారి పంట చేలలో భూమాతకు ప్రత్యేక పూజలు చేశారు. సమీపాన ఉన్న ఆలయాలకు వెళ్లి దైవదర్శనాలు చేసుకున్నారు. ఇళ్లలో పిండివంటలు చేసుకున్నారు. మండలంలోని రాంపూర్ తిమ్మాపూర్, తపాలాపూర్, జన్నారం, పొన్కల్, రేండ్లగూడ గ్రామాల్లో ఉన్న శ్రీ వెంకటేశ్వర, శివాలయాలు, రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉగాధి పర్వదినం సందర్భంగా గ్రామ ఆలయాలు ఆధ్యాత్మిక శోభన సంతరించుకున్నాయి. రేండ్లగూడలోని శ్రీ రామాలయంలో, ఆంజనేయ స్వామి భక్తులు, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

కాసిపేట-2 గనిపై ఉగాది వేడుకలు

కాసిపేట : మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై మేనేజర్ గొడిశెల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉగాధి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా గనిలోని ఆలయాన్ని మామిడి తోరణలతో అలంకరించి అంగరంగ వైభవంగా పూజలు చేసి వేడుకలను చేపట్టారు. పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం పండితులు పంచాంగ శ్రవణం పటించారు. అధికారులు కార్మికులు శ్రద్ధగా విన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రూప్ ఏజెంట్ రాందాస్ హాజరయ్యారు. కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌రావు, ఇంజనీర్ రఘు, సర్వేయర్ ప్రకాష్‌రావు, అండర్ మేనేజర్లు కృష్ణ, ప్రసాద్, శ్యాంసుందర్, ఐఎన్టీయూసీ నాయకులు కారుకూరి రాంచందర్, ఏఐటీయూసీ సెక్రెటరీ గోళ్ల శ్రీనివాస్, నాయకులు ప్రదీప్, చింతం రవికిరణ్, ఓర్మెన్లు సెగ్గం శ్రీనివాస్, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

కాసిపేట-2 గనిలో పచ్చడి పంపిణీ చేస్తున్న అధికారి







జన్నారం ఆలయంలో హనుమాన్ భక్తుల భజన కార్యక్రమాలు

శంకర్‌లొద్దికి పోటెత్తిన సేవాలాల్ భక్తులు

- గుహ వద్ద ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని దట్టమైన అడవుల్లో వెలసిన శైవ క్షేత్రం శంకర్ లొద్దికి మంగళవారం సేవాలాల్ భక్తులు పోటెత్తారు. లాంబాడ(బంజారా) ప్రజల ఆధ్యాత్మిక గురువు తపస్వి శ్రీ ప్రేమ్‌సింగ్ మహరాజ్ తపస్సు చేసిన ప్రదేశం కావడంతో జిల్లాలోని సేవాలాల్ భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పుణ్యక్షేత్రంలోని గుహలో వెలసిన శివలింగాన్ని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కోరిన కోరికలు నెరవేర్చె భక్తుల కొంగు బంగారంగా వెలసిల్లుతున్న గుహలోని దేవతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా బంజారాలు గుహ, జెండాల వద్ద కుల పెద్దలతో కలిసి సాంప్రదాయ పూజలు చేశారు. హోమం ఏర్పాటు చేసి భోగ్ బండార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గత నెలలో స్వీకరించిన సేవాలాల్ దీక్ష విరమణకు మహారాష్ట్రలోని పొహారా దేవి వరకు పాదయాత్రగా శంకర్ లొద్ది నుండి ప్రారంభించడం విశేషం. అనేక మంది ఈ పుణ్యక్షేత్రం నుండి పాదయాత్రగా బయలు దేరి వెళ్లనున్నారు.

భక్తులకు, తాగు నీరు, అన్నదానం

వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చే సేవాలాల్ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. అనార్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సేవాలాల్ ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు రాథోడ్ శంకర్ నాయక్ అన్నదానం ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన బానోత్ వెంకటి నాయక్ ఆధ్వర్యంలో తాగు నీటి వసతి ఏర్పాటు చేశారు. వీరిద్దరూ గత కొన్ని ఏండ్లుగా భక్తులకు సదుపాయాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని సేవాలాల్ భక్తులు, లాంబాడ ప్రజలు అభినందిస్తున్నారు.

ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించుకోవాలి : ఆధ్యాత్మిక గురువు తపస్వి ప్రేమ్‌సింగ్ మహరాజ్

ఉగాది సందర్భంగా శంకర్‌లొద్ది పుణ్యక్షేత్రానికి తరలివచ్చిన భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక గురువు తపస్వి శ్రీ ప్రేమ్‌సింగ్ మహారాజ్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికత భావనతో ప్రజలు తమ జీవనాన్ని కొనసాగించినప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. సేవాలాల్ భక్తులు 41 రోజులపాటు మద్యానికి, మాంసానికి దూరంగా ఉంటూ సన్మార్గంలో నడవాలన్నారు. రానున్న రోజుల్లో భక్తి భావాన్ని కొనసాగించాలని తెలిపారు. అనంతరం ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ మాట్లాడుతూ శంకర్‌లొద్ధి పుణ్యక్షేత్రానికి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు.

పలువురిపై తేనె టీగల దాడి

గుహ వద్ద పూజలు చేయడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడం తో గుహ పై భాగంలోని చెట్లపై ఉన్న వానరాలు చెట్ల కొమ్మలపై గెంతులేస్తుండగా తేనె తుట్టె కదిలింది. దీంతో తేనె టీగలు లేచి పలువురిని కుట్టడంతో 20 నిమిషాల పాటు భక్తులు ఆందోళన చెందారు. కాసేపట్లోనే తేనె టీగల బెడద తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే సిద్ధంగా ఉన్న వైద్య సిబ్బంది శిబిరంలో తేనె టీగల బారిన పడిన వారికి వైద్య సేవలు అందించారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. పుణ్యక్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్సై బాల్‌సింగ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్, బంజారా యువజన రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ జాదవ్, అనార్‌పల్లి మాజీ సర్పంచ్ రాథోడ్ శేషారావు, రాథోడ్ రవి నాయక్, జాటోత్ రవి, సుభాష్ పాల్గొన్నారు.



దుర్గా మాతా మైసమ్మ వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే-6 గని మైసమ్మ ఆలయంలో మంగళవారం గని మేనేజర్ ఈ.తిరుపతి దంపతులు, యూనియన్ ప్రతినిధులు ఇతర అధికారులు పాల్గొని శ్రీ దుర్గా మాత మైసమ్మ వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ మాట్లాడుతూ ఈ ఆర్కే-6 గని అమ్మవారు ఎంతో మహిమ గల దేవతగా పేరు పొందినారని ఈ నవరాత్రి ఉత్సవాలలో ఉద్యోగులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమములో ఆర్కే-5,6 గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎఐటీయూసీ నాయకులు జనరల్ సెక్రెటరి వి.సీత రామయ్య, బ్రాంచి సెక్రెటర్ బాజీ సైదా, సేఫ్టి ఆపీసర్ కాదాసి శ్రీనివాస్, డిప్యూటి మేనేజర్ మర్రి కోమురయ్య, సంక్షేమాధికారి కె.సునీల్ కుమార్, ఫిట్ ఇంజనీర్ శ్యామ్, ఇంజనీర్ ఆర్.మహేష్, ఎఐటీయూసీ నాయకులు, డిప్యూటి ప్రధాన కార్యదర్శులు ముష్కె సమ్మయ్య, వీర భద్రయ్య, ఫిట్ సెక్రటరీ సంగం సదానందం పాల్గొన్నారు.

బాటసారుల కోసం వాటర్ కూలర్ ప్రారంభం

నవతెలంగాణ-మందమర్రి

పట్టణంలోని ఆంధ్ర బ్యాంక్ ఆవరణలో ఏర్పాటుచేసిన వాటర్ కూలర్‌ను మంగళవారం సీఐ శశిధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో ఎండ వేడిని తట్టుకునేందుకు బాటసారుల కోసం వాటర్ కూలర్ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఎండలకు ఈ చల్లనీ నీరు తాగడం వల్ల కొంత ఉపశమనం కలుగుతుందని తెలిపారు. మార్కెట్ ఏరియాలోని స్వర్గీయ కడలి రామయ్య, తమ్మిశెట్టి సుభాష్, మాదిరెడ్డి మాధవరావు, తాడి కొండ డేవిడ్ రాజ్ ల జ్ఞాపకార్థం చల్లని నీరు అందించేందుకు ఈ వాటర్ కూలర్ ఏర్పాటు చేశామని నిర్వాహకులు కడలి శ్రీనివాస్, తమ్మిశెట్టి విజయ్, తాడికొండ లూథర్, మాదిరెడ్డి సుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సొతుకు సుదర్శన్, మంద తిరుమలరెడ్డి, పోలు శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఫూలే సంస్కృతిని అందరూ ఆచరించాలి

నవతెలంగాణ-నస్పూర్

మహాత్మా జ్యోతిబాఫూలే అందించిన బహుజన సంస్కృతిని బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజన వర్గాల ప్రజలందరూ ఆచరించాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని బీసీ భవన్‌లో జరిగిన 'ఫూలే ఉగాది సంబరాలు'లో వివిధ సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ప్రకృతిలో జరిగే మార్పులకు సూచనగా ఉగాధి పండుగను స్వీకరించి బహుజన సంస్కృతిలో పండుగ జరుపుకోవాలని వారు కోరారు. బహుజన వర్గాల శ్రమతోనే ప్రపంచం నడుస్తుందని, మనువాదులు ప్రవచించే మంత్రాలు, పంచాంగాలతో కాదన్న సత్యాన్ని నేటి ప్రజలు గుర్తించాలని వారు పిలుపునిచ్చారు. ఆధిపత్య వర్గాల సంస్కృతిని కూలదోసి ఫూలే అంబేద్కర్లు చూపిన బాటలో శ్రామిక వర్గ సంస్కృతిని నిలబెట్టాలని వారు కోరారు. భవిష్యత్తులో జరగబోయేది ఎవరు చెప్పలేరని, పంచాంగం పేరుతో మూఢాచారాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. గ్రహాలు, నక్షత్ర ఫలాలు అనే తప్పుడు మాటలని నమ్మకుండా.. కష్టపడి పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్న సత్యాన్ని అందరూ గుర్తించాలని తెలిపారు.



పూలేకు నివాళులర్పిస్తున్న బహుజన నాయలకులు

బహుజన వర్గాలే సమస్త సంపద సృష్టికర్తలని, వారు ఆత్మాభిమానాన్ని సంతరించుకుని మనువాదుల ముందు మోకరిల్లడం మానుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కార్యదర్శి దూర్కె మోహన్, బీసీ ఐక్యవేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య, గాండ్ల తిలకేశ్వర సంఘం అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, బహుజన ఐక్యవేదిక నాయకులు పలిగిరి కనక రాజు, బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి కన్వీనర్ మోతె రామదాసు, సింగరేణి ఐక్యవేదిక నాయకులు పెద్దపల్లి కోటిలింగం, సామాజిక ఉద్యమకారులు కామిల్ల జయరావు, శ్రీరామోజు కొండయ్య, కైలాసం, జెట్టి చరణ్ దాస్ పాల్గొన్నారు.

పార్టీ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాలలో సీపీఐ(ఎం) పేరుతో అక్రమ వసూళ్లకు తెర లేపిన పలువురిపై పార్టీ నాయకులు మంగళవారం మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మాల గురిజాలకు చెందిన గుమసా బ్రహ్మానందం, మంచిర్యాలకు చెందిన గుమసా గోవర్ధన్‌లు ఒక ముఠాగా ఏర్పడి భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ మార్కిస్టు(సీపీఐ(ఎం)) రాష్ట్ర కమిటీ పేరుతో రసీదు బుక్స్ వేసుకొని, మంచిర్యాల జిల్లాలో పార్టీకున్న గుర్తింపును ఉపయోగించుకొని ప్రజల వద్ద, ప్రముఖుల వద్ద పార్టీ పేరు చెప్పుకొని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు, జిల్లా కమిటి దృష్టికి వచ్చిందన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ముఠాకు, పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ విధంగా ఎవరైనా పార్టీ పేరు చెప్పుకొని వసూళ్ళకు పాల్పడితే సంబంధిత పోలీస్ అధికారులకు పిర్యాదు చెయ్యాలని, పార్టీ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు, ప్రముఖులకు కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి సంకె రవి, జి.ప్రకాష్, దాసరి రాజేశ్వరి, అశోక్, దుంపల రంజిత్ కుమార్‌లు పాల్గొన్నారు.

అనాథ పిల్లలతో ఉగాది

ఉట్నూర్ : ఉగాధి పర్వదినం సందర్భంగా మంగళవారం పట్టణంలోని అనాథ పిల్లలకు ఉగాధి పచ్చడిని సామాజిక కార్యకర్త యువ నాయకుడు మెస్రం కేశవ్‌రావ్ అందజేశారు. పండుగ రోజు అనాథ పిల్లలతో పండుగను జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఎప్పుడు కుటుంబ సభ్యులతో పండుగలను జరుపుకుంటామని అనాథ పిల్లలతో జరుపుకోవడం చాలా ఆనందాన్ని కల్గించిదని తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

- జడ్పీ సీఈఓ అనిల్
- జోడేఘాట్‌లో భీంకు నివాళి



నవతెలంగాణ-కెరమెరి

మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జడ్పీ సీఈఓ అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం ఆదివాసుల ఆరాధ్యదైవం కుమురం భీం పురిటి గడ్డ జోడేఘాట్‌ను సందర్శించారు. భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీం సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించి, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం తాగు నీటి సరఫరా, ఉపాధి హామీ పనుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో తాగు నీటి సమస్య రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీలో రోజు వారి లేబర్ సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో రోజు 200పైగా కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు. మ్యూజియంలో కలియ తిరిగి గిరిజన సంప్రదాయ ఆచార వ్యవహారాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ సుధాకర్, గ్రామ పటేల్ పెందూర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

బిజినెస్

విదేశాల్లో వ్యాపారాలకు ఓలా గుడ్‌బై..



బెంగళూరు : ప్రముఖ క్యాబ్ సేవల సంస్థ ఓలా క్యాబ్స్ ఇతర దేశాల్లోని తన కార్యకలాపాల నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత ఏప్రిల్ ముగింపునకల్లా బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లోని తన వ్యాపారాన్ని మూసివేయనుంది. దీనిపై అక్కడి వినియోగదారులకు సమాచారం అందిస్తోంది. పూర్తిగా భారత్ మార్కెట్‌పై దృష్టి సారించనున్నట్లు సమాచారం. ఆయా దేశాల్లో ఎదురవుతున్న పోటీ నేపథ్యంలో వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

పెంపుడు జంతువులకు వైద్య బీమా

హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో వెల్లడి

ముంబయి : పెంపుడు జంతువులకు వైద్య బీమాను అందిస్తున్నట్లు హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో తెలిపింది. వాటి సంరక్షణకు వైద్య పరీక్షల నుంచి శస్త్రచికిత్సలు, ఔషధాలను అందించే సమగ్ర బీమా పథకం 'పాస్ ఎన్ క్లాస్'ను ప్రారంభించినట్లు పేర్కొంది. ఏప్రిల్ 11న జాతీయ పెంపుడు జంతువుల దినోత్సవానికి ముందస్తుగానే ఈ పత్యేకమైన ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొంది. దేశంలో పెంపుడు జంతువుల సంరక్షణ మార్కెట్ ఏటా 13 శాతం పైగా పెరుగుతోందని అంచనా వేసింది.

మార్కెట్లోకి బజాజ్ ఆటో ఇవి ఆటోలు



హైదరాబాద్ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ ఆటో లిమిటెడ్ తమ నూతన కార్గో, ప్యాసింజర్ విద్యుత్ ఆటో శ్రేణిని తెలంగాణ మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రయాణీకుల ఇవి త్రీవీలర్ బజాజ్ ఆర్ఇ-టెక్ 9.0ను అందుబాటులోకి తెచ్చింది. ఈ కొత్త వాహనాలు విస్తృత పరిధి, అత్యధిక లోడ్ మోసే సామర్థ్యం, దీర్ఘకాలిక మన్నిక దృష్టితో రూపొందించినట్లు ఆ కంపెనీ ప్రతినిధులు బాబ్జీ నెల్లి, కుబేర్ కెవి తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా తమ డిస్ట్రిబ్యూషన్ సేవలను విస్తరించనున్నామన్నారు.

నిధుల సమీకరణకు ఎన్‌ఇసిసి బోర్డు ఆమోదం

న్యూఢిల్లీ : దేశీయ, అంతర్జాతీయ, వాణిజ్య, పారిశ్రామిక వస్తువుల రవాణా సంస్థ నార్త్ ఈస్టర్న్ కారియింగ్ కార్పొరేషన్ (ఎన్ఇసిసి) నిధుల సమీకరణకు ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని పేర్కొంది. ఇందుకోసం వారెంట్ల కేటాయింపును ప్రిఫరెన్షియల్ ప్రాతిపదికన ఆమోదించినట్లు తెలిపింది. ఇందుకోసం 6,70,000 ఈక్విటీ షేర్లు, 39,55,062 షేర్ వారెంట్లను మార్చుకునేందుకు వీలుగా డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

పారామౌంట్ కమ్యూనికేషన్స్‌కు ఇక్రా రేటింగ్

హైదరాబాద్ : కేబుల్ పరిశ్రమలోని పారామౌంట్ కమ్యూనికేషన్స్‌కు ఇక్రా సంస్థ బిబిబి- (స్థిరమైన) క్రెడిట్ రేటింగ్‌ను కేటాయించింది. 1955 సంవత్సరంలో స్థాపించిన పారామౌంట్ కమ్యూనికేషన్స్ భారతదేశపు వైర్, కేబుల్ పరిశ్రమలో కీలక సంస్థగా ఉంది. మౌలిక సదుపాయాల విభాగాలను అందించే అధిక నాణ్యత ఉత్పత్తులను తయారు చేయడంలో ప్రసిద్ధి చెందింది. తమ సంస్థకు రాజస్థాన్, హర్యానాల్లో రెండు అత్యాధునిక తయారీ కేంద్రాలున్నాయని తెలిపింది.

జెన్‌సోల్ ఇంజనీరింగ్ రెవెన్యూ 141% వృద్ధి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో 141 శాతం వృద్ధితో రూ.960 కోట్ల రెవెన్యూ సాధించినట్లు జెన్‌సోల్ ఇంజనీరింగ్ తెలిపింది. ఇంధనం, సోలార్ పవర్ ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ కార్యకలాపాలు నిర్వహించే ఈ సంస్థ ఇంతక్రితం ఏడాది రూ.398 కోట్ల ఆదాయం ఆర్జించింది. పరిశ్రమలోనే జెన్సోల్ అసాధారణమైన పనితీరును కనబర్చిందని ఆ కంపెనీ సిఎండి అన్మోల్ సింగ్ జగ్గి పేర్కొన్నారు. ఈ విజయం పునరుత్పాదక ఇంధన పరిశ్రమలో తమను అగ్రగామిగా నిలుపనుందన్నారు.

వాట్సాప్‌లో టాటా ఎఐఎ చెల్లింపు పరిష్కారాలు

ముంబయి : జీవిత బీమా రంగంలో తొలి సారి తాము వాట్సాప్ ప్లాట్‌ఫారమ్‌లో ప్రీమియం చెల్లింపు సేవలను అందుబాటులోకి తెచ్చామని టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఎఐఎ) తెలిపింది. గతంలో యుపిఐ ఆధారిత లావాదేవీలకు మాత్రమే పరిమితం చేయబడిన టాటా ఎఐఎ వినియోగదారులు ఇప్పుడు వాట్సాప్‌లో అనేక రకాల చెల్లింపు పద్ధతులను ఉపయోగించవచ్చని పేర్కొంది. వాట్సాప్ ఉపయోగించి పాలసీదారులు ఇప్పుడు క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్, నెట్ బ్యాంకింగ్ ద్వారా సులభంగా పునరుద్ధరణ చెల్లింపులను చేయవచ్చని వెల్లడించింది. వాట్సాప్‌లో 27 సేవలను అందిస్తోన్నట్లు పేర్కొంది.

సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఎం55 5జి

న్యూఢిల్లీ : సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ 55, గెలాక్సీ ఎం 15 స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. ఈ 5జి ఫోన్లకు నాలుగు సార్లు ఒఎస్ అప్‌గ్రేడ్‌తో సహా ఐదేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్‌తో అందిస్తున్నట్లు పేర్కొంది. ఎం55 5జిని 6.7 అంగుళాల హెచ్‌ఎఫ్‌డి సహా సూపర్ అమోలెడ్ ఫ్లస్ డిస్‌ప్లేతో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. 50ఎంపి మెయిన్ కెమెరాతో పాటు సెల్ఫీ కోసం కూడా 50 ఎంపి కెమెరాను కలిగి ఉంది. దీని ప్రారంభ ధరను రూ.26,999గా ప్రకటించింది. గెలాక్సీ ఎం15 5జి ప్రారంభ ధరను రూ.14,499గా పేర్కొంది.

వస్త్ర పరిశ్రమకు ఉపశమనం

- ఎన్నికలతో ప్రచార సామాగ్రి తయారీలో బిజీబిజీ
- వేలాది మందికి లభిస్తున్న ఉపాధి

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల తొలి దశ పోలింగుకు సమయం సమీపిస్తోంది. రాజకీయ పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఎన్నికల సీజన్‌లో నాలుగు డబ్బులు వెనకేసుకోవాలని భావిస్తున్న వస్త్ర పరిశ్రమ పెద్దలు తమ రోజువారీ కార్యకలాపాలను తాత్కాలికంగా పక్కన పెట్టి బ్యాడ్జీలు, జెండాలు, బ్యానర్ల తయారీలో నిమగ్నమైపోయారు.

దేశంలో ఆరు వారాల పాటు సాగే సార్వత్రిక ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది.



రాజకీయ పార్టీలన్నీ పెద్ద ఎత్తున జెండాలు, బ్యానర్ల తయారీకి ఆర్డర్ ఇస్తున్నాయి. డిమాండును తట్టుకోవడానికి వస్త్రాల తయారీదారులు తమ సిబ్బందితో ఎక్కువ గంటలు పనిచేయిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మథుర పట్టణంలో వస్త్రాలు తయారు చేసే 40 ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటిలో ఒక ఫ్యాక్టరీ యజమాని ముకేశ్ అగర్వాల్ మాట్లాడుతూ రాజకీయ ప్రచారంలో ఉపయోగించే చౌకైన, ఉత్తమమైన సామగ్రి జెండాలు, బ్యానర్లేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార సామగ్రి తయారీలో పెద్దగా లాభాలు ఉండవు. కానీ పెద్ద ఎత్తున వ్యాపారం జరుగుతుంది. పార్టీ బ్యాడ్జీ రూపాయి ధర నుండి లభిస్తుంది.

డిమాండ్ పెరుగుతుంటే కొన్ని ఫ్యాక్టరీలు రోజుకు పది లక్షల బ్యాడ్జీలు ఉత్పత్తి చేయగలవని అగర్వాల్ తెలిపారు. ఎన్నికల సమయంలో దేశంలో ఎక్కడ చూసినా వివిధ



రాజకీయ పార్టీలు, వేలాది మంది అభ్యర్థులకు చెందిన పోస్టర్లు, బ్యానర్లు దర్శనమిస్తుంటాయి. 'మన దేశంలో చాలా మంది ప్రజలు పెద్దగా చదువుకోలేదు. అలాంటి పరిస్థితుల్లో వివిధ పార్టీల కార్యకర్తలు ఓటర్లలో తమ గుర్తులకు ప్రాచుర్యం కల్పించేందుకు జెండాలు ఉపయోగిస్తారు. ఇళ్ల బయట వాటిని కడుతుంటారు. తమ ప్రచారంలో వాటిని మాధ్యమంగా వాడుకుంటారు' అని అగర్వాల్ వివరించారు.

ప్రధాని నరేంద్ర మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లోని సూరత్ వస్త్ర పరిశ్రమకు కేంద్రంగా విలసిల్లుతోంది. ఇక్కడ ఎన్నికల సామగ్రి పెద్ద ఎత్తున తయారవుతుంది. ఉత్తరాన మథుర, దక్షిణాన హైదరాబాదులో కూడా ఎన్నికల ప్రచార సామగ్రిని తయారు చేస్తున్నారు. ఎన్నికలు ఎక్కడ, ఎప్పుడు జరిగినా ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. రాజకీయ పార్టీలు వస్తువులు, సేవలపై డబ్బు ఖర్చు చేస్తుంటాయి. హెలికాప్టర్లను అద్దెకు తీసుకుంటాయి. ఎన్నికల సామగ్రిపై రాజకీయ పార్టీలు రూ. మూడువేల కోట్ల నుంచి ఐదువేల కోట్ల వరకూ ఖర్చు చేస్తాయని, ఆ సమయంలో కోటి మందికి ఉపాధి లభిస్తుందని పాత ఢిల్లీలోని సదర్ బజార్ మార్కెట్‌కు చెందిన వ్యాపారుల సంఘం ప్రధాన కార్యదర్శి గుల్షన్ ఖురానా చెప్పారు.



ఆయన యాభై సంవత్సరాలుగా వ్యాపారం చేస్తున్నారు. 2019 ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు వ్యాపారం 30 శాతం పెరగవచ్చునని ఆయన అంచనా వేశారు.

మూడోసారి అధికారంలోకి రావడానికి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేస్తోంది. భారీ స్థాయిలో ప్రచార సామగ్రిని సిద్ధం చేస్తోంది. ఆ స్థాయిలో కాకపోయినా ప్రతిపక్షాలు కూడా ప్రచార సామగ్రికి ఆర్డర్ ఇస్తున్నాయి. ఈ పరిణామాలు వస్త్ర పరిశ్రమకు కలిసొస్తున్నాయి.

కవితకు కస్టడీ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

లేవన్నారు. 2022 నుంచి కేసు దర్యాప్తు సాగుతుందని, అప్పటి నుంచి కవిత దర్యాప్తును ప్రభావితం చేసే వ్యక్తి అని ఈడీ ఆరోపిస్తోందన్నారు. కానీ అలాంటిదేమీ కవిత చేయలేదన్నారు. ఇరు వైపుల వాదనలు ముగించిన స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా... తీర్పును కాసేపు రిజర్వ్ చేశాక.. కవితకు 14 రోజుల కస్టడీ పొడిగిస్తున్నట్టు తీర్పు వెల్లడించారు.

అంతకు ముందు కోర్టు హాల్ లోనే కవితతో మాట్లేడేందుకు కుటుంబ సభ్యులకు అనుమతివ్వాలని ఆమె తరపు న్యాయవాది రాణా కోర్టును కోరగా, స్పెషల్ జడ్జ్ కావేరి బవేజా నిరాకరించారు. అయితే అందుకోసం అప్లికేషన్ వేసుకోవాలని సూచించారు. న్యాయమూర్తి సూచనలతో కవిత భర్త అనిల్, మామ రామ కిషన్‌రావు, మరిది కలిసేందుకు అనుమతివ్వాలని అప్లికేషన్ దాఖలు చేయడంతో, అందుకు కోర్టు అనుమతించింది. తరువాత కోర్టు హాల్‌లోనే కవితతో భర్త, మామ, మరిది కలిసి కాసేపు మాట్లాడారు.

బీజేపీకి ఓటేయొద్దు : కవిత

తన కోసం కోర్టుకు వచ్చిన కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలను, ప్రతి అభిమానిని, పలకరిస్తూ కవిత ధైర్యంగా కన్పించారు. కోర్టు హాల్ నుంచి బయటకు వచ్చే సమయంలో ఆమె మీడియా ప్రశ్నలకు స్పందించలేదు. ఇది పూర్తిగా రాజకీయ పరమైన కేసని ఆరోపించారు. తాను పూర్తిగా విచారణకు సహకరిస్తున్నా, అన్యాయంగా అరెస్ట్ చేశారని చెప్పారు. ప్రతిపక్ష నేతలపై అధికార పార్టీ ఈడీ, సీబీఐని ఊసిగొల్పుతోందన్నారు. ఇప్పటికే జైల్లో సీబీఐ తన స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిందన్నారు. అయితే.. తెలంగాణ ప్రజలకు మీరిచ్చే సందేశం ఏంటని మీడియా మిత్రులు అడుగగా... బీజేపీకి ఓటు వేయొద్దని పిలుపునిచ్చారు.

ఆమె మరింత బలంగా బయటకు వస్తారు : భర్త అనిల్

తీహార్ జైలు నుంచి కవిత మరింత బలంగా బయటకు వస్తారని ఆమె భర్త అనిల్ అన్నారు. అక్రమంగా కేసులో ఆమెను అరెస్ట్ చేశారని, జైల్లో పెట్టినప్పటికీ ఆమె ధైర్యంగా ఉన్నారని తెలిపారు. మానసికంగా, దృఢ నిశ్చయంతో కవిత న్యాయపోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. కవిత పూర్తి స్థాయిలో బలంగా ఉందన్నారు. ఎలాంటి అధైర్యం అవసరం లేదని, ఆమె మరింత బలంగా బయటకు వస్తారని దీమా వ్యక్తం చేశారు. అలాగే



సోమవారం తీహార్ జైల్లో కవితతో ములాఖత్ అయినట్టు వెల్లడించారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ ములాఖత్‌లో కవిత ఏమాత్రం ఆందోళన లేకుండా కనిపించారన్నారు. జైల్లో ఉన్నప్పటికీ కవిత ఏ పరిస్థితుల్లోనూ మనోధైర్యాన్ని కోల్పోవడం లేదన్నారు. పార్టీ శ్రేణులు, ఆమె అభిమానులు ధైర్యంగా ఉండాలన్నారు.

అప్పుడెందుకు అరెస్ట్ చేయలే

కేసులో నేను బాధితురాలినే

తన వ్యక్తిగత ప్రైవసీని మీడియా దెబ్బతీస్తోంది

నాలుగు పేజీల లేఖను రిలీజ్ చేసిన కవిత

సాక్షులను బెదిరిస్తున్నట్టు తనపై ఆరోపణలు చేస్తోన్న ఈడీ, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తనను ఎందుకు అరెస్టు చేయలేదని కవిత ప్రశ్నించారు. ఇప్పుడు అధికారంలో లేనప్పుడు ఎలాంటి శక్తిని అదుపు చేయలేమన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా తనను ఇప్పుడు అరెస్టు చేశారని విమర్శించారు. రెండున్నరేండ్ల విఫల దర్యాప్తు అనంతరం ఈడీ తనను అదుపులోకి తీసుకుందని ఆరోపించారు. మంగళవారం కోర్టులో హాజరైన సందర్భంలో స్పెషల్ జడ్జ్ ముందు తన ఆవేదనను వెలిబుచ్చుకునేందుకు కవిత నాలుగు పేజీల్లో పలు అంశాలను రాసుకొచ్చారు. అయితే, కోర్టు అందుకు అనుమతించకపోవడంతో మీడియాకు ఆ పేపర్లను విడుదల చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తాను బాధితురాలినని, ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధంలేదని కవిత తెలిపారు. దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్నట్లు ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపకల్పనతో తనకు ఆర్థికంగా ఎలాంటి లబ్ది చేకూరలేదన్నారు. 'నా మొబైల్ నెంబర్‌ను టీవీ ఛానల్‌లలో ప్రసారం చేసి నా ప్రైవసీని దెబ్బతీశారు. సీబీఐ, ఈడీ దర్యాప్తుల కంటే ఎక్కువగా మీడియా విచారణ రెండున్నరేండ్లుగా జరిగింది. రాజకీయంగా, వ్యక్తిగతంగా నా ప్రతిష్టను దెబ్బతీసేలా మీడియా వ్యవహరిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే విచారణలో భాగంగా దర్యాప్తు సంస్థల ముందు నాలుగు సార్లు విచారణకు హాజరయినట్టు తెలిపారు. విచారణకు అన్ని విధాలా సహకరిస్తున్నట్లు వెల్లడించారు. దర్యాప్తు సంస్థలు అడిగిన బ్యాంకు వివరాలతో పాటు, తన దగ్గర ఉన్న సమాచారాన్ని అందజేసినట్లు స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థకు తన మొబైల్ ఫోన్‌లు అన్నీ అందజేశానని, కానీ వాటిని ధ్వంసం చేసినట్టు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాంగ్మూలాలను తరచూ మార్చుతూ వస్తోన్న సహ నిందితుల స్టేట్‌మెంట్స్‌తో కేసును నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ ఖన్నా విచారణ సందర్భంగా ప్రస్తావించారని చెప్పారు. గత రెండున్నరేండ్లుగా కేసులో భాగంగా అనేక సోదాలు జరిపారన్నారు. భౌతికంగా, మానసికంగా వేధింపులకు గురిచేశారని, చాలామందిని అరెస్ట్ చేశారని తెలిపారు.

బీజేపీలోకి చేరితే కేసులకు బ్రేక్

సుప్రీంకోర్టులో కఠిన చర్యలు తీసుకోబోము అని చెప్పి, కీలకమైన లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈడీ తనను అరెస్ట్ చేసిందని ఆరోపించారు. 95 శాతం కేసులు అన్నీ ప్రతిపక్ష పార్టీల నేతలకు సంబంధించినవేనని, బీజేపీలోకి చేరిన వెంటనే ఆ కేసుల విచారణ ఆగిపోతుందన్నారు. పార్లమెంటు సాక్షిగా బీజేపీ నేతలు ప్రతిపక్ష నేతలను ఉద్దేశించి "నోరు మూసుకోండి లేదా ఈడీను పంపుతాం" అన్నారని లేఖలో ప్రస్తావించారు. ఇలాంటి దారుణ పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ న్యాయవ్యవస్థ వైపు చూస్తున్నాయని అన్నారు.

న్యాయ వ్యవస్థ ఉపశమనం కల్పిస్తుందని ఆశతో ఉన్నట్లు నాలుగు పేజీల సందేశంలో రాసుకొచ్చారు. 'కేసు దర్యాప్తునకు సహకరించేందుకు నేను పూర్తి సిద్ధంగా ఉన్నా. ఈ పరిస్థితుల్లో నాకు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్నాను. 'నా చిన్న కుమారుడు పరీక్షలకు సిద్ధపడుతున్న సమయంలో తల్లిగా నేను తనతో ఉండాలి. నా పాత్రను ఎవరు భర్తీ చేయలేరు. నేను లేకపోవడంతో నా కుమారుడిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నాను' అని ఆమె విజ్ఞప్తి చేశారు.

తన బెయిల్ అభ్యర్థనను పరిశీలించాల్సిందిగా కోర్టును కోరుతున్నట్లు ఆమె తెలిపారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్ రతన్ హఠాన్మరణం

- నేడు అంత్యక్రియలు
- సీఎం, డీజీపీల సంతాపం


(ఫైల్)

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ మంగళవారం ఉదయం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన అకాల మృతి పట్ల ఇటు రాజకీయ పక్షాలు, అటు ఐపీఎస్, ఐఏఎస్ వర్గాలు విస్మయం చెందాయి. 1991వ బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన రాజీవ్‌రతన్.. ప్రస్తుతం డీజీపీ హోదాలో విజిలెన్స్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ఇంకా ఏడాదిన్నర పాటు సర్వీసు ఉన్నది. పంజాబ్‌కు చెందిన రాజీవ్‌రతన్.. నిజాయితీ, చిత్తశుద్ధి గల ఐపీఎస్ అధికారిగా పేరు పొందారు.

కరీంనగర్ ఎస్పీగా ప్రారంభమైన ప్రస్థానం

ఆయన ఐపీఎస్‌గా రాష్ట్ర పోలీసు శాఖలో చేరాక కరీంనగర్ ఎస్పీగా సర్వీసును ప్రారంభించారు. అనంతరం ఆయన హైదరాబాద్ నగర తూర్పు మండలం డీసీపీగా, సీఐడీ ఎస్పీగా, డీఐజీగా రాష్ట్ర ఫైర్ సర్వీస్ విభాగం అదనపు డీజీగా వివిధ హోదాల్లో పని చేసిన రాజీవ్ రతన్.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డీజీపీగా పదోన్నతి పొంది కీలకమైన రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చీఫ్‌గా బాధ్యతలను చేపట్టారు. కాగా, మేడిగడ్డలో పిల్లర్లు కుంగిపోయిన ఘటనపై ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణను చేపట్టిన రాజీవ్ రతన్.. దానికి గల కారణాలపై ప్రభుత్వానికి నివేదికను ఇటీవలే అందజేశారు. ఆయన పోలీస్ శాఖకు చేసిన సేవలకు గానూ కేంద్రం ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం), భారత రాష్ట్రపతి పోలీసు పతకం (పీపీఎం)లను కూడా ఆయన అందుకున్నారు.

మరణవార్త తెలిసి ఏఐజీకి సీఎం

ఉదయం తుక్కుగూడలోని తన నివాసంలో ఆయన ఉదయం లేచి, టీ తాగాక హఠాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే భార్య, ఇతర కుటుంబసభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించారు. ఆయనకు ఏడాదిన్నర క్రితమే గుండెపోటు రావటంతో స్టంటు కూడా వేశారు. ఆయన మరణవార్త తెలియగానే ఏఐజీకి వెళ్లిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారీ, రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జితేందర్, రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ వి.సి సజ్జనార్‌లు రాజీవ్‌రతన్ భౌతిక కాయంపై పుష్పగుచ్చాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్ అధికారులు కూడా ఆయన పార్థివదేహం వద్ద పుష్పగుచ్చాలుంచి నివాళులర్పించారు. రాజీవ్‌రతన్ అంత్యక్రియలను బుధవారం మాదాపూర్‌లోని మహాప్రస్థానంలో నిర్వహిస్తున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. తమ కుటుంబసభ్యులు పంజాబ్ నుంచి రావాల్సి ఉన్నదనీ, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వారు చెప్పారు.

ముఖ్యమంత్రి సంతాపం

రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్‌రతన్ హఠాన్మరణం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. నిజాయితీ, చిత్తశుద్ధి గల ఐపీఎస్ అధికారి అయిన రాజీవ్‌రతన్‌ను కోల్పోవటం అత్యంత విచారకరమని ఆయన అన్నారు. రాజీవ్‌రతన్ సేవలను ప్రభుత్వం ఎన్నటికీ మరవదని ఆయన నివాళులర్పించారు. ఆయన రాజీవ్‌రతన్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ప్రపంచ గమనం

జెలెన్‌స్కీ శాంతి ప్రణాళిక

'వాస్తవాలకు అనుగుణంగా లేదు' - లావ్రోవ్

ఉక్రెయిన్ - రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు ఉక్రేనియన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవటం లేదని, అది భవిష్యత్తులో ఎలాంటి చర్చలకు ఆధారం కాజాలదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ అన్నాడు. ఏదైనా చర్చలు రష్యా భద్రతా సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని బీజింగ్, మాస్కో అంగీకరించాయని మంగళవారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి, లావ్‌రోవ్ లు ప్రకటించారు. 2022 శరదృతువులో జెలెన్‌స్కీ ప్రతిపాదించిన పది-పాయింట్ల శాంతి ప్రతిపాదన 1991లో అస్తిత్వంలో ఉన్న ఉక్రెయిన్ సరిహద్దులలోని అన్ని భూభాగాల నుంచి రష్యన్ దళాలను పూర్తిగా, బేషరతుగా ఉపసంహరించుకోవాలని పిలుపునిచ్చింది. అలాగే రష్యా మిలిటరీ కమాండర్లను, రాజకీయ నాయకత్వాన్ని విచారించడం కోసం ఒక అంతర్జాతీయ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని, ఉక్రెయిన్‌కు నష్టపరిహారం కూడా చెల్లించాలని ఈ ప్రణాళికలో ఉంది.

ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు రష్యా సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చింది. అయితే ఉక్రెయిన్, దాని పాశ్చాత్య



మద్దతుదారులు "క్షేత్ర స్థాయిలో వాస్తవికతను" అంగీకరించినప్పుడు మాత్రమే శాంతి చర్చలు జరుగుతాయని రష్యా ప్రకటించింది. "భద్రతా రంగంలో అన్నింటి కంటే ఎక్కువగా పాల్గొన్న అన్ని పార్టీల చట్టబద్ధమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం" గురించి చైనా, రష్యా ఒకే అభిప్రాయంతో ఉన్నాయని మంగళవారంనాడు బీజింగ్‌లో వాంగ్‌తో జరిపిన చర్చల అనంతరం లావ్‌రోవ్ వెల్లడించారు.

జెలెన్‌స్కీ శాంతి ప్రతిపాదనను "వాస్తవికత నుంచి వేరుపడినది", "ఏమాత్రం పసలేనిది" అని లావ్రోవ్ అభివర్ణించాడు.

చైనా తీసుకున్న సమతుల్య వైఖరికి, ఉక్రెయిన్ వివాదాన్ని ముగించడంలో నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నందుకు లావ్‌రోవ్ ధన్యవాదాలు తెలిపారు. ఫిబ్రవరి 2023లో చైనా ప్రతిపాదించిన 12-పాయింట్ల శాంతి చొరవను స్పష్టమైనదిగాను, ఇప్పటివరకు అత్యంత ఆచరణీయమైనదిగాను ఉందని గత వారం లావ్రోవ్ ప్రశంసించాడు. అది "ప్రస్తుత సంఘటనలకుగల మూల కారణాల విశ్లేషణ ఆధారంగా చేసిన ప్రతిపాదన." ఉక్రెయిన్‌లో తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, శాంతి చర్చలను పునఃప్రారంభించాలని, "ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వాన్ని" విడిచిపెట్టాలని, అన్ని దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని చైనా ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక పిలుపునిచ్చింది.

"ఉక్రెయిన్‌లో రష్యా ప్రత్యేక సైనిక ఆపరేషన్ ప్రారంభించిన తరువాత భౌగోళిక, రాజకీయ వాస్తవికత నాటకీయంగా మారిపోయిందని, ఉక్రెయిన్, రష్యన్ ఫెడరేషన్‌ల మధ్య సరిహద్దులు మారాయని, 2022 చివరలో డోనెట్స్క్, లుగాన్స్క్, ఖెర్సన్, జాపోరోజియే ప్రాంతాలలో మాస్కో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలలో స్థానిక నివాసితులలో అత్యధికులు రష్యాలో చేరడానికి అనుకూలంగా ఓటు వేశారన్న వాస్తవాన్ని ఉక్రెయిన్ అంగీకరించాలి" అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ మార్చిలో ఆర్ఐఏ నోవోస్టి వార్తాసంస్థతో మాట్లడుతూ తెలిపారు.

కొత్త ఇంధన ప్రాజెక్టులను అభివృద్ధి చేయకుండా

రష్యాను అడ్డుకుంటాం - అమెరికా

ఆర్కిటిక్‌లో రష్యా నిర్మించనున్న అతిపెద్ద ఎల్ఎన్‌జి ప్రాజెక్ట్‌తో సహా రష్యా ఇంధన రంగం అభివృద్ధిని ఆటంకపరచాలని అమెరికా లక్ష్యంగా పెట్టుకుందని స్టేట్ డిపార్ట్‌మెంట్ సీనియర్ అధికారి జియోఫ్రీ ప్యాట్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఇంధన దిగ్గజం నోవాటెక్ అభివృద్ధి చేస్తున్న రష్యా ఉత్తర యమల్ ప్రాంతంలో ఆర్కిటిక్ ఎల్ఎన్‌జి 2 ప్రాజెక్ట్‌ను అమెరికా ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుంటోందని సోమవారంనాడు ఫైనాన్షియల్ టైమ్స్ సదస్సులో మాట్లాడుతూ ప్యాట్ వెల్లడించారు. "ఆర్కిటిక్ ఎల్ఎన్‌జి 2 నీటిలో మునిగి చనిపోయిందని నిర్ధారించడం మా లక్ష్యం" అని ఇంధన వనరుల సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న ప్యాట్ బ్రిటీష్ వార్తాపత్రిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో చెప్పారు. "రష్యా ఇంతకుముందు యూరప్‌కి సరఫరా చేసిన గ్యాస్‌ను పునరుద్ధరించడానికి కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయలేకపోవచ్చని నిర్ధారించుకోవడంపై మేము చాలా దృష్టి పెడుతున్నాము."

ఆర్కిటిక్ ఎల్ఎన్‌జి 2పై అమెరికా అనేక రౌండ్ల ఆర్థిక ఆంక్షలను విధించింది. వీటిలో తాజాగా నవంబర్ 2023లో ప్రకటించటం జరిగింది. 2022లో ఉక్రెయిన్‌లో మాస్కో తన సైనిక చర్యను ప్రారంభించినప్పటి నుంచి చౌకైన రష్యన్ పైప్‌లైన్ గ్యాస్‌ను యూరప్‌కు అందకుండా చేయటం పాశ్చాత్య ప్రతీకార చర్యలో కీలకమైన అంశం. రాయిటర్స్ అంచనా



ప్రకారం, పైప్‌లైన్ ద్వారా గ్యాస్ లభించక పోవటం వల్ల జరిగిన నష్టాన్ని భర్తీ చేయడానికి యూరోపియన్ యూనియన్ 2023లో రష్యన్ ఎల్ఎన్‌జి కొనుగోళ్లను పెంచింది. 2022కి ముందు దాదాపు 8శాతంగా వున్న ఎల్ఎన్‌జి గ్యాస్ వినియోగం ప్రస్తుతం మార్కెట్‌లో 15శాతానికి పెరిగింది. గతంలో యూరోపియన్ యూనియన్ గ్యాస్ వినియోగంలో 37శాతం రష్యన్ పైప్‌లైన్ ద్వారా వచ్చేది.

రష్యా- ఉక్రెయిన్ సంఘర్షణను రష్యాకు వ్యతిరేకంగా అమెరికా వెన్నుదన్నుతో నడుస్తున్న యుద్ధంగా రష్యా పరిగణిస్తోంది. ఆర్థిక పోటీని అరికట్టడం దీని లక్ష్యాలలో ఒకటి. ఈ ప్రక్రియలో యూరోపియన్ల శ్రేయస్సును అమెరికా విస్మరించిదనే విషయం జగద్విదితమే.

ఇలా ఐరోపా మార్కెట్‌ను కోల్పోయిన రష్యా తన ప్రధాన గ్యాస్ క్షేత్రాలను ఆసియాలోని వినియోగదారులతో, ప్రధానంగా చైనాతో అనుసంధానించే పైప్‌లైన్‌ల నిర్మాణంపై దృష్టి పెట్టడానికి దారితీసింది.



తండ్రి కండ్లల్లో ఆనందానికి కారణం కావాలకుంది. అందుకే క్రికెట్‌ను తన కెరీర్‌గా ఎంచుకుంది. చుట్టూ ఉన్న అబ్బాయిల మధ్య ఆటలో శిక్షణ పొందుతూ ఎన్నో సవాళ్ళు ఎదుర్కొంది. ఏది ఏమైనా దేశం తరపున ఆడాలనే తన కలను నిజం చేసుకోవాలని అహర్నిశలూ శ్రమించింది. ఆ పట్టుదలకు తోడు కోచ్ ప్రోత్సాహం కూడా దొరికింది. ఇంకేముందు తనలోని నైపుణ్యాలను బయటకు తీసింది. క్రికెట్‌లో బహుముఖ క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆమే ప్రముఖ క్రికెటర్ పూజా వస్త్రాకర్.

నాన్న సంతోషించాలనే...

మధ్యప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌కు చెందిన పూజా 1999, సెప్టెంబర్ 25న జన్మించింది. బహుముఖ క్రికెటర్ అయిన ఈమె మొదట్లో బ్యాటింగ్ చేసేది. అయితే పిచ్‌పై ఆమెకున్న పట్టు కేవలం 19 ఏండ్లకే భారత జట్టులో ఓపెనింగ్ బౌలర్‌గా ఎంపిక చేసింది. ఇటీవలే ఆమె బ్యాటింగ్ నైపుణ్యాలు పుంజుకోవడంతో ఆమెకు మరింత గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ఆమె విజయవంతమైన ఆల్ రౌండర్. పేస్‌తో పాటు బంతిని కదిలించే సామర్థ్యానికి ప్రసిద్ధి చెందిన ఆమె 2018లో అంతర్జాతీయంగా అరంగేట్రం చేసింది. అప్పటి నుండి ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకొని రాణిస్తోంది. WPLలో ముంబై ఇండియన్స్‌ను ఆమె ఎంపిక చేసుకుంది. ఆటకు సంబంధించిన అన్ని ఫార్మాట్లలో మంచి సహకారం అందించగల సామర్థ్యం ఆమెను మంచి స్థాయికి తీసుకెళుతుంది.

నాన్న మమ్మల్ని ప్రోత్సహించేవాడు

క్రికెట్‌పై మా నాన్నకు ఉన్న అభిరుచి నాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. వరల్డ్ కప్, ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు తెల్లవారుజామున 2.30 గంటలకు జరిగినా చూసేందుకు నిద్రలేచేవాడు. ఆసక్తిగా తాను చూడటమే కాదు క్రీడలు ఆడమని మమ్మల్ని కూడా ఎప్పుడూ ప్రోత్సహించేవాడు. గల్లీ క్రికెట్ ఆడటం మొదలుపెట్టినప్పుడే నాకు క్రికెట్‌పై మక్కువ పెరిగింది. సచిన్, సెహ్వాగ్‌ల ఆటను చూస్తూ, మా నాన్నకు వారు తెచ్చిన ఆనందాన్ని చూసి, ఏదో ఒక రోజు భారత్ తరపున ఆడి నేను కూడా అదే సంతోషాన్ని ఆయనకు అందించాలని కలలు కన్నాను. అదే నాకు ముఖ్యమైన టార్గెట్‌గా మారిపోయింది.

మద్దతు ఇచ్చారు

నేను క్రికెట్ ఆడటం మొదలుపెట్టినప్పుడు అబ్బాయిలు చాలా మంది ఉండేవారు. నేనొక్కదాన్నే అమ్మాయిని. మధ్యప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్‌లో భాగమైన మిస్టర్ అజయ్ ద్వివేది నాకు మద్దతు ఇచ్చిన వారిలో ఒకరు. ఈయన నాకు చాలా సహకరించారు. 'నువ్వు ఏదో ఒక రోజు భారత మహిళల జట్టుకు ఆడతావు' అంటూ నన్ను ఎప్పుడూ ప్రోత్సహించేవారు. నేనేమీ అడగకుండానే అతను ఎప్పుడూ నాకు బ్యాట్‌లు, బూట్లు, ప్యాడ్‌లు వంటి క్రికెట్ పరికరాలను అందించేవారు. నిజానికి నా తొలి క్రికెట్ వైట్స్‌ను ఆయనే నాకు బహుమతిగా ఇచ్చారు. నేను స్కూల్లో క్రికెట్ ఆడేటప్పుడు నా దగ్గర మంచి బ్యాట్లు లేవు. కానీ అతని పిల్లలందరూ ఒకే జట్టులో ఉండేవారు. కాబట్టి ఆయన నాకు వారి నాణ్యమైన బ్యాట్‌లను ఇచ్చేవారు. 'వెళ్లి ఆడుకో, ఏమీ బాధపడకు' అన్న ఆయన మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి.



గాయాలు సవాలుగా మారాయి

చుట్టూ అబ్బాయిలు ఉన్న ఈ ఆటను నేను ఆడగలనా లేదా అంటూ నన్ను నేను అనుమానించుకున్నాను. ఆ సమయంలో సవాలుగా ఉండే క్షణాలు ఎన్నో ఉన్నాయి. కానీ నేను నా ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నాను. అంతకు ముందు నేను ఇంతకంటే పెద్ద సవాళ్లను అధిగమించిన విషయాన్ని గుర్తు చేసుకున్నాను. గాయపడ్డ ప్రతిసారీ నన్ను నేను నిలబెట్టుకుంటూ వచ్చాను. ఎందుకంటే క్రికెట్ ఆడటం, అందునా భారతదేశం కోసం ఆడటం నాకెంతో ముఖ్యమైనదిగా అనుకున్నాను.

ముంబై ఇండియన్స్‌కు ఆడాలని

ముందే చెప్పినట్టు నేను క్రికెట్ ఆడటం ప్రారంభించినప్పుడు నా క్లబ్‌లో అమ్మాయిలు లేరు. కానీ 2018లో భారతదేశం తరపున ఆడిన తర్వాత నేను మా స్వగ్రామానికి తిరిగి వచ్చినప్పుడు అక్కడ 34 మంది అమ్మాయిలు ప్రాక్టీస్ చేయడం చూశాను. అది నాకు చాలా ఆనందంతో పాటు ఆశ్చర్యానికి గురి చేసిన సంఘటన. అంతేకాదు భారత జట్టుకు మొదటిసారి ఎంపిక కావడం వంటి ఇతర ఆశ్చర్యకరమైన అంశాలు కూడా నా జీవితంలో అప్పటి నుండే మొదలయ్యాయి. ఐపీఎల్ అరంగేట్రం చేసినప్పుడు సచిన్ సర్ అంటే నాకు చాలా ఇష్టం. అతను ముంబై ఇండియన్స్‌కు ఆడేవాడు. కాబట్టి నేను మొదటి రోజు నుండి ఆ జట్టుకు అభిమానిని. నాకు ముంబై ఇండియన్స్ జెర్సీ కావాలనే కల ఉందని నేను మా అన్నయ్యతో పదే పదే చెప్పుకునేదాన్ని. కానీ అది జరగలేదు. దాంతో చాలా బాధకు, నిరాశకు గురయ్యాను. అలాంటిది WPL టీమ్‌లో భాగమైన తర్వాత నేను నా సొంత ముంబై ఇండియన్స్ జెర్సీని పొందాను. ఆ క్షణంలో నేను ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతి పొందను. నా జీవితం సంతృప్తిగా ఉన్నట్టుగా భావించాను.





ధైర్యంగా ఎదుర్కొంటే

భారత జెండాను, క్రికెట్‌ను చూసినప్పుడు నాలో ఓ స్ఫూర్తి నిండిపోయేది. ఎప్పుడైనా నేను బలహీనంగా ఉన్నాను అనుకుంటే వెంటనే క్రికెట్ మ్యాచ్ చూస్తాను. అందే నన్ను ప్రేరేపించి నాలో కొత్త శక్తిని నింపుతుంది. నేను చేయాలనుకున్నది ఇదే అని నేను భావిస్తున్నాను. అసలు ఈ క్రీడను నేను ఎందుకు ప్రారంభించానో నాకు బాగా గుర్తుంది. అది నా అభిరుచి అప్పుడు, ఇప్పటికీ అలాగే ఉంది. 'క్రీడలైనా, జీవితమైనా అమ్మాయిలు ఎప్పుడూ దేన్నీ వదులుకోవద్దు. హెచ్చు తగ్గులు ఎప్పుడూ ఉంటాయి. సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కొంటే తర్వాత మనం మంచి సమయాన్ని ఆస్వాదిస్తాము. కాబట్టి మన జీవితంలో వచ్చే చెడు సమయాలను అధిగమించడానికి ప్రయత్నించాలి. జీవితం అంటే అదే. ఓటమిని ఎప్పుడూ అంగీకరించకు' ఇదే నేను నేర్చుకున్న జీవిత పాఠాలు.

- సలీమ

మానసిక ఆరోగ్యం మెరుగుపడాలంటే...!

సోషల్ మీడియా ప్రభావంతో మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని పలువురు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలికాలంలో చాలామంది రోజులో ఎక్కువ గంటలు సోషల్‌మీడియాలోనే గడుపుతున్నారు. దీంతో ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నారు. సోషల్‌మీడియాను ఎంత తక్కువగా ఉపయోగించుకుంటే ఆరోగ్యానికి అంత మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



- సోషల్‌మీడియాకు దూరంగా ఉంటే.. మీరనుకున్న లక్ష్యానికి చేరువవుతారు. ఏకాగ్రతతో, క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రయత్నిస్తారు.
- ఒత్తిడికి దూరమవుతారు. మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.
- సమాచారం తెలుసుకోవడానికి సోషల్‌మీడియాను ఉపయోగించుకోవాలి. కానీ రోజులో ఎంతసేపు సోషల్‌మీడియాని ఉపయోగించుకోవాలో పక్కా ప్రణాళిక మేరకు అమలు చేసుకుంటే మంచిది.
- సోషల్‌మీడియాకు బదులుగా.. పుస్తకాలు చదవడం, స్నేహితులు, కుటుంబ సభ్యులతో మాట్లాడడం వంటివి అలవాటు చేసుకుంటే మంచిది.
- ఎట్టి పరిస్థితుల్లోనూ నిద్ర పోయేముందు సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలి. లేకపోతే నిద్ర సరిగ్గా పట్టక పలు అనారోగ్య సమస్యలకు గురవుతారు.

ఇట్లు చేద్దాం

చేపలు గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. ఇందులో ఉండే విటమిన్ డి, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ప్రోటీన్లు గుండెను పరిరక్షిస్తుంటాయి. గుండెకు ఏ విధమైన హాని చేకూరకుండా కాపాడుతాయి.

నీటి నిల్వలపై శ్వేతపత్రం ఇవ్వాలి

(మొదటిపేజి తరువాయి)

రేవంత్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. సోమవారం తమ పార్టీ ఆధ్వర్యంలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించామని వారు లేఖలో పేర్కొన్నారు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్లు రోజురోజుకూ మరింత కుంగుతున్నాయని తెలిపారు. వర్షాలు పడితే అవి మరింత వేగంగా కుంగిపోయే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నారం బ్యారేజీలో బుంగ ఏర్పడిన చోట తాత్కాలికంగా పూడ్చినప్పటికీ ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. దీనిపై న్యాయవిచారణ జరిపి బాధ్యులపైన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసం ప్రయివేటు కాంట్రాక్టర్లతో కుమ్మక్కయిన ఫలితంగానే ఇలాంటి పరిణామాలు సంభవించాయని తెలిపారు. కాళేశ్వరం పేరుతో రీడిజైన్ చేసిన ప్రాజెక్టు భవిష్యత్ గురించి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు, ఇతర నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాటిని అఖిలపక్షం ముందుంచాలంటూ కోరారు. గత ప్రభుత్వం సకాలంలో వ్యవసాయ ప్రణాళికను రూపొందించకపోవటంతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కూడా కంటింజెన్సీ ప్రణాళికను రూపొందించకపోవటంతో సమస్య మరింత తీవ్రమైందని పేర్కొన్నారు. ఫలితంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వాపోయారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా స్వయంగా జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వారు రేవంత్‌రెడ్డిని కోరారు.

అప్పుల్లో కుటుంబాలు

(మొదటిపేజి తరువాయి)

పొదుపు శక్తిని దెబ్బతీశాయి. అదే విధంగా వినియోగ వ్యయాలు, భౌతిక పొదుపు పెరుగుదల సేవింగ్స్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. 2023-24లోనూ ప్రయివేటు వినిమయం, కుటుంబాల పెట్టుబడుల్లో వృద్ధి బలహీనంగా కనబడింది. కుటుంబాల వార్షిక అప్పులు 5.8 శాతానికి ఎగిసే అవకాశం ఉందని మోతిలాల్ ఓస్వాల్ పరిశోధకులు అంచనా వేశారు. ఇది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అత్యధికంగా నమోదు కానుందన్నారు. కేంద్రంలో మోడీ సర్కార్ రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ అప్పులూ అమాంతం పెరిగిన విషయం తెలిసిందే. వాటి చెల్లింపులకు ప్రజలపై అనేక భారాలు మోపడం, ధరలు పెంచడం, నిరుద్యోగం ఎన్నడూ లేనంతగా పెరిగిపోవడం, ప్రజల ఆదాయాలు పడిపోవడం తదితర అంశాలు కుటుంబాలను అప్పుల పాలు చేస్తున్నాయని ఈ నివేదిక చెబుతోంది.

పాలక పక్షానికి కష్టం..

(మొదటిపేజి తరువాయి)



పరిశీలించారు. కేసీఆర్‌ది కర్కాటక రాశి అనీ, ఆయన ఏం చేసినా విజయం సిద్ధిస్తుందని చెప్పారు. ఆయన చేపట్టబోయే చర్యలకు, వేసే ఎత్తుగడలకు ప్రజామోదం లభిస్తుందని తెలిపారు. కేటీఆర్‌ది మకర రాశి అని పేర్కొన్నారు. ఈ రాశి వారు నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదనీ, ఆచితూచి మాట్లాడితే బావుంటుందని పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఆయన ఆదాయ, వ్యయాలు సమానంగా ఉన్నాయని వివరించారు.

అందరికీ మంచి జరగాలి : కేటీఆర్

అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ... కొత్త ఏడాదిలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ప్రజలంతా శాంతి, సౌభాగ్యం, మతసామరస్యంతోమ మెలగాలని అన్నారు. సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

సోషల్ మీడియాలో సీపీఐ (ఎం)

(మొదటిపేజి తరువాయి)

ఆకర్షణీయమైన ప్రపంచంలో అడుగు పెట్టింది. తద్వారా లోక్‌సభ ఎన్నికల్లో ప్రత్యర్థులతో విజయవంతంగా పోటీ పడుతోంది.

ప్రస్తుతం సీపీఐ (ఎం)కు వివిధ రాష్ట్రాల్లో పలు హ్యాండిల్స్, సామాజిక మాధ్యమ పేజీలు ఉన్నాయి. వీటి సాయంతో రెట్టించిన సమధికోత్సాహంతో ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోంది. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర శాఖ మొదటి స్థానంలో ఉంది. బెంగాల్‌లో కృత్రిమ మేథ (ఏఐ)ను ప్రచార సాధనంగా సీపీఐ (ఎం) ఎంచుకుంది. గత నెలలో సమానత్వానికి చిహ్నమైన 'సమత' పేరిట ఏఐ అవతార్‌ను ఆవిష్కరించింది. వారానికి రెండుసార్లు ఇంగ్లీషు, హిందీ భాషల్లో వార్తా బులెటిన్లు ప్రసారమవుతున్నాయి.

పకడ్బందీ వ్యూహంతో...

పశ్చిమ బెంగాల్ పార్టీ కార్యాలయం నుంచి, మారుమూల ప్రాంతాల వరకు 50-60 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐకి చెందిన వాలంటీర్లు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మహా యజ్ఞంలో నిపుణులెవ్వరూ పాలుపంచుకోవడం లేదు. ఐదుగురు వాలంటీర్లతో కూడిన కేంద్ర బృందం దేశ రాజధాని నుండి విధులు నిర్వర్తిస్తోంది. కేంద్ర బృందంతో సమన్వయం చేసుకునేందుకు ప్రతి రాష్ట్రం నుండి ఇద్దరు వాలంటీర్లను నియమించారు. మొత్తంమీద వివిధ వేదికల ద్వారా ప్రతి రోజూ 30-40 పోస్టులు పెడుతూ తాజా సమాచారాన్ని అందజేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎన్నికల రణరంగాన్ని సీపీఐ (ఎం) పునర్నిర్వచించింది. పశ్చిమ బెంగాల్ సమాచారాన్ని ఇతర రాష్ట్రాల కామ్రేడ్లకు చేరవేయడమే 'సమత' ఉద్దేశమని ఆ రాష్ట్ర సామాజిక మాధ్యమ బృందం నేతలు తెలిపారు. సామాజిక మాధ్యమ బృందాల పనితీరులో ఇప్పుడు కొట్టొచ్చినట్లు మార్పు కన్పిస్తోంది. వీటిని సీపీఐ (ఎం) వాలంటీర్లు, కామ్రేడ్లే నడుపుతున్నారు. గ్రాఫిక్స్, ప్రచార వీడియోలు, రీల్స్, చిన్న చిన్న డాక్యుమెంటరీలు, అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలు...వీటన్నింటినీ ఎప్పటికప్పుడు తాజా పరుస్తూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా వివిధ వేదికల్లో పోస్టు చేస్తున్నారు. ప్రధాన కార్యక్రమాలు, పత్రికా సమావేశాలను ప్రత్యక్ష ప్రసారం కూడా చేస్తున్నారు. అంతా పకడ్బందీ వ్యూహంతో సాగుతోంది.

లేట్ అయినా లేటెస్టుగా...

'ఇతర పార్టీలతో పోలిస్తే మేము ఆలస్యంగానే పని ప్రారంభించాం. పార్టీ అవగాహన కారణంగా ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని అందజేయడం కష్టమైన పనే. నిధుల లభ్యత కూడా అడ్డంకిగా ఉంది. వాస్తవానికి మేము కొత్తగా కార్యాలయాలు ఏర్పాటు చేశాము. వాలంటీర్లు, కామ్రేడ్లను నియమించుకున్నాము' అని సామాజిక మాధ్యమ బృందం సభ్యుడొకరు తెలిపారు. 2014లో సోషల్ మీడియాను వాడుకోవాలని విశాఖపట్నంలో జరిగిన పార్టీ సమావేశంలో నిర్ణయించారు. నెమ్మదిగా పని ప్రారంభించినప్పటికీ 2019 ఎన్నికల సమయంలో డిజిటల్ వేదికల ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు. 2021లో జరిగిన పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల సమయంలో మంచి ప్రదర్శన కనబరిచారు.

అవసరమే : కరత్

ప్రస్తుతం సామాజిక మాధ్యమాన్ని, సాంకేతిక పరిజ్ఞానంలో నూతన ఆవిష్కరణలను ఉపయోగించుకోవాల్సిన అవసరం ఏర్పడిందని, అది తప్పనిసరి అయిందని సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు ప్రకాష్ కరత్ చెప్పారు. 'ఇవాళ యువతలో ఎక్కువ మంది వేర్వేరు సామాజిక మాధ్యమ సాధనాలను వాడుతున్నారు. వారు సామాజిక మాధ్యమాల ద్వారానే వార్తలు చదువుతున్నారు. అవగాహన చేసుకుంటున్నారు' అని అన్నారు. కాగా డిజిటల్ వేదికల పనితీరును వివరించడానికి సెమినార్లు, సదస్సులు నిర్వహిస్తున్నారు. వాలంటీర్లు, కామ్రేడ్లకు శిక్షణ ఇస్తున్నారు. ఈ ప్రయత్నాలన్నీ ఫలితాలను ఇస్తున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఒకటి మినహా మిగిలిన 21 జిల్లాలలోనూ సామాజిక మాధ్యమ బృందాలు అంకితభావంతో పనిచేస్తున్నాయి. యాభై శాతం పోలింగ్ కేంద్రాల్లో ఈ బృందాలకు బూత్ స్థాయి వాలంటీర్లు ఉన్నారు.

కేజ్రీవాల్‌కు దక్కని ఊరట

(మొదటిపేజి తరువాయి)

అరెస్టు చేసిందన్న కేజ్రీవాల్ వాదనను కూడా కోర్టు తోసిపుచ్చింది. లిక్కర్ కేసులో అరెస్టయి తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్, తన అరెస్టును సవాల్ చేస్తూ గత వారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కేజ్రీవాల్ తరఫున వాదనలు వినిపించారు. ఈడీ తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ రాజు వాదించారు. వాదనల తరువాత తీర్పును రిజర్వు చేసిన ఢిల్లీ హైకోర్టు మంగళవారం తీర్పును వెలువరించింది.

కాగా లిక్కర్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. అనంతరం వారంపాటు ఈడి కస్టడీ విధించిన కోర్టు ఆ తరువాత ఏప్రిల్ 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఇదే కేసులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియా కూడా అరెస్టయి జైలులో ఉన్నారు.

సుప్రీంకోర్టుకు కేజ్రీవాల్

లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేయడంతో ఆమ్ ఆద్మీ పార్టీ తదుపరి చర్యలకు ఉపక్రమిస్తోంది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. అత్యున్నత న్యాయస్థానంలో బుధవారం నాడు పిటిషన్ వేసే అవకాశం ఉందని 'ఆప్' వర్గాల సమాచారం.

రోజుకో పేరు

(మొదటిపేజి తరువాయి)

కాంగ్రెస్ తరపున ఎవరు పోటీ చేసినా 'నల్లేరుపై నడకే' అన్న ప్రచారం ఉంది. అదే కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కేటాయింపునకు ప్రతిబంధకంగా మారినట్టు తెలుస్తోంది. దీనికితోడు ముగ్గురు మంత్రుల మధ్య టిక్కెట్ విషయంలో ఏకాభిప్రాయం లేకపోవడమే ప్రధాన కారణంగా చర్చ సాగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశం ముగిసి 20 రోజులకు పైగా అవుతోంది. ఈనెల 6వ తేదీన తుక్కుగూడలో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ కూడా అయింది. అయినా ఖమ్మం లోక్‌సభ టిక్కెట్ కేటాయింపుపై సందిగ్ధత అలానే ఉంది.

మండవ, సుహాసిని పేర్ల వెనుక..

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి గతంలో టీడీపీ తరపున ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా కూకట్‌పల్లి నుంచి పోటీ చేసి ఓడిన నందమూరి హరికృష్ణ కూతురు సుహాసిని పేర్లు వినిపిస్తున్నాయి. అనూహ్యంగా ఈ పేర్లను తెరమీదకు తేవడంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 'హస్తం' ఉందనే టాక్ నడుస్తోంది. మండవకు పార్లమెంట్ టిక్కెట్‌పై గతంలో హామీ ఇచ్చారని, సుహాసినికి టిక్కెట్ ఇవ్వడం ద్వారా పాత టీడీపీ క్యాడర్‌ను ఆకట్టుకోవచ్చనే వ్యూహంతో తుమ్మల దౌత్యం నెరుపుతున్నట్టు చర్చ సాగుతోంది. టీడీపీలో ఉండగా మండవతో ఇటు తుమ్మల, అటు సీఎం రేవంత్ సాన్నిహిత్యంగా ఉండేవారని అంటున్నారు. మొత్తమ్మీద వీరిలో ఎవరికి టిక్కెట్ దక్కినా సంచలనమే.

ఇప్పటికీ ప్రసాద్‌రెడ్డి వైపే మొగ్గు..!

రకరకాల రాజకీయ, సామాజిక సమీకరణాలు, ఊహాగానాలు కొనసాగుతున్నా పొంగులేటి ప్రసాద్‌రెడ్డికే ఎక్కువ అవకాశాలున్నాయనే చర్చ సాగుతోంది. ముగ్గురు మంత్రుల మధ్య ఏకాభిప్రాయం కుదరకే ఆయనకు టిక్కెట్ కేటాయింపు ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రత్యక్షంగా, పరోక్షంగా..15 నుంచి 20 మంది ఎమ్మెల్యేల నైతిక మద్దతు ఉండటం కలిసివచ్చే అంశంగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రైతు కుటుంబాల్లో వెలుగులు నింపుతాం..

(మొదటిపేజి తరువాయి)

చేసుకునే షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడి జీవితంలోని అనేక అనుభవాలకు ప్రతీకన్నారు. జీవితంలో ఎదురయ్యే అనేక అనుభవాలను ఎదుర్కొని ముందుకు వెళ్లాలని ఇది సూచిస్తుందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలు ప్రజలకు అందడం సంతృప్తినిచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల శంకర్, బీసీ కమిషన్ చైర్మెన్ వకుళభరణం కృష్ణమోహన్, సీఎస్ శాంతికుమారి, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హన్మంత్ రావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ వర్షపాతమే

(మొదటిపేజి తరువాయి)

వానలు జోరందుకుంటాయని వివరించింది. 'ఎల్‌నినో ప్రభావంతో రుతుపవనాల సీజన్ బలహీనంగానే మొదలవుతుంది. నాలుగు నెలల పాటు కొనసాగే వర్షాకాలంలో ద్వితీయార్థంలో బాగా వర్షాలు పడతాయి' అని స్కైమెట్ మేనేజింగ్ డైరెక్టర్ జతిన్ సింగ్ చెప్పారు. దక్షిణ, పశ్చిమ, వాయవ్య ప్రాంతాలలో మంచి వర్షాలు పడతాయని స్కైమెట్ అంచనా వేస్తోంది. రుతుపవనాల సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో సమానంగా వర్షాలు పడతాయి. తూర్పు ప్రాంతంలో ఉన్న బీహార్, జార్ఖండ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్‌లో జూలై, ఆగస్టు నెలల్లో వర్షపాతంలో లోటు కన్పిస్తుంది. ఈశాన్య ప్రాంతంలో సీజన్ తొలి అర్థభాగంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది.

మహాలో సీట్ల సర్దుబాటు

(మొదటిపేజి తరువాయి)

శివసేన నేత ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ప్రతి ఒక్కరూ సీట్ల కోసం పోరాడాలని కోరుకుంటారు. తప్పు లేదు కాని, గెలుపునకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఉద్ధవ్ ఠాక్రే సీట్ల పంపకాల ఒప్పందం కుదిరిందని, కూటమి గెలుపొందడం, బీజేపీని ఓడించడం ముఖ్యమైన లక్ష్యం అన్నారు. మోడీ తమ పార్టీని "నకిలీ శివసేన"గా పేర్కొన్నారని, దోపిడీ దొంగల పార్టీ నాయకుడు తమను ఫేక్ అనడం సరికాదని ధ్వజమెత్తారు. బీజేపీయే "దోపిడీదారుల పార్టీ" అని, ఎలక్టోరల్ బాండ్ల "స్కామ్" బట్టబయలైన తరువాత ఇది స్పష్టం అయిందని ఠాక్రే విమర్శించారు. బీజేపీని ఓడించాలనే లక్ష్యాన్ని సాధించడానికి "విశాల హృదయంతో" ఉండాలని నిర్ణయించుకున్నట్టు కాంగ్రెస్ నేత నానా పటోలే తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీతో పోరాడుతారని, సాంగ్లీ, భీవండిలో తమ కూటమి అభ్యర్థుల గెలుపు ఖాయమని అన్నారు. తమ నేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ పట్ల బీజేపీ ఎంత దురుసుగా ప్రవర్తించిందో తమ కార్యకర్తలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు. ఠాక్రే, శరద్ పవార్ పార్టీలను తిరుగుబాటుదారులు హైజాక్ చేశారని అన్నారు. అసలు రెండు పార్టీల నేతలు తమతోనే ఉన్నారని తెలిపారు.

ఒప్పందంలో భాగంగా జల్గావ్, పర్భానీ, నాసిక్, పాల్ఘర్, కళ్యాణ్, థానే, రాయ్‌గఢ్, మావల్, ఉస్మానాబాద్, రత్నగిరి-సింధుదుర్గ్, బుల్దానా, హత్కనంగ్‌కలే, ఔరంగాబాద్, షిర్డీ, సాంగ్లీ, హింగోలి, యావత్మాల్-వాషిమ్, ముంబై సౌత్, ముంబై సౌత్ సెంట్రల్, ముంబై నార్త్ వెస్ట్, ముంబై నార్త్ ఈస్ట్ సీట్లను శివసేన (ఠాక్రే) దక్కించుకుంది. కాంగ్రెస్‌కు నందుర్‌బార్, ధులే, అకోలా, అమరావతి, నాగ్‌పూర్, భండారా-గోండియా, గడ్చిరోలి-చిమూర్, చంద్రాపూర్, నాందేడ్, జాల్నా ముంబై నార్త్ సెంట్రల్, ముంబై నార్త్, పూణే, లాతూర్, షోలాపూర్, కొల్హాపూర్, రామ్‌టెక్ స్థానాలు దక్కాయి. బారామతి, షిరూర్, సతారా, భివండి, దిండోరి, మాధా, రావర్, వర్ధన్, అహ్మద్‌నగర్ సౌత్, బీడ్ స్థానాల్లో ఎన్సీపీ(శరద్ పవార్) పోటీ చేయనుంది. మహారాష్ట్రలో 48 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు ఐదు దశల్లో ఏప్రిల్ 19 నుంచి మే 20 వరకు వరకు జరగనున్నాయి.




అర్హతలో అదుర్స్

- ప్రధాన టోర్నీకి మాళవిక బాన్సోద్
- మరో నాలుగు డబుల్స్ జోడీలు సైతం
- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్

నవతెలంగాణ-నింగ్‌బో :
ప్రతిష్టాత్మక ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో టీమ్ ఇండియా షట్లర్లు సానుకూల ఆరంభం అందుకున్నారు. మంగళవారం అర్హత రౌండ్‌లో భారత క్రీడాకారులు అదరగొట్టారు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బాన్సోద్ ప్రధాన టోర్నీకి అర్హత సాధించగా.. డబుల్స్ విభాగాల్లో నాలుగు జోడీలు సైతం ప్రధాన డ్రాకు చేరుకున్నాయి. అర్హత రౌండ్లో మాళవిక బాన్సోద్ వరుసగా 21-8, 21-0తో, 21-4, 21-5తో ఏకపక్ష విజయాలు నమోదు చేసింది. మహిళల డబుల్స్ అర్హత రౌండ్లో సిమ్రన్ సింగ్, రితిక ఠాకూర్‌లు 21-11, 21-16తో, 21-10, 21-18తో అలవోక విజయం సాధించారు. రుతుపర్ణ పండ, శ్వేతపర్ణ పండ జంట సైతం వరుస మ్యాచుల్లో 21-18, 21-16తో, 21-6, 21-6తో ప్రధాన టోర్నీకి చేరుకున్నారు. మెన్స్ డబుల్స్‌లో హరిహరన్, రూబన్ కుమార్‌లు 21-15, 21-7తో, 21-10, 21-5తో వరుస మ్యాచుల్లో గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీశ్ కుమార్ కరుణాకరన్, ఆద్య జోడీ 21-6, 21-4తో, 21-11, 21-8తో సాధికారిక విజయాలతో ప్రధాన టోర్నీలో అడుగుపెట్టారు. ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్ ప్రధాన టోర్నీ మ్యాచులు నేటి నుంచి షురూ కానున్నాయి.

మనోళ్లపైనే ఫోకస్ : బ్యాడ్మింటన్ పవర్‌హౌస్‌గా ఎదుగుతున్న తరుణంలో మన షట్లర్లు అనూహ్యంగా ఫామ్ కోల్పోవటం ఆందోళనకు దారితీస్తోంది. డబుల్స్ సర్క్యూట్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ జైత్రయాత్ర కొనసాగుతున్నా.. సింగిల్స్ సర్క్యూట్‌లో సింధు, లక్ష్యసేన్, శ్రీకాంత్ అంచనాలను అందుకోవటం లేదు. 2024 పారిస్ ఒలింపిక్స్ అర్హత పాయింట్ల కేటాయింపునకు ఈ టోర్నమెంట్ ఆఖరు కావటంతో భారత షట్లర్లపై అంచనాలను ఎక్కువగా ఉన్నాయి. పి.వి సింధు, లక్ష్యసేన్, కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్ సహా ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జోడీ, అర్జున్, కపిల జోడీ నేడు తొలి రౌండ్లో బరిలోకి దిగుతున్నారు. మలేషియా షట్లర్ జిన్ వీతో సింధు తలపడనుండగా.. టాప్ సీడ్ షి యూకీతో లక్ష్యసేన్ తాడోపేడో తేల్చుకోనున్నాడు. కిదాంబి శ్రీకాంత్ సైతం రెండో సీడ్ ఆంటోని జింటింగ్‌తో తొలి రౌండ్లోనే కఠిన సవాల్‌కు సిద్ధమయ్యాడు. ప్రియాన్షు రజావత్, హెచ్.ఎస్ ప్రణయ్‌లకు సైతం కఠిన డ్రాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్‌లో ట్రెసా జాలి, పుల్లెల గాయత్రిలు నాల్గో సీడ్ చైనా జోడీతో పోటీపడనుండగా.. తనీశ క్రాస్టో, అశ్విని పొన్నప్ప జోడీకి వాకోవర్ లభించింది. 17వ సీడ్ ఇండోనేషియా షట్లర్లు పోటీ నుంచి తప్పుకోగా తనీశ, అశ్వినిలు నేరుగా రెండో రౌండ్‌కు చేరుకున్నారు.

నితీశ్ ధనాధన్



- తెలుగు తేజం అర్ధశతక జోరు
- సన్‌రైజర్స్ హైదరాబాద్ 182/9

నవతెలంగాణ-ముల్లాపూర్
తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి (64, 37 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో చెలరేగాడు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో సహచర బ్యాటర్లు నిరాశపరిచినా.. క్రీజులో నిలబడిన నితీశ్ కుమార్ రెడ్డి సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు మంచి స్కోరు అందించాడు. పంజాబ్ కింగ్స్ పేసర్ అర్షదీప్ సింగ్ (4/29) విజృంభణతో ఓ దశలో 66/4తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. నితీశ్ కుమార్ రెడ్డి మెరుపు ఇన్నింగ్స్‌తో 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. అబ్దుల్ సమద్ (25, 12 బంతుల్లో 5 ఫోర్లు), ట్రావిశ్ హెడ్ (21, 15 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు.

తడబడినా..దంచికొట్టారు : సొంతగడ్డ ముల్లాపూర్ స్టేడియంలో టాస్ నెగ్గిన పంజాబ్ కింగ్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. సన్‌రైజర్స్ ఓపెనర్లు ట్రావిశ్ హెడ్ (21), అభిషేక్ శర్మ (16, 11 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) సహజంగానే దూకుడుగా ఆడారు. మూడు ఓవర్లలో 26/0తో నిలిచిన సన్‌రైజర్స్‌కు అర్షదీప్ సింగ్ గట్టి షాక్ ఇచ్చాడు. ఒకే ఓవర్లో ట్రావిశ్ హెడ్, ఎడెన్ మార్క్రామ్ (0)ను సాగనంపాడు. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరు కాస్త తగ్గింది. అభిషేక్ శర్మ దూకుడు కొనసాగించినా.. కరన్ ఓవర్లో అతడూ డగౌట్‌కు చేరుకున్నాడు. ఈ స్థితిలో నితీశ్ కుమార్ రెడ్డి (64) అద్భుత ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. పది ఓవర్లలో 66/4తో స్వల్ప స్కోరుకు పరిమితం అయ్యేలా కనిపించిన సన్‌రైజర్స్‌ను నితీశ్ కుమార్ రెడ్డి నిలబెట్టాడు. మూడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 32 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన నితీశ్..అబ్దుల్ సమద్ (25) జతగా 20 బంతుల్లోనే 50 పరుగులు పిండుకున్నాడు. నితీశ్, సమద్ జోరుతో ఊపందుకున్న సన్‌రైజర్స్‌ను అర్షదీప్ మళ్లీ దెబ్బకొట్టాడు. ఈ సారి సైతం ఒకే ఓవర్లో సమద్, నితీశ్‌లను అవుట్ చేసి పంజాబ్ కింగ్స్‌కు ఊరట అందించాడు. భారీ అంచనాలు పెట్టుకున్న హెన్రిచ్ క్లాసెన్ (9) నిరాశపరిచాడు. షాబాజ్ అహ్మద్ (14 నాటౌట్), భువనేశ్వర్ కుమార్ (6), జైదేవ్ ఉనద్కట్ (6 నాటౌట్) ఆఖర్లో మంచి ముగింపు అందించారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లలో అర్షదీప్ సింగ్ (4/29) నాలుగు వికెట్లతో మెరువగా.. శామ్ కరన్, హర్షల్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

భారత్‌కు చేదు అనుభవం!

- టోర్నీలో పోటీకి అనుమతి నిరాకరణ



న్యూఢిల్లీ : ఇటీవల వాడా విడుదల చేసిన డోపింగ్ గణాంకాల ప్రభావం భారత అథ్లెట్లపై పడింది. అంతర్జాతీయ అథ్లెటిక్స్ క్యాలెండర్‌లో భాగంగా ది మీటింగ్ డి లిమోగస్ టోర్నీలో భారత్ నుంచి ముగ్గురు అథ్లెట్లు పోటీపడాల్సి ఉంది. కానీ డోపింగ్ శాతం భారత్‌లోనే అత్యధికంగా ఉండటంతో మన అథ్లెట్లు పోటీ పడేందుకు నిర్వాహకులు అనుమతి నిరాకరించారు. ట్రిపుల్ జంపర్స్ ఎల్డోస్ పాల్, సెల్వ ప్రభు సహ హైజంపర్ జెస్సె సందేశ్‌లను పోటీకి నిరాకరిస్తూ ఫ్రెంచ్ నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. వాడా నివేదిక ప్రకారం భారత్‌లో 3865 శాంపిల్స్ పరీక్ష చేయగా.. అందులో 3.2 శాతం డోపింగ్ పాజిటివ్‌గా తేలాయి. డోపింగ్ అనుమానం కారణంగా భారత అథ్లెట్లను పోటీ కి అనుమతించని ఫ్రెంచ్ నిర్వాహ కులపై విమర్శలు వస్తున్నాయి. భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధ్యక్షుడు ఆదిలె సుమారివాల దీనిపై స్పందించాల్సి ఉంది.

హసరంగ పోయె విజయకాంత్ వచ్చె



హైదరాబాద్ : సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడు, శ్రీలంక స్పిన్ ఆల్‌రౌండర్ వానిందు హసరంగ ఐపీఎల్ 17వ సీజన్‌కు దూరమయ్యాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌లో హసరంగ గాయపడిన సంగతి తెలిసిందే. వానిందు హసరంగ స్థానంలో సన్‌రైజర్స్ మరో శ్రీలంక స్పిన్నర్‌ను జట్టులోకి తీసుకుంది. లెగ్ స్పిన్నర్ విజయకాంత్ త్వరలోనే సన్‌రైజర్స్ శిబిరంలో చేరనున్నాడు. హసరంగను రూ.1.5 కోట్లను తీసుకున్న సన్‌రైజర్స్.. ఇప్పుడు విజయకాంత్ కోసం రూ.50 లక్షలు వెచ్చించింది.

రాయల్స్‌కు ఎదురుందా?

- నేడు టైటాన్స్‌తో రాజస్థాన్ ఢీ



నవతెలంగాణ-జైపూర్
రాజస్థాన్ రాయల్స్.. ఐపీఎల్ 17వ సీజన్‌లో అజేయంగా నిలిచిన ఏకైక జట్టు. తొలి నాలుగు మ్యాచుల్లోనూ రాజస్థాన్ రాయల్స్ విజయాలు నమోదు చేసి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు ఇతర జట్లు ఓ ఓటమి, ఓ గెలుపు అన్నట్టు వేట సాగిస్తున్నాయి. సొంతగడ్డ జైపూర్‌లో మరింత ఉత్సాహంగా ఉరకలేస్తున్న రాజస్థాన్ రాయల్స్ నేడు గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. 2022 ఫైనలిస్టుల ముఖాముఖి పోరులో రాయల్స్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుండగా.. గుజరాత్ టైటాన్స్ హ్యాట్రిక్ ఓటమి తప్పించుకునే పనిలో ఉంది. గత రెండు మ్యాచుల్లో ఓడిన గుజరాత్ టైటాన్స్ నేడు విజయమే లక్ష్యంగా ఆడనుంది. గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం.

జోరుమీదున్న రాజస్థాన్ : రాజస్థాన్ రాయల్స్ తొలి మూడు మ్యాచుల్లో నెగ్గినా.. స్టార్ బ్యాటర్ జోశ్ బట్లర్ ఫామ్ ఆ జట్టుకు ఆందోళన కలిగించింది. గత మ్యాచ్‌లో ఆర్సీబీపై సెంచరీతో చెలరేగిన బట్లర్ ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపించాడు. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ సైతం ధనాధన్‌లో నిలకడ చూపిస్తే రాజస్థాన్ రాయల్స్‌ను నిలువరించటం మరింత కష్టమవనుంది. సంజు శాంసన్, రియాన్ పరాగ్‌లు బ్యాటింగ్ లైనప్‌కు వెన్నుముకలా నిలుస్తున్నారు. స్పిన్ ద్వయం అశ్విన్, చాహల్ మిడిల్ ఓవర్లలో ముఖ్యపాత్ర పోషిస్తోంది. ట్రెంట్ బౌల్ట్ నిప్పులు చెరిగే ఓపెనింగ్ స్పెల్స్‌తో ప్రత్యర్థులను భయపెడుతున్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భీకర ఫామ్‌లో ఉన్న రాజస్థాన్ రాయల్స్ ఐదో విజయంపై కన్నేసి నేడు మైదానంలోకి అడుగుపెట్టనుంది.

పుంజుకుంటారా? : యువ సారథి శుభ్‌మన్ గిల్ సారథ్యంలో గుజరాత్ టైటాన్స్ మిశ్రమ ఫలితాలు సాధిస్తున్న. ఐదు మ్యాచుల్లో గుజరాత్ టైటాన్స్ రెండు విజయాలు సాధించింది.ఆ రెండు సొంత గడ్డ మొతెరాలో వచ్చినవే కావటం గమనార్హం. శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ మినహా ఎవరూ బ్యాట్‌తో నిలకడగా రాణించటం లేదు.డెవిడ్ మిల్లర్ అంచనాలను అందుకోవటం లేదు. రషీద్ ఖాన్, నూర్ అహ్మద్ మెరిసినా.. సహచర బౌలర్ల నుంచి సహకారం లభించటం లేదు. వరుసగా రెండు పరాజయాల నుంచి కోలుకుని నేడు బలమైన రాజస్థాన్ రాయల్స్‌పై గుజరాత్ టైటాన్స్ నెగ్గటం కష్టమైన సవాల్. మరి ఈ పరీక్షను శుభ్‌మన్ గిల్ ఏ విధంగా ఎదుర్కొంటాడో చూడాలి.


నవచిత్రం


నవదీప్, విశ్వక్‌సేన్, భావన సాగి

యూనిక్ కాన్సెప్ట్

నవదీప్ 2.0 అని, తనని తానూ 'లవ్, మౌళి' ద్వారా కొత్తగా ప్రేక్షకులకు పరిచయం చేసుకుంటున్నారు. ఉగాది సందర్భంగా ఈ చిత్ర ట్రైలర్ హీరో విశ్వక్ సేన్ చేతుల మీదుగా విడుదల చేశారు.
హీరోయిన్ భావన మాట్లాడుతూ, 'ఈ సినిమా ఒక యూనిక్ ప్రాజెక్ట్. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్యారెక్టర్‌తో రిలేట్ అవుతారు. డైరెక్టర్ అవనీంద్ర ఒక కొత్త కథతో వచ్చారు. నవదీప్ తప్ప మౌళి రోల్‌ని ఇంకెవ్వరూ చెయ్యలేరు. నిజమైన ప్రేమకు ఒక రానెస్ ఉంటుంది, అది అందరికి ఒకేలా ఉంటుంది' అని తెలిపారు. 'కోవిడ్ ఈ కథ రాయడానికి చాలా హెల్ప్ చేసింది, అసలేం కథ రాయాలి? ఎలా రాయాలి? అనే ఆలోచనలోనే ఒక సంవత్సరం గడిచిపోయింది. కథ ఎప్పుడైతే అయ్యిందో, అప్పుడు నాకు ఈ మౌళి పాత్రకి నవదీప్ అయితేనే సరిగ్గా సరిపోతాడని, నవదీప్‌తో అప్పటి నుండి ట్రావెల్ అవ్వడం మొదలు పెట్టాను. ఇది ప్రేక్షకుల్ని కచ్చితంగా మెప్పిస్తుంది' అని డైరెక్టర్ అవనీంద్ర చెప్పారు.
హీరో నవదీప్ మాట్లాడుతూ,'ఈ కథ విన్నప్పుడు అవనీంద్ర నన్ను గడ్డం చేసుకోవద్దు, జుట్టు పెంచు, బాడీ బిల్డ్ చెయ్ అని చెప్పారు. నేను దాదాపుగా ఒక సంవత్సర కాలం అదే పనిలో ఉన్నాను. చాలా కొత్త కథ, దానికి తగ్గ లొకేషన్స్ అన్ని కలిసొచ్చాయి, ఈ సినిమా ట్రైలర్‌ని వేరు వేరు ఊర్లల్లో రిలీజ్ చేద్దాం అనుకుంటున్నాం, దానికి ఒక రూట్ మ్యాప్ కూడా ఏలూరు శ్రీను ఇచ్చారు, దానికి 'ప్రేమ యాత్ర' అని పేరు కూడా పెట్టాం. త్వరలో మీకు డీటెయిల్స్ రిలీజ్ చేస్తాను' అని తెలిపారు. విశ్వక్‌సేన్ మాట్లాడతూ,'నవదీప్‌కి ఈ సినిమా మంచి సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు.

ఫెంటాస్టిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్


విజయ్ ఆంటోనీ

విజయ్ ఆంటోనీ నటించిన తాజా సినిమా 'లవ్ గురు'. ఆయన తొలిసారి రొమాంటిక్ ఎంటర్ టైనర్ జానర్‌లో నటించిన చిత్రమిది. వినాయక్ వైద్యనాథన్ దర్శకత్వం వహించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ సినిమాను రంజాన్ పండుగ సందర్భంగా ఈ నెల 11న విడుదల చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో హీరో విజయ్ ఆంటోనీ మీడియాతో మాట్లాడుతూ, 'ఇందులో ఫెంటాస్టిక్ ఫ్యామిలీ కామెడీ చూస్తారు. సినిమా చూశాక మీ జీవిత భాగస్వామిని ప్రేమించడం ఎలాగో తెలుసుకుంటారు. దర్శకుడు తన లైఫ్‌లో చూసిన అనుభవాలతో ఈ కథను రెడీ చేశాడు. ఈ కథలో హీరో క్యారెక్టర్ ప్రేమను పంచుతుంది. ప్రేమిస్తుంది. అతన్ని ద్వేషించినా వారిని లవ్ చేస్తుంది. నేను ఫ్యూచర్‌లో ఎంత గొప్ప సినిమా చేసినా అది బిచ్చగాడు సినిమా కంటే గొప్ప మూవీ కాలేదు. అయితే లవ్ గురు కూడా నాకు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని అందిస్తుంది. ఇందులో లేడీస్ సెంటిమెంట్ ఉంటుంది. 2026 సమ్మర్‌లో బిచ్చగాడు 3 సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. ఈ సినిమాకు నేనే దర్శకత్వం చేస్తాననుకుంటా. ప్రస్తుతం మా ప్రొడక్షన్ మూడు సినిమాలు లైనప్ లో ఉన్నాయి. ఒకటి అక్టోబర్‌లో, మరొకటి సంక్రాంతికి, ఇంకో సినిమా నెక్ట్ సమ్మర్‌లో రిలీజ్ చేయబోతున్నాం.

భిన్న స్క్రిప్ట్‌తో నయా సినిమా


శ్రీ విష్ణు, దిల్ రాజు


హీరో శ్రీవిష్ణు తన 19వ చిత్రాన్ని అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి నూతన దర్శకుడు జానకి రామ్ మారెళ్ల దర్శకత్వం వహించనున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ఎల్‌పి, విజిల్ వర్తీ ఫిల్మ్స్, కెఫెసి ప్రొడక్షన్ నెం.1గా అనూష ద్రోణవల్లి, సీతా కుమారి కొత, గోపాలం లక్ష్మీ దీపక్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు బాబీ కొల్లి, రచయిత కోన వెంకట్ ఈ సమర్పిస్తున్నారు.
ఈ కొత్త సినిమా ఉగాది సందర్భంగా ఘనంగా ప్రారంభమైంది. నవీన్ యెర్నేని, నందిని రెడ్డి, కిషోర్ తిరుమల స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. దిల్ రాజు క్లాప్ కొట్టగా, అనిల్ రావిపూడి కెమెరా స్విచాన్ చేశారు. తొలి షాట్‌కి వివి వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ముహూర్తం వేడుకకు సాహు గారపాటి, మైత్రీ మూవీ మేకర్స్ రవిశంకర్, శరత్ మరార్, సితార నాగ వంశీ, బివిఎస్ రవి తదితరులు హాజరయ్యారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ, 'ఇది చాలా డిఫరెంట్ స్క్రిప్ట్. ఇది చాలా మంచి ప్రాజెక్ట్ అవుతుందని బలంగా నమ్ముతున్నాను. ఖచ్చితంగా అందరికీ కూడా ఆహ్లాదకరమైన సినిమా ఇస్తామని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని తెలిపారు.


విశ్వక్‌సేన్, ఎన్టీఆర్, సిద్దు జొన్నలగడ్డ

టిల్లు.. మన జీవితాల్లో భాగమయ్యాడు : ఎన్టీఆర్

2022లో విడుదలై ఘన విజయం సాధించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. సిద్దు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. భారీ అంచనాలతో మార్చి 29వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'టిల్లు స్క్వేర్' సినిమా.. థియేటర్లలో నవ్వులు పూయిస్తూ కేవలం తొమ్మిది రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టి రూ.150 కోట్ల దిశగా దూసుకుపోతోంది. ఈ క్రమంలో చిత్ర బృందం సోమవారం విజయోత్సవ సభ నిర్వహించింది. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఎంతో వైభవంగా జరిగిన ఈ వేడుకకు హీరో ఎన్టీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత చినబాబు (ఎస్.రాధాకృష్ణ), విశ్వక్ సేన్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఎన్టీఆర్ మాట్లాడుతూ, సిద్దు నటించిన ఈ సినిమా చూశాను. 'డీజే టిల్లుతో సిద్దు కేవలం విజయాన్ని అందుకోవడమే కాకుండా.. మన జీవితంలో కలకాలం మిగిలిపోయే ఒక పాత్రను ఇచ్చాడు. ఒక బ్లాక్ బస్టర్ చిత్రానికి సీక్వెల్ రూపొందించడం అంత తేలికైన విషయం కాదు. సీక్వెల్‌ని అద్భుతంగా తెరకెక్కించిన మల్లిక్ రామ్‌కి హ్యాట్సాఫ్. వంశీ నిర్మాతగా ఇంకా ఇలాంటి అద్భుతమైన సినిమాలు ఎన్నో తీయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.
'100 కోట్ల క్లబ్‌లో చేరిన సిద్దుకి కంగ్రాట్స్. ఈ సినిమా టిల్లు స్క్వేర్ మాత్రమే కాదు రాధిక స్క్వేర్ కూడా' అని త్రివిక్రమ్ చెప్పారు. "టిల్లు..' సినిమా చేసిన తర్వాత నీకేమైనా అవార్డులు వచ్చాయా అని చాలామంది అడుగుతూ ఉండేవారు. అప్పుడు అందరికీ తారక్ అన్న నా గురించి మాట్లాడిన వీడియో చూపించేవాడిని. నేను చెప్పిన డైలాగ్ తారక్ అన్న నోటి నుంచి రావడం కంటే పెద్ద అవార్డు ఇంకోటి ఉండదు. టిల్లు క్యూబ్‌తో మిమ్మల్ని మరింత అలరిస్తాను' అనిసిద్దు జొన్నలగడ్డ తెలిపారు. దర్శకుడు మల్లిక్ రామ్, "తొమ్మిది రోజుల్లో ఈ సినిమా 100 కోట్లు వసూలు చేయడం చాలా సంతోషంగా ఉంది. రెండేళ్ల మా శ్రమకు ఇంత మంచి స్పందనను ఇచ్చి, థియేటర్లు హౌస్ ఫుల్ చేసి.. మాకు ఇంత పెద్ద హిట్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని అన్నారు.

మెప్పించే సూపర్‌హీరో



'శుక్ర, మాటరాని మౌనమిది' వంటి డిఫరెంట్ మూవీస్ తర్వాత దర్శకుడు సుకు పూర్వజ్ రూపొందిస్తున్న కొత్త సినిమా 'ఏ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వాజ్ , ఆషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్ర నిర్మాణంలో ప్రతిష్టాత్మక ఫిల్మ్ ప్రొడక్షన్ స్టూడియో మెర్జ్ ఎక్స్ ఆర్ భాగస్వామి అయ్యింది.
ఈ సంస్థతో కలిసి సినిమా బండి ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీకాంత్ కండ్రేగుల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రేక్షకులకు ఉగాది శుభాకాంక్షలు అందిస్తూ మేకర్స్ ఈ అనౌన్స్ మెంట్ చేశారు.
మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ కలిసిన ఒక న్యూ కాన్సెప్ట్ సూపర్ హీరో మూవీ ఎక్స్‌పీరియన్స్‌ను తెలుగు ప్రేక్షకులకు అందించబోతోంది. అద్భుతమైన విజువల్స్, భారీ మేకింగ్, విజువల్ ఎఫెక్టులతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమా భారీ క్లైమాక్స్ మినహా షూటింగ్ మొత్తం కంప్లీట్ చేసుకుంది.
ఈ ఏడాదిలోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హై స్టాండర్డ్ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో యూనిక్ సూపర్ హీరో ఫిల్మ్‌గా ఇది ఉండబోతోంది.
'ఇటీవల వస్తున్న చిత్రాలతో పోలిస్తే ఇది కచ్చితంగా భిన్నంగా ఉండే సినిమా. ప్రేక్షకులకు సరికొత్త థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది' అని మేకర్స్ తెలిపారు. స్నేహ గుప్త, అర్చనా అనంత్, జయప్రకాశ్, చందు, మనీష్ గిలాడ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ- శివరామ్ చరణ్, సంగీతం- ఆశీర్వాద్, సుమన్ జీవ రతన్, ఎడిటర్ - సుకు పూర్వాజ్, మనోజ్ కుమార్. బి, శివ శర్వాని, స్టంట్స్ - రాజ్ కుమార్ గంగపుత్ర.

విజువల్ వండర్‌గా షణ్ముఖ


ఆది సాయికుమార్, మనోజ్ నందం

'శాసనసభ' అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్‌బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రం నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో షణ్ముగం సాప్పని దర్శకత్వంలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.
ఆది సాయికుమార్ హీరోగా, అవికాగోర్ హీరోయిన్‌గా జంటగా నటిస్తున్న ఈ చిత్ర టైటిల్ లోగోను ఉగాది పర్వదినాన హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ చిత్ర టైటిల్ లోగోను సాప్పని బ్రదర్స్ రిలీజ్ చేశారు.
ఈ సందర్భంగా ఆది సాయికుమార్ మాట్లాడుతూ, 'ఈ టైటిల్ వినగానే నాకు బాగా నచ్చింది. టైటిల్‌లో చాలా పాజిటివ్ వైబ్ ఉంది. మా కథ నచ్చి ఎంతో బిజీగా ఉన్న కూడా రవిబసూర్ సంగీతం అందించడం ఆనందంగా ఉంది. సినిమా కూడా చాలా రిచ్‌గా ఉంటుంది. యూనిక్‌గా ఉండే డిఫరెంట్ కథ ఇది. కంటెంట్ ఈజ్ కింగ్ అని నమ్మి చేసిన ఈ చిత్రం అందరికి నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.
'ఇప్పటి వరకు 70 శాతం షూటింగ్ పూర్తయింది. కథకు యాప్ట్ అయ్యే టైటిల్ ఇది. తప్పకుండా మా కొత్త ప్రయత్నాన్ని అందరూ ఆదరిస్తారని అనుకుంటున్నాను'అని దర్శకుడు షణ్ముఖం చెప్పారు. నిర్మాతల్లో ఒకరైన తులసీ రామ్ సాప్పని మాట్లాడుతూ,'మా తమ్ముడికి సినిమా అంటే పాషన్. అందుకే ఎంతో కష్టపడి ఈసినిమా చేశాడు' అని తెలిపారు.
'ఒక మంచి కథతో రూపొందుతున్న ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చిత్ర నిర్మాత, ఎమ్ఎల్‌సీ రమేష్ యాదవ్ చెప్పారు. అద్భుతమైన విజువల్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి రవిబసూర్ సంగీతం హైలైట్‌గా ఉంటుందని, ఈ చిత్రంలో ఆది చాలా కొత్తగా ఉంటాడని, షాకింగ్‌గా ఉండే విజువల్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా ఉంటాయని మనోజ్ నందం తెలిపారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.